ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు
జిల్లా వార్తలు
బుధవారం 12 నవంబరు 2025

ఆసుపత్రి నుంచి బయలుదేరాం..

- కుమార్తెకు తండ్రి ఫోన్
- 10 నిమిషాల్లోనే మరణవార్త
- మరో కుటుంబంలో భర్తను కోల్పోయిన భార్య

సిరిగార్డెన్స్‌లో విషాదం



నెల్లూరురూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : 'అమ్మా.. గౌసియా.. ఆసుపత్రిలో పని పూర్తయింది. ఇక ఇంటికి బయల్దేరుతున్నాం'.. అని తండ్రి షేక్ ఖాజా నాజీం మొహిద్దీన్, అన్న షేక్ ముజహిద్ అలీ ఫోన్‌లో చెప్పారు. బైక్ పై వారిద్దరూ నారాయణ ఆసుపత్రి నుంచి బయల్దేరారు. హైవేపై ఎన్టీఆర్‌నగర్ ఆర్చీ వద్ద మొక్కజొన్న కంకులు అమ్మే బండి వద్దకు వచ్చే సరికి మృతువులా వచ్చి మినీ కంటైనర్ ఢీకొంది. ఈ దుర్ఘటనలో తండ్రీకొడుకులు మృతి చెందారు.

● నెల్లూరు వెళ్తున్నా...

భార్యకు నెల్లూరు వరకు వెళ్తున్నానని చెప్పిన రియల్టర్ సురేష్ అదే కంటైనర్ ఢీకొని ప్రాణాలు కోల్పోయారు. వీరంతా నెల్లూరురూరల్లోని పెద్ద చెరుకూరు వద్దనున్న సిరిగార్డెన్ వాసులు. దీంతో ఆ ప్రాంతమంతా విషాదఛాయలు నెలకొన్నాయి. ఈ రెండు కుటుంబాల్లోనూ తీవ్ర వేదనకు మిగిల్చాయి.

● షేక్ ముజహిద్ అలీ 1వ డివిజన్ ద్వారకానగర్ సచివాలయంలో శానిటేషన్ సెక్రటరీగా పనిచేస్తున్నాడు. ఏడాది క్రితం కావలి నుంచి బదిలీపై వచ్చాడు. తండ్రి షేక్‌ఖాజా నాజీం మొహిద్దీన్, చెల్లెలు గౌసియా కలిసి సిరిగార్డెన్స్‌లో ఉంటున్నారు. మంగళవారం తండ్రికి ఆరోగ్య పరీక్షలు చేయించాల్సి ఉండటంతో స్కూటీపై ఎక్కించుకుని నారాయణ ఆసుపత్రికి తీసుకెళ్లాడు. తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. కాగా షేక్ ముజహిద్ అలికి పెళ్లి నిశ్చయమైంది. తేదీ ఖరారుకు వచ్చే ఆదివారం ముహూర్తం పెట్టుకున్నారు. ఇంతలో ఈ దుర్ఘటన ఆ కుటుంబంలో పెను విషాదాన్ని నింపింది. కాగా సోమవారం సాయంత్రం ముచ్చటపడి స్కూటర్ కొనుక్కున్నాడు. దాన్ని నడపకుండానే తనువు చాలించాడంటూ చుట్టుపక్కల వారు పేర్కొన్నారు.



ప్రమాదంలో మృతి చెందిన తండ్రీకొడుకులు షేక్ ఖాజా నాజీం మొహిద్దీన్, షేక్ ముజహిద్ అలీ

రియల్ ఎస్టేట్ వ్యాపారి సురేష్ మృతదేహం



మృత్యు శకటం

జాతీయ రహదారిపై బైకులను, చిరు వ్యాపారులను ఢీకొన్న తర్వాత చెట్టును ఢీకొట్టి నిలిచిపోయిన మినీ లారీ

ప్రమాదం జరిగిన చోట చెల్లాచెదురుగా ద్విచక్ర వాహనాలు, కూలి చెట్టు

ఘోరం

నెల్లూరులో రక్తమోడిన హైవే

- బైక్‌ను తప్పించే క్రమంలో రోడ్డు ప్రమాదం
- మూడు బైక్‌లను ఢీకొన్న మినీ కంటైనర్
- ఆపై చిరు వ్యాపారులపైకి దూసుకెళ్లిన వాహనం
- ముగ్గురు మృతి, నలుగురికి గాయాలు
- మృతుల్లో తండ్రీకొడుకులు, ఓ రియల్టరు
- క్షతగాత్రుల్లో లైన్‌మన్ పరిస్థితి విషమం

నెల్లూరు(క్రైం), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరంలోని ఎస్వీజీఎస్ కళాశాల మైదానం సమీపాన జాతీయ రహదారిపై రాయప్పపాలెంకు చెందిన మంజుల తోపుడు బండిపై మొక్కజొన్న కంకులు అమ్ముతూ జీవిస్తోంది... చిల్డ్రన్స్ పార్క్ సమీపంలో నివాసం ఉంటున్న మాలకొండయ్య టాటాఏస్ వాహనంలో కొబ్బరి బోండాలు అమ్ముతూ ఉన్నాడు... ఎవరి పనుల్లో వారుండగా మంగళవారం మధ్యాహ్నం తిరుపతి జిల్లా సూళూరుపేటలో చేపలు అన్‌లోడ్ చేసి నెల్లూరుకు వస్తున్న మినీకంటైనర్ అక్కడికి వచ్చేసరికి, కోటి అనే యువకుడు బైక్‌పై వేగంగా వచ్చి కావలి వైపు యూటర్న్ తీసుకున్నాడు. అతి వేగంగా వస్తున్న మినీకంటైనర్ డ్రైవర్ ఆబైక్‌తోపాటు ముందు వెళుతున్న మరో బైక్‌ను ఢీకొన్నాడు. అంతటితో ఆగక మొక్కజొన్న కంకులు కాలుస్తున్న తోపుడు బండిని తోసుకుంటూ వెళ్లి ముందున్న చెట్టును ఢీకొంది. ఆ చెట్టు కొమ్మ విరిగి అక్కడే నిలిపి ఉన్న టాటాఏస్ వాహనంపై పడింది. ఇదంతా క్షణాల్లో జరిగిపోయింది.

● మృతులంతా సిరిగార్డెన్ వాసులే..

ఈ ప్రమాదంలో నెల్లూరు రూరల్ మండలం అల్లీపురం సిరిగార్డన్‌కు చెందిన తండ్రీకొడుకులు రిటైర్డ్ పీఈటీ షేక్ ఖాజా నాజీం మొహిద్దీన్(70), సచివాలయ ఉద్యోగి షేక్ ముజాహిద్ ఆలీ(35), రియల్టర్ ఏ. సురేష్(35) మృతిచెందారు. రోడ్డుపక్కన మొక్కజొన్న కంకులు అమ్ముకుంటున్న మంజుల, టెంకాయలు విక్రయిస్తున్న మాలకొండయ్య, ఇందుకూరుపేట మండలం కొత్తూరుకు చెందిన లైన్‌మన్ ఈ అనీల్ గాయపడి మెడికవర్‌లో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మోటారు సైక్లిస్టు కోటి జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. లైన్‌మన్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. కాగా సంఘటన స్థలాన్ని ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల, నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి పరిశీలించారు. నార్త్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు. మున్సిపల్ మంత్రి నారాయణ, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి బాధితులను పరామర్శించారు.



ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్నవారు



ఘటనా స్థలంలో ఎస్పీ అజిత

● ట్రాఫిక్ అంతరాయం

హైవేపై ఈ ప్రమాదం గురించి తెలుసుకున్న ప్రజలు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ట్రాఫిక్ సీఐలు రామకృష్ణ, వెంకటరెడ్డి, చిన్నబజారు, నవాబుపేట, బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్లు చిట్టెం కోటేశ్వరరావు, వేణుగోపాల్‌రెడ్డి, సాంబశివరావు, సంఘటనా స్థలానికి చేరుకొని ప్రజలను హైవేపైకి వెళ్లకుండా అదుపు చేసి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.



ప్రమాద స్థలిలో గుమిగూడిన ప్రజలు, పోలీసులు



ఆసుపత్రిలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న మంత్రి నారాయణ, నుడా ఛైర్మన్ కోటంరెడ్డి, తండ్రీ కొడుకుల మృతదేహాలకు నివాళి అర్పిస్తున్న సోమిరెడ్డి

టెన్త్ పరీక్ష ఫీజు 25లోగా చెల్లించాలి

నెల్లూరు(విద్య), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి పబ్లిక్ పరీక్షలకు ఈనెల 25లోగా ఆన్‌లైన్‌లో పరీక్ష ఫీజు చెల్లించాలని డీఈవో డాక్టర్ ఆర్. బాలాజీరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.50 అపరాధ రుసుముతో డిసెంబరు 3 వరకు, రూ.200 అపరాధ రుసుముతో డిసెంబరు 10 వరకు, రూ.500ల అపరాధ రుసుముతో డిసెంబరు 15లోగా చెల్లించాలన్నారు. రెగ్యులర్ విద్యార్థులు అన్నీ సబ్జెక్టులకు రూ.125లు, మూడు సబ్జెక్టులపైన రూ.125లు, మూడు సబ్జెక్టుల వరకు రూ.110లు, ఒకేషనల్ విద్యార్థులు అదనంగా రూ.60లు చెల్లించాలన్నారు. జిల్లాలోని అన్నీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ డాట్ బీఎస్‌ఈ డాట్ ఏపీ డాట్ జీఓవీ డాట్ ఇన్ వెబ్‌సైట్‌లో పాఠశాల లాగిన్ నుంచి మాత్రమే ఫీజులు చెల్లించాలన్నారు. పరీక్ష రాసేందుకు వయసు తక్కువ ఉన్న పిల్లలు అండర్ ఏజ్ సర్టిఫికెట్ ఫీజు రూ.300 కూడా ఆన్‌లైన్‌లో చెల్లించాలన్నారు. సీఎఫ్‌ఎంఎస్ ద్వారా, బ్యాంక్ చలాన్లను అంగీకరించబోమని తెలిపారు. మరిన్ని వివరాలకు వెబ్‌సైట్‌లో కానీ లేదా నగరంలోని దర్గామిట్ట జడ్పీ పాఠశాలలో ఉన్న జిల్లా పరీక్షల విభాగంలో కానీ సంప్రదించాలని డీఈవో తెలిపారు.



కలెక్టరుకు పుష్పగుచ్ఛం అందచేస్తున్న డ్వామా పీడీ గంగాభవాని

డ్వామాకు కేంద్ర ప్రభుత్వ ఆవార్డు

- 'జల్ సంచయ్'కు దక్కిన పురస్కారం
- 18న రాష్ట్రపతి నుంచి అందుకోనున్న కలెక్టర్ శుక్లా

నెల్లూరు,(జడ్పీ), నవంబరు11(ఆంధ్రజ్యోతి): డ్వామాకు కేంద్ర ప్రభుత్వ అవార్డు దక్కింది. జల్ సంచయ్ జన్‌భాగీదారి పథకానికి సంబంధించి కేంద్రం సూచించిన విధివిధానాలకు, లక్ష్యాలకు అనుగుణంగా పనులు నిర్వహించటంతో డ్వామాకు ఈ అవార్డును ప్రకటించింది. నీటిని సంరక్షించటం, భూగర్భ జలాల పెంపునకు కృషి చేయడం, నీటి వనరులను పెంపొందించడంతో ఇంకుడు గుంతలు, ఊట చెరువులు, చెక్ డ్యామ్‌లు రింగ్ ట్రెంచర్లు, సరిహద్దు కందకాలు, నీటినిల్వ కందకాలు, చెరువుల్లో పూడికతీత వంటి పనులను నిర్దేశిత లక్ష్యాలకు అణుగుణంగా చేయడంతో డ్వామాకు ఈ అవార్డు దక్కినట్లు పీడీ గంగాభవాని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 18న ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఈ అవార్డును స్వీకరిస్తారని ఆమె తెలిపారు.

నేడే గృహ ప్రవేశాలు

- పేదల కోసం పూర్తయిన 19,678 ఇళ్లు
- లబ్ధిదారులకు ఇళ్లపత్రాలు అందజేయనున్న అధికారులు

నెల్లూరు, (జడ్పీ), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పేదల సొంత ఇంటి కలను ప్రభుత్వం నెరవేర్చబోతుంది. ఇప్పటికే పూర్తయిన ఇళ్లను లబ్ధిదారులకు అందచేయాలని మంగళవారం జిల్లాధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో హౌసింగ్ అధికారులు నియోజకవర్గాల వారీగా పూర్తయిన ఇళ్లపత్రాలను బుధవారం లబ్ధిదారులకు అందచేయనున్నారు.



● 19,678 ఇళ్లలోకి..

జిల్లాలో పీఎంఏవై పథకం కింద 97,445 గృహలు మంజూరయ్యాయి. వీటిలో 68,326 గృహాల పనులు గతంలోనే ప్రారంభమయ్యాయి. రూ.887కోట్లతో ఈ పనులను డిసెంబరు 2026 నాటికి పూర్తి చేయ్యాల్సి ఉంది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో 3లక్షల గృహాలను నవంబరు 12కి అందించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా జిల్లాధికారులు 19,678 గృహాలను పూర్తి చేశారు. అన్నీ నియోజకవర్గాల్లో పూర్తయిన గృహాలను లబ్ధిదారులకు బుధవారం అందజేస్తున్నట్లు హౌసింగ్ పీడీ వేణుగోపాల్ తెలిపారు. ఆత్మకూరు నియోజకవర్గంలో 1490. కందుకూరులో 1059, కావలిలో 4756 కోవూరులో 2015. నెల్లూరు నగరంలో 2963, రూరల్‌లో 2602, సర్వేపల్లిలో 2357, ఉదయగిరిలో 1645, వెంకటగిరిలో 791 గృహలు పూర్తిఅయ్యాయి. వీటిని లబ్ధిదారులకు అందచేస్తారు.

పశుసంవర్ధక శాఖలో ఐదుగురికి పదోన్నతులు

నెల్లూరు(వ్యవసాయం), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పశుసంవర్ధక శాఖలో పనిచేస్తున్న ఐదుగురు సహాయ సంచాలకులకు డిప్యూటీ డైరెక్టర్లుగా పదోన్నతి కలిస్తూ ప్రభుత్వం మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. కావలిలో పనిచేస్తున్న ఏడీ రసూల్‌కు మదనపల్లి డీడీగా, రాపూరు ఏడీగా పనిచేస్తున్న అనీల్‌కుమార్‌ను తిరుపతి డీడీగా, దుత్తలూరు ఏడీ ప్రసన్నకుమార్ రెడ్డిని చిత్తూరు డీడీగా, ఇందుకూరుపేట ఏడీ మురళిని ఒంగోలు డీడీగా, ఏడీ జయచంద్రకు ఒంగోలు డీడీగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

అంతా మా ఇష్టం!

- ఆర్అండ్‌బీలో వర్కింగ్ అరేంజ్‌మెంట్ల దందా
- ఇష్టానుసారం ఓచోట నుంచి మరో చోటుకు..
- ఇటీవల 15 మంది ఉద్యోగుల బదిలీ
- ఖాళీలేకపోయినా కూడా ఆర్డర్స్
- డిప్యుటేషన్లు వద్దని కలెక్టర్ చెప్పినా డోంట్‌కేర్

నెల్లూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఏడాదికి ఓసారి ప్రభుత్వం ఉద్యోగులను బదిలీ చేస్తోంది. అర్హతలు, ఖాళీలను బట్టి ఈ ప్రక్రియ జరుగుతుంది. అయితే రోడ్లు, భవనాల శాఖలో మాత్రం ఎప్పుడుపడితే అప్పుడు బదిలీలు జరుగుతాయి. వడ్డించేవాడు మనవాడైతే.. అన్న సామెతగా అధికారులు తమకు అనుకూలమైన ఉద్యోగులను వారికి నచ్చిన చోటకు పంపుతున్నారు. అక్కడ ఆ ఉద్యోగి అవసరముందా..? అసలు అక్కడ ఖాళీ ఉందా..? ఒకవేళ వేరేచోటకు పంపితే ఉన్న చోట పరిస్థితి ఏమిటి..? అన్నది పట్టించుకోవడం లేదు. తమ రూటే 'సెపరేటు' అన్న ధోరణిలో ఖాళీలు లేని చోటకు కూడా బదిలీ చేస్తూ ఆర్డర్స్ వేస్తున్నారు. వర్కింగ్ అరేంజ్ మెంట్స్ పేరుతో ఆర్అండ్‌బీలో పెద్ద దందానే జరుగుతున్నట్లు

మిగతా 7వ పేజీలో..



త్వరలో పారిశ్రామికవేత్తల సదస్సు

- అసెంబ్లీ సెగ్మెంట్‌కు ఓ ఎంఎస్‌ఎంఈ పార్కు
- రెండు ప్రాజెక్టులకు సీఎం వర్చువల్‌గా ప్రారంభం : కలెక్టర్

నెల్లూరు(వెంకటేశ్వరపురం), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కొత్త పరిశ్రమల ఏర్పాటు కోసం త్వరలోనే పారిశ్రామికవేత్తల సదస్సు నిర్వహించనున్నట్లు కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంగళవారం వర్చువల్‌గా ఎంఎస్‌ఎంఈ పార్క్, స్నేహ ఫామ్స్ ప్రైవేటు లిమిటెడ్ పరిశ్రమలకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిలతోపాటు పలువురు పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతీ నియోజకవర్గంలో ఓ ఎంఎస్‌ఎంఈ పార్క్‌ను ఏర్పాటు చేయలన్నది ముఖ్యమంత్రి లక్ష్యమన్నారు. ఇప్పటికే జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలో ఎంఎస్‌ఎంఈ పార్క్‌లను ప్రారంభించినట్లు తెలిపారు. తాజాగా సర్వేపల్లి నియోజకవర్గ పరిధిలోని రామరాజుకండ్రిగ వద్ద 57.50 ఎకరాల్లో ఎంఎస్‌ఎంఈ పార్క్‌తోపాటు మత్రిపాడు మండలం పొంగూరు వద్ద స్నేహ ఫామ్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీకి సీఎం వర్చువల్‌గా శంకుస్థాపన చేశారని కలెక్టర్ వివరించారు. త్వరలోనే బీపీసీఎల్‌కు భూమి పూజ నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో కొత్తగా పరిశ్రమల ఏర్పాటుకు పలువురు పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నట్లు తెలిపారు. దీంతో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కలుగుతాయన్నారు. ఎమ్మెల్యే సోమిరెడ్డి మాట్లాడుతూ రామదాసుకండ్రిగలో ఎంఎస్‌ఎంఈ పార్క్‌కు సీఎం శంకుస్థాపన చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. జిల్లాలో అదానీ కృష్ణపట్నం పోర్టు, రామాయపట్నం పోర్టు అనుసంధానంగా అనేక పరిశ్రమలు ఏర్పాటు కానున్నట్లు తెలిపారు. సర్వేపల్లి నియోజకవర్గంలో మడమనూరు,బండేపల్లి గ్రామాల్లో గతంలో కృష్ణపట్నం పోర్టుకు ఇచ్చిన 2,600 ఎకరాలు ఖాళీగా ఉన్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ జెడ్ఎం శివకుమార్, డీజెడ్ఎం బ్రహ్మయ్య పలువురు పారిశ్రామిక వేత్తలు తదితరులు పాల్గొన్నారు.



శిలాఫలకం ఆవిష్కరణలో కలెక్టర్ శుక్లా, ఎమ్మెల్సీ కల్యాణ్ చక్రవర్తి, ఎమ్మెల్యే సోమిరెడ్డి, పారిశ్రామికవేత్తలు

ప్రభుత్వ భూమి ఆక్రమణపై సర్వే

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగమాంబాపురం గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 106లో కొంత ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందని ఇటీవల కలెక్టర్ గ్రీవెన్స్‌లో కొందరు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం తహసీల్దారు అంబటి వెంకటేశ్వర్లు, వీఆర్వో అక్రమ్, సర్వేయర్‌లు సర్వే చేపట్టి 78 సెంట్లు ప్రభుత్వ శివాయి భూమి ఆక్రమించినట్లు నిర్ధారించామని తహసీల్దారు తెలిపారు.



బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 11884
వెండి కిలో ధర	రూ. 158800
వెండి ఒక గ్రాము	రూ. 154.80

లేగుంటపాడులో 'పొలం పిలుస్తోంది'



లేగుంటపాడు పొలాల్లో వరి నారుమడులను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

కోవూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని లేగుంటపాడు, వేగూరు గ్రామాల్లో మంగళవారం వ్యవసాయాధికారులు పొలంపిలు స్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ విస్తరణాధికారి ఆసిమా మాట్లాడుతూ రైతులు గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్ర దించి యూరియా పంపిణీ పత్రాలు పొందాలన్నా రు. ఎకరాకు మూడు బస్తాల యూరియా పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. 5 సెంట్ల నారుమడికి 2 కిలోల నత్రజని, ఒక కిలో భాస్వరం, ఒక కిలో పొటాష్ ఎరువులు దుక్కిలో వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఏ డీ.కీర్తన, వీహెచ్ఏ శిరీష, ఎంపీఈవో మౌనిక, లేగుంటపాడు గ్రామ సర్పంచు పీ.వేణుగోపాల రెడ్డి, వేగూరు గ్రామనాయకులు కరేటి శ్రీనివాసులు పాల్గొన్నారు.

విత్తన శుద్ధిపై రైతులకు అవగాహన



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏడీఏ రఘునాథరెడ్డి

ఇందుకూరుపేట, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని జగదేవిపేటలో రైతులకు మంగళవారం విత్తనశుద్ధిపై అవగాహన కల్పించారు. ఇన్‌చార్జ్ ఏడీ రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన పొలం పిలు స్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వరినారు పోసుకునే ప్రతి రైతు విత్తనశుద్ధి నిర్వహించుకోవాలన్నారు. ఒక కేజీ విత్తనానికి మూడు గ్రాముల కార్బన్‌డిజమ్‌తో విత్తనశుద్ధి చేసుకోవడం వల్ల తొలి విడతలోని శిలీంధ్ర కారక వ్యాధులను అరికట్టవచ్చని తెలిపారు. విత్తన శుద్ధి చేయకుండా నారు పోసిన రైతులు కార్బన్‌డిజంతో మాంకోజెబ్ కలిపి 2.5 గ్రాములు ఒక లీటరు నీటికి కలుపుకుని, పిచికారి చేయడం వల్ల కూడా శిలీంధ్ర వ్యాధుల నుంచి ఉపశమనం పొందవచ్చన్నారు. కాగా నవంబరు 20వ తేదీ లోపల బీపీటీ-5204, 20వ తేదీపైన కేఎస్‌ఎం-1638, ఆర్‌ఎన్ఆర్-15048 వంటి వరి రకాలు సాగుకు అనుకూలమని తెలియజేశారు. మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో బీపీటీ 5203 కేఎస్‌ఎం1638 విత్తనాలు సబ్సిడీపై అందుబాటులో ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల విద్యార్థులు, వీహెచ్ఏ దీక్షిత, గ్రామ రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కామాక్షితాయి అన్నదానానికి విరాళం

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన పథకానికి తిరుపతి జిల్లా శ్రీకాళహస్తికి చెందిన ఆర్ వర్షిణి పేరుతో రూ.10,116, కే.పద్మిని పేరుతో రూ.10వేలు విరాళాలను కుటుంబ సభ్యులు మంగళవారం అందజేశారు. అనంతరం దాతలు రాంబాబు దంపతులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.

ఘనంగా అబుల్ కలాం జయంతి



వెంకటాచలం: కలాం చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న వీసీ, వర్సిటీ ఉద్యోగులు

వెంకటాచలం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): దేశ నిర్మాణంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్‌ది కీలకపాత్ర అని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డా. కే సునీత అన్నారు. కలాం జయంతి సందర్భంగా మంగళవారం వీసీలో ఆయన చిత్రపటానికి ఉద్యోగులు, సిబ్బంది నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ ఆజాద్ భారత స్వాతంత్ర్య సమరయోధుడు, విశిష్ట విద్యావేత్త, భారతదేశ నిర్మాణంలో కీలకపాత్ర పోషించిన మహనీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సిహెచ్ విజయ, ఆచార్య టి. వీరారెడ్డి, ఎన్ఈపి కోఆర్డినేటర్ డా. ఆర్ మధుమతి, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డా. అల్లం ఉదయ్‌శంకర్, పీఆర్వో డా. కోట నీలమణికంఠ పాల్గొన్నారు.

● **రాపూరు :** దేశ తొలి విద్యాశాఖ మంత్రి, విద్యావేత్త మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని రాపూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆజాద్ చిత్రపటానికి ఎంపిడివో మార్లెళ్ల భవాని, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏవో దశరధరామయ్య, టిడిపి నాయకులు నల్లవడ్ల వెంకటరమణారెడ్డి, మధురెడ్డి, సీనియర్ అసిస్టెంట్ చంద్ర, ప్రభుత్వ సిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరికి బెస్ట్ టీచర్స్ అవార్డు

అనంతపురం(రూరల్), నవంబరు 11(ఆంధ్రజ్యోతి): అనంతపురం జేఎన్‌టీయూలో మంగళవారం యూనివర్సిటీ అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. ఈకార్యక్రమానికి వైస్ చాన్సలర్ సుదర్శన రావు, రిజిస్ట్రార్ కృష్ణయ్య, ఓఎస్‌డీటూ వీసీ ఆచార్య దేవన్న హాజరయ్యారు. అవార్డు అందుకున్న వారిలో మాధవిత (శ్రీవెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఫార్మసీ, నెల్లూరు), మురళీకృష్ణ (గీతాంజలి ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్సు అండ్ టెక్నాలజీ, నెల్లూరు) ఉన్నారు.

రైతులకు యూరియా పంపిణీ

పొదలకూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇనుకుర్తి రైతు సేవా కేంద్రంలో రైతులకు వ్యవసాయ అధికారులు, టీడీపీ నాయకులు యూరియా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న పీఏసీఎస్ డైరెక్టర్ కోడూరు పెంచలభాస్కర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఇనుకుర్తి సచివాలయం పరిధిలోని ముదిగేడు, ఇనుకుర్తి, మర్రిపల్లి గ్రామాల రైతులకు 450 బస్తాలు యూరియా పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఇనుకుర్తి సర్పంచ్ పెదమల్లు శ్రీనివాసులురెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ గంటా మల్లికార్జున్‌యాదవ్, అగ్రికల్చర్ అసిస్టెంట్ హేమలత, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడిగా పెంచలయ్య

పొదలకూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ సంఘం మండల ఉపాధ్యక్షుడిగా పట్టణానికి చెందిన చప్పరం పెంచలయ్యను బీసీ సంక్షేమ సంఘం నాయకులు మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బీసీల అభివృద్ధి కోసం పాటుపడతానని, జ్యోతిబాపూలే ఆశయాలను కొనసాగిస్తామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. పట్టణంలోని పలువురు బీసీ నాయకులు పెంచలయ్యకు అభినందనలు తెలిపారు.

పంట కాలువలు కనుమరుగు!

● పూడికతీతకు నోచుకోక సాగునీటికి రైతుల అవస్థ

● పట్టించుకోని సాగునీటి సంఘాలు, అధికారులు

కోవూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలో పలు ప్రధాన పంట కాలువల్లో గుర్రపుడెక్క, తుంగ, పిచ్చి మొక్కలు ఏపు పెరిగి రూపుకోల్పోయాయి. ఆయా కాలువల్లో ఏళ్ల తరబడి పూడికతీత పనులు చేపట్టకపోవడంతో సాగునీటి పారుదల సక్రమంగా లేక రైతులు అవస్థలు పడుతున్నారు. ఇటీవల సంవృద్ధిగా వర్షాలు కురిసి చెరువులకు పుష్కలంగా నీరు చేరినప్పటికీ నీటి పారుదల కాలువలు పూడిపోవడంతో పొలాలకు సాగునీరందడం లేదు. దీనిపై అటు నీటి సంఘాల అధ్యక్షులు, సంబంధిత అధికారులు దృష్టి సారించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. మండల పరిధిలోని పాటూరు, కోవూరు, పోతిరెడ్డిపాళెం, గంగవరం గ్రామాల్లో పంట కాలువల్లో పూడిక తీయకపోవడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. గతంలో నవంబరు నెల ప్రారంభానికి ముందే సాగునీటి సంఘం ఆధ్వర్యంలో ప్రధాన కాలువలతోపాటు చిన్న, పిల్ల కాలువులకు పూడిక తీసి కట్టలు సరిదిద్దేవారు. ప్రధానంగా మలిదేవి వాగు పూడికతీతకు రూ.కోట్లలో ఖర్చుపెట్టేవారు. ఇటీవల కాలంలో పలు కాలువలు పూడిపోయాయి. కొన్నింటిలో బుడగతామర మొలచి సాగునీటి ప్రవాహాన్ని నిరోధిస్తోంది. మండల పరిధిలోని చుండు కాలువ, చీలికాలువ, బుర్రగుంటకాలువ, దుంపరకాలువ, గంగవరం కాలువలు బుడగతామరతో నిండిపోయాయి. పాటూరులోని చుట్టుకాలువ కింద సుమారు 300 ఎకరాల్లో పంటలు సాగుచేస్తుండగా పచ్చి గడ్డి మొలచి కాలువ పూడిపోయింది. కాలువల్లో పిచ్చిచెట్లు మొలచి మట్టితో నిండిపోయాయి. దీంతో సాగునీరందక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంటకాలువలకు పూడిక తీయించాల్సిందిగా రైతులు నీటి పారుదల శాఖాధికారులకు, సాగునీటి సంఘాలకు విజ్ఞప్తి చేస్తున్నారు.



పిచ్చి మొక్కలు, గుర్రపు డెక్కతో రూపు కోల్పోయిన కోవూరు పంట కాలువ



గుర్రపు డెక్కతో నిండిన నందలగుంట సమీపంలోని పంట కాలువ

పూడికతీత ఎప్పుడో?

కోవూరులోని పంట కాలువ గత ఏడాది కాలంగా పచ్చిగడ్డి, గుర్రపుడెక్కతో నిండిపోయింది. కాలువకు పూడిక తీయకపోవడంతో పొలానికి నీరు అందడం లేదు. కోవూరు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వెంటనే నీటి పారుదల శాఖాధికారులు స్పందించి పూడికతీత పనులు చేపట్టాలి

- ఈగ శ్రీనివాసులు, రైతు, కోవూరు

పిచ్చిచెట్లు తొలగించాలి

పాటూరు చుట్టు కాలువ పిచ్చి చెట్లతో నిండిపోయింది. సాగునీరందక ఇబ్బందులు పడుతున్నాం. గుర్రపుడెక్కను, చెత్త, పిచ్చిచెట్లను మేమే తొలగిస్తున్నాం. కాలువలో పూడికతీత పనులు చేపట్టాలి. రాబోయే సీజన్‌కు ఈ కాలువలో పూడికతీయించేందుకు అధికారులు, పాలకులు చర్యలు తీసుకోవాలి.

- గండవరపు రామయ్య, రైతు, పాటూరు

యూరియా కోసం రైతుల పడిగాపులు

● పంపిణీకి సర్వర్ల సమస్య, సిబ్బంది కొరత

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులు సొసైటీలు వద్ద పడిగాపులు కాసిన సంఘటన మంగళవారం బుచ్చిరెడ్డిపాళెంలోని వవ్వేరు కోఆపరేటివ్ సొసైటీ, బుచ్చి కోఆపరేటివ్ సొసైటీకి సంబంధించి రేబాల గోడౌన్ల వద్ద నెలకొంది. ఓ వైపు సర్వర్ల సమస్య, మరోవైపు సిబ్బంది కొరతతో రైతులు గంటల తరబడి నిరీక్షించక తప్పలేదు. ప్రభుత్వం సబ్సిడీపై ఇచ్చే యూరియా పక్కదోవ పట్టకుండా రైతులకు కార్డులు పంపిణీ చేసి ఆ మేరకు సొసైటీలు, రైతు సేవా కేంద్రాలలో యూరియా పంపిణీకి శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలో వవ్వేరు, బుచ్చి కోఆపరేటివ్ సొసైటీలలో రైతులకు యూరియా పంపిణీకి ఒక్కొక్క వీఏఏ(గ్రామ వ్యవసాయ సహాయకులు)ని ఏర్పాటు చేశారు. ఆ వ్యక్తి ఒక్కో రైతుకు సంబంధించిన కార్డు పరిశీలించి వివరాలు నమోదు చేసుకుని యూరియా అందించేందుకు సుమారు 40 నిమిషాలు పడుతుంది. ఈ వివరాలన్నీ ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు సమయం పడుతుండడంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. కాగా మండలంలో రబీ సీజనుకు 1600 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు అవసరం కాగా ఇప్పటి వరకు 500 మెట్రిక్ టన్నులు పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయాధికారి శ్రీహరి తెలిపారు. దామరమడుగు సొసైటీ నుంచి 800 బస్తాలు యూరియా పూర్తిగా పంపిణీ చేయగా, బుచ్చి సొసైటీలో 300 బస్తాలు, వవ్వేరు సొసైటీలో 200 బస్తాలు ఉందని తెలిపారు. వవ్వేరు 12వందల బస్తాలు, ఇస్కపాళెం 400బస్తాలు, కాగులపాడు 300, పంచేడు ఆర్ఎస్‌కేలో 100 బస్తాలు యూరియా పంపిణీ చేసినట్లు తెలిపారు.

నిస్వార్థ సేవకుడు తాళ్లూరు రమణయ్యనాయుడు



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

దగదర్తి(బిట్రగుంట), నవంబరు 11(ఆంధ్రజ్యోతి): నిస్వార్థ సేవకుడు తాళ్లూరు రమణయ్య నాయుడు అని నెల్లూరు కిమ్స్ వైద్యశాల డాక్టర్ రామానాయుడు అన్నారు. తాళ్లూరు రమణయ్య నాయుడు ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు కిమ్స్ హాస్పిటల్ వారిచే మంగళవారం మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వైద్యులు నాగరాజు, ఉదయ్‌కిరణ్, మొరాజ్, సన్నీష్‌రెడ్డి, శ్రీనివాసులు, భగీరథ, మెడికల్ కోఆర్డినేటర్ శ్రీధర్‌రెడ్డి పాల్గొన్ని రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందచేశారు. దగదర్తి మండలంలోని వివిధ పంచాయతీలకు చెందిన వందల మంది హాజరయ్యారు. పలువురు నేతలు తాళ్లూరు రమణయ్య నాయుడు చిత్రపటానికి పుష్పాలతో నివాళులర్పించారు. పేద ప్రజలకు వైద్యసేవలందించిన తాళ్లూరు కుటుంబ సభ్యులను అభినందించారు.

కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణంపై ఉన్నతాధికారులతో చర్చిస్తా : ఈడీ



ఆర్టీసీ బస్టాండ్‌ను పరిశీలిస్తున్న ఈడీ నాగేంద్రప్రసాద్

మనుబోలు, నవబంరు 11 (ఆంధ్రజ్యోతి): వృథాగా ఉన్న బస్టాండును తొలగించి ఆర్టీసీ ఖాళీ స్థలంలో కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మించేలా ఆలోచిస్తున్నామని నెల్లూరు జోన్-3 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడి) నాగేంద్రప్రసాద్ అన్నారు. మంగళవారం ఆర్టీసీ అధికారులు మనుబోలులో బస్టాండు ప్రాంగణాన్ని, వెనుక ఉన్న ఆర్టీసీకి చెందిన ఖాళీ స్థలాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్టాండుతో పాటు, ఖాళీ స్థలం 20సెంట్ల వరకు ఉన్నదన్నారు. చాలా సంవత్సరాలుగా బస్టాండు వృధాగా ఉన్నదన్నారు. ప్రయాణికులు దీనిని ఉపయోగించడం లేదని, కావున దీనిని తీసేసి ఈ స్థలాన్ని ఆర్టీసికి ఉపయోగపడే నిర్మాణాలు చేయలా, కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మించాలా అని ఉన్నతాధికారులతో చర్చిస్తామన్నారు. ఒకవేళ హైవే విస్తరణ జరిగితే ఆర్టీసీ స్థలం ఎంతమేర పోతుందో చూసుకుని, తరువాత పరిశీలించి నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి వేమిరెడ్డి అండ

● రూ. 5లక్షల చెక్కు అందజేసిన వీపీఆర్ సిబ్బంది



చెక్కును అందజేస్తున్న వీపీఆర్ సిబ్బంది

వింజమూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కర్నూలు రోడ్డు ప్రమాద ఘటనలో మృతి చెందిన వింజమూరు మండలం గోళ్లవారిపల్లెకు చెందిన గోళ్ల రమేష్ కుటుంబ సభ్యులకు నెల్లూరు పార్లమెంటు సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆర్థికసాయం అందించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించిన సమయంలో తనతరపున రూ.5లక్షలు అందజేస్తానని ఇచ్చిన హామీ మేరకు మంగళవారం మృతుడు రమేష్ తండ్రి మాలకొండయ్య, తల్లి సుశీలకు వీపీఆర్ సిబ్బంది శంకర్, రమేష్, తదితరులు చెక్కును అందచేశారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి బాధిత కుటుంబానికి ఎప్పుడూ అండగా ఉంటారని వారు తెలిపారు. బాధిత కుటుంబ సభ్యులు కొండా మహేశ్వరరావు మాట్లాడుతూ ఇచ్చిన మాట మేరకు తమ కుటుంబానికి అండగా నిలబడిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

పిల్లలకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలి

● సీడీపీవో లక్ష్మీదేవి



నరుకూరులో అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న సీడీపీవో లక్ష్మీదేవి

తోటపల్లిగూడూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ పిల్లలకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని ఇందుకూరుపేట సెక్టర్ సీడీపీవో కె లక్ష్మీదేవి సూచించారు. మండలంలోని పేడూరు సెక్టార్ నరుకూరు అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం సీడీపీవో తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నరుకూరులో ఉన్న మూడు అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశామని తెలిపారు. పిల్లలకు నాణ్యతతో కూడిన ఆహారాన్ని అందిస్తున్నారని, ఆకుకూరలు, కోడిగుడ్డు ఆహారాన్ని అందిస్తే పిల్లల ఎదుగుదల బాగా ఉంటుందని తెలిపారు. గర్భిణులు కూడా పోషకాహారాన్ని తీసుకోవాలని ఆమె తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ లలితాంబ, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యుత్ బకాయిలు చెల్లించాలి



విద్యుత్ కార్యాలయంలో మాట్లాడుతున్న డీఈ సుబ్రమణ్యం

మనుబోలు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో వ్యవసాయ విద్యుత్ బకాయిలు రూ. 15లక్షలు వరకు ఉన్నాయని విద్యుత్ శాఖ డిఈ సుబ్రమణ్యం తెలిపారు. స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయంలో సిబ్బందితో ఆయన బిల్లుల బకాయిలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ విద్యుత్ బిల్లు కేవలం నెలకు రూ.30 మాత్రమేనన్నారు. దీనిని కూడా రైతులు చెల్లించక వేల రూపాయలు బకాయిలు పెడుతున్నారన్నారు. బకాయిలు చెల్లించి రైతులు విద్యుత్ శాఖకు సహకరించాలన్నారు. వీధిలైట్లు పగటిపూట వెలగకుండా పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడైనా లోవోల్టేజీ సమస్యలు, ఇతరత్రా విద్యుత్ సమస్యలు, సిబ్బంది అందుబాటులో లేకపోయినా అధికారుల దృష్టికి తీసుకురావాలని, వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ అనీల్‌కుమార్, ఎల్ఐ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మనుబోలుకు పలు అభివృద్ధి పనుల మంజూరు

మనుబోలు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చొరవతో మండలంలో పలు అభివృద్ధి పనులు మంజూరైనట్లు టీడీపీ మండలాధ్యక్షుడు పొన్నూరు రామకృష్ణయ్య మంగళవారం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మనుబోలులో మాట్లాడుతూ మండలంలో కొమ్మలపూడి, కాగితాలపూరు గ్రామాల్లో పంచాయతీ భవనాలు కొత్తవి నిర్మించేందుకు ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందన్నారు. అలాగే 15వ ఆర్థిక సంఘం నిధులతో మండలంలో బద్దెవోలు, గురివిందపూడి, జట్లకొండూరు, కాగితాలపూరు, వీరంపల్లి, వెంకన్నపాళెం, మనుబోలు-2లో విలేజ్ క్లినిక్‌లు నిర్మించేందుకు జీవో విడుదలైందన్నారు. ఒక్కో పంచాయతీ భవనానికి రూ. 32లక్షలు, ఒక్కో విలేజ్ క్లినిక్ రూ.36లక్షలతో నిర్మించేలా జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారన్నారు. త్వరలోనే ఎమ్మెల్యే వీటి నిర్మాణాలకు శ్రీకారం చుట్టనున్నారని పొన్నూరు తెలిపారు..

ఎర్రగుంటలో ఉచిత వైద్యశిబిరం

వెంకటాచలం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రగుంటలో ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 150మందికి పలురకాల వైద్యపరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యశిబిరం నిర్వాహకులు డా. మహేష్, ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం సమన్వయకర్త డా. బి. వెంకటసుబ్బారెడ్డి, స్థానిక నాయకులు వేణు, సునీల్ పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S


అగ్నిప్రమాదంలో రెండు దుకాణాల దగ్ధం



అగ్నికి ఆహుతైన రెండు దుకాణాలు

సీతారామపురం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పబ్బులేటి పల్లి రోడ్డు సెంటర్‌లో జాతీయ రహదారి పక్కన గల రెండు దుకాణాలు మంగళవారం అగ్నికి ఆహుతయ్యాయి. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రోడ్డు సెంటర్లో కడుగు లక్ష్మయ్య పెట్రోల్, డీజల్ లూజు విక్రయాలతో పాటు కూల్‌డ్రింక్స్, జిరాక్స్, కిరాణా షాపులను నిర్వహిస్తుండగా, పక్కనే మరో గదిలో బూతపాటి వెంకటమ్మ టైలరింగ్ షాపుతో పాటు చీరల దుకాణం నిర్వహిస్తోంది. ఈనేపధ్యంలో మంగళవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో కడుగు లక్ష్మయ్య దుకాణంలో ఆకస్మాత్తుగా మంటలు చెలరేగి పక్కనున్న దుకాణంలో కూడా మంటలు వ్యాపించడంతో చీరలు దుస్తులన్నీ కాలిపోయాయి. లక్ష్మయ్య దుకాణంలోని సామాగ్రి కూడా అగ్నికి ఆహుతి అయింది. ఉదయగిరి నుంచి ఫైర్ ఇంజన్ వచ్చేలోపు రెండు దుకాణాల్లోని సామాగ్రి అంతా కాలిపోయింది. సుమారు రూ. 5 లక్షల మేరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు అంచనా. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

రెండు బైకులు ఢీకొని ముగ్గురికి తీవ్రగాయాలు



బైకులు ఢీకొన్న ప్రమాదంలో గాయపడిన వ్యక్తులు

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాగులపాడు సెంటర్ సమీపంలోని నాగమాంబాపురం రోడ్డు మలుపులో ముంబై జాతీయ రహదారిపై రెండు బైకులు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల మేరకు... మంగళవారం ఓ బైక్‌పై గురజాల వెంకటేశ్వర్లు, ఆమారి వెంకటరమణయ్యలు నెల్లూరు నుంచి బుచ్చికి వస్తూ కాగులపాడు సెంటర్ సమీపంలోని జాతీయ రహదారిపై నాగమాంబాపురం వెళే రోడ్డు వైపు మలుపు తిరుగుతుండగా వెనుక నుంచి మరో బైకులో వచ్చిన మండలంలోని ఖాజానగర్ చెందిన ఎస్‌కే.సోను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో గాయపడిని ముగ్గురిని స్థానికులు చికిత్స నిమితత్తం బుచ్చి ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం అనంతరం నెల్లూరులోని ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

గేదెను ఢీకొని వ్యక్తికి గాయాలు

రాపూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాపూరు పట్టణం సమీపంలో ఉన్న టోల్ ప్లాజా వద్ద గేదెను ఢీకొనడంతో ద్విచక్ర వాహనదారుడికి తీవ్ర గాయలయ్యాయి. వివరాలి ఉన్నాయి. మంగళవారం రాత్రి భూపతి సురేంద్ర గుండవోలు నుండి స్వగ్రామమైన ఆంజనేయపురం వస్తుండగా టోల్ ప్లాజా వద్ద రాత్రి వేళ గమనించకుండా గేదెను ఢీ కొట్టడంతో తీవ్ర గాయాల వ్వగా, 108 సిబ్బంది రాపూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు.

పోక్సో కేసులో నిందితుడికి జీవితఖైదు

నెల్లూరు (లీగల్), నవంబరు 11(ఆంధ్రజ్యోతి) బాలికపై లైంగిక దాడికి పాల్పడాడ్డన్న కేసులో నేరం రుజువు కావడంతో మహమ్మద్ నాసిర్‌కు జీవిత ఖైదుతోపాటు రూ. 40 వేల జరిమానా విధిస్తూ నెల్లూరు జిల్లా పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయాధికారి సిరిపిరెడ్డి సుమ మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు వివరాలు... నెల్లూరు నగరం జాకీర్‌హుసేన్‌లో నాసిర్ కారు మెకానిక్‌గా ఉండేవాడు. ఈ నేపధ్యంలో పెన్నానది సమీపంలో ఓ రేకుల ఇంటిని కొనుగోలు చేశాడు. ఆ ఇంటిని రిపేరు చేసే క్రమంలో ఓ షాపులో సిగరెట్టు కొనేందుకు వెళ్లాడు. అదే సమయంలో అ ప్రాంతానికి చెందిన బాలిక(7) తినుబండారాలు కొనుక్కునేందుకు అక్కడికి వచ్చింది. ఆ బాలికతో నాసిర్ పరిచయం పెంచుకున్నాడు. ఈ క్రమంలో 2020 డిసెంబరు 8న తినుబండరాలు కొనిస్తానని చెప్పి, ఆ బాలికను తన స్కూటర్‌పై ఎక్కించుకుని తాను కొత్తగా కొన్న ఇంటికి తీసుకువెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. నవాబుపేట పోలీసులు నిందితుడిపై పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. విచారణా కాలంలో నిందితుడిపై నేరం రుజువు కావడంతో పైవిధంగా శిక్ష విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డీ. చంద్రశేఖర్ వాదించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

నెల్లూరు(క్రైం), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్ పార్శిల్ కార్యాలయం సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మంగళవారం మృతి చెందాడు. సుమారు 40 నుంచి 45 ఏళ్లలోపు వయసు కలిగి, పింక్ కలర్ ఫుల్ హ్యాండ్స్ చొక్కా, సిమెంటు రంగు జీన్స్ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని జీజీహెచ్‌కి తరలించి రైల్వే ఎస్ఐ హరిచందన కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు రైల్వే పోలీసులకు తెలియజేయాలని ఎస్ఐ కోరారు.

సోమశిలకు 10,501 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

అనంతసాగరం నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి మంగళవారం 10,501 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. దిగువకు 12,650, ఉత్తర కాలువకు 50, కండలేరుకు 560 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నామన్నారు. డ్యాంలో 71.791 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు.

● **కండలేరులో నీటి నిల్వ 58.37 టీఎంసీలు**

రాపూరు : మండలంలోని కండలేరు డ్యాం నీటి నిల్వ సామర్థ్యం 68 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటిమట్టం 58.37 టీఎంసీలుగా ఉన్నదని ఏఈ అనిల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల నుంచి 600 క్యూసెక్కుల నీరు ఇన్ ఫ్లో వస్తుండగా, 850 క్యూసెక్కులు అవుట్ ఫ్లో ఉందని ఆయన తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	130
స్కిన్ చికెన్	234
స్కిన్‌లెస్	258

కోడిగుడ్ల ధర (100) : 600



బాంబు పేలుళ్ల మృతులకు నివాళి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : దేశ రాజధాని ఢిల్లీలో బాంబు పేలుళ్ల మృతులకు మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. నగరంలోని అలంకార్ సెంటర్‌లో బీజేపీ నాయకుడు మిడతల రమేష్ ఆధ్వర్యంలో ఉగ్రవాదం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆయన మాట్లాడుతూ భారతదేశంలో భయానక వాతావరణాన్ని సృష్టించేం దుకు పాకిస్తాన్ తీవ్రవాద సంస్థలు ఉగ్ర పేలుళ్లకు పాల్పడు తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కందికట్ల రాజేశ్వరమ్మ, మురగ నరేష్, సోమ గోపాల్ చిట్టిబాబు, విజయ గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

అన్నీ విధాలా ఆదుకుంటాం

● హైవే ప్రమాద బాధితులకు మున్సిపల్ మంత్రి నారాయణ పరామర్శ

నెల్లూరు (వైద్యం), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఎన్టీఆర్ నగర్ వద్ద జాతీయ రహదారిపై జరిగిన ఘోర ప్రమాదంలో గాయపడి మెడికవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని మున్సిపల్ మంత్రి పొంగూరు నారాయణ మంగళవారం రాత్రి పరామర్శించారు. రోడ్డు ప్రమాద ఘటన విషయం తెలుసుకున్న మంత్రి నారాయణ విజయవాడ నుంచి హుటాహుటిన నెల్లూరుకు చేరుకున్నారు. మెడికవర్ ఆసుపత్రిలో బాధితులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ ప్రమాదంలో ముగ్గురు మృతిచెందటంపై విచారం వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారికి ధైర్యం చెప్పారు. అన్నీ విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.


మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న గిరిధర్‌రెడ్డి

మృతుల కుటుంబాలకు సంతాపం

నెల్లూరు రూరల్ : ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. పార్టీ సమావేశంలో ఈ మేరకు నివాళి అర్పించి, మౌనం పాటించారు. సిరిగార్డెన్స్‌లో మృతుల కుటుంబాలను సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, నెల్లూరు ఆర్డీవో అనూష, టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి పరామర్శించారు. ఎన్టీఆర్ నగర్ వద్ద జరిగిన ప్రమాదం రెండు కుటుంబాల్లో పెను విషాదాన్ని నింపిందని ఆవేదన వ్యక్తం చేశారు.

● **ప్రముఖుల విచారం**

నెల్లూరు (హరనాథపురం), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంపై పలువురు ప్రముఖులు స్పందించారు. లారీ దూసుకెళ్లడంతో ముగ్గురు మరణించడం, పలువురు గాయపడటంపై విచారం వ్యక్తం చేశారు. ఈ ప్రమాద వార్త విని దిగ్భ్రాంతి చెందానని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. నిత్యం తాను రాకపోకలు సాగించే మార్గంలో ఈ దారుణం జరగడం జీర్ణించుకోలేకపోతున్నాని తెలిపారు. మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని, తీవ్ర గాయాలపాలైన వారు క్షేమంగా కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

● భయానక రోడ్డు ప్రమాద వార్త తనను తీవ్రంగా కలచివేసిందని వక్ఫ్‌బోర్డు రాష్ట్ర చైర్మన్, నెల్లూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ పేర్కొన్నారు. ఒక్క క్షణంలో ముగ్గురు ప్రాణాలు కోల్పోవడం తీవ్ర ఆవేదన, దిగ్భ్రాంతి కలిగించాయని, ఇటువంటివి పునరావృతం కాకుండా రహదారి భద్రతపై అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

● హైవే మీద ఘోర రోడ్డు ప్రమాదంపై నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కు టుంబాలకు దేవుడు మనోధైర్యం అందించాలని, క్షతగాత్రు లు త్వరగా కోలుకోవాలని భగవంతుని ప్రార్థించారు. చిరు వ్యాపారులపై లారీ దూసుకెళ్లడం విషాదకరమని ఆవేదన వ్యక్తం చేశారు.

● **పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలి**

- నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి

హైవేపై ప్రమాదాల నివారణకు ప్రతిష్ఠమైన భద్రతా చర్యలు చేపట్టాలని నుడా చైర్మన్ చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి కోరారు. ఎన్టీఆర్ నగర్ వద్ద జరిగిన ప్రమాదం విషయం తెలిసిన వెంటనే ఆయన ఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదం జరిగిన తీరును స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాలలో పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం నుంచి సాయం అందేలా చూస్తామన్నారు. అనంతరం ఘటనా స్థలం నుంచే కలెక్టర్, ఆర్డీవోతో ఫోన్‌లో మాట్లాడారు. రోడ్డు భద్రతకు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం క్షతగాత్రులు చికిత్స పొందుతున్న ఆసుపత్రికి వెళ్లి వారిని పరామర్శించారు.

రాష్ట్ర సైన్స్ పోటీల్లో జిల్లాకు తృతీయ స్థానం

నెల్లూరు(విద్య), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి సైన్స్ డ్రామా పోటీల్లో జిల్లాకు తృతీయ స్థానం లభించిందని డీఈవో బాలాజీరావు తెలిపారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో మంగళవారం జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో పాఠశాలల్లో ఉత్తమ విద్యాబోధనతోపాటు విద్యార్థుల్లోని సృజనాత్మకతను, పరిశోధనా శక్తిని వెలికితీస్తున్నామని చెప్పారు. దీనిలో భాగంగానే వారికి సైన్స్ ప్రదర్శనలు, పోటీలు నిర్వహిస్తూ ప్రోత్సహిస్తుండడంతో ప్రతి ఏడాది కూడా జాతీయ, రాష్ట్రస్థాయిల్లో విద్యార్థులు ప్రతిభ చూపుతున్నారని తెలిపారు. ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి సైన్స్ డ్రామా పోటీల్లో టీపీ గూడూరు మండలం, వరిగొండ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి తృతీయ స్థానం సాధించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు టీ సురేంద్రబాబు, సైన్స్ టీచర్ వై శ్రీనివాసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కోలాట పోటీల్లో ఉపాధ్యాయుల ప్రతిభ

నెల్లూరు(విద్య), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి కోలాటం పోటీల్లో జిల్లాకు చెందిన ఉపాధ్యాయులు ప్రతిభ చూపి మూడో స్థానం సాధించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో మంగళవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. డీఈవో డాక్టర్ ఆర్ బాలాజీరావు మాట్లాడుతూ పల్నాడుజిల్లా బాలోత్సవ కమిటీ ఆధ్వర్యంలో నరసరావుపేటలో జరిగిన రాష్ట్రస్థాయి ఉపాధ్యాయుల సాంస్కృతిక పోటీల్లో జిల్లా ఉపాధ్యాయులు కోలాటం పోటీల్లో పాల్గొన్నారని తెలిపారు. టీచర్లు విద్యార్థులకు ఉత్తమ బోధన అందిస్తూనే వారిలోని కళలను వెలికితీసి ప్రదర్శించడం స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్రశిక్ష ఏపీసీ వెంకట సుబ్బయ్య, ఏఎంవో సుధీర్‌బాబు, నెల్లూరు డిప్యూటీఈవో నాయక్, ఉపాధ్యాయులు చెవుల రామచంద్రయ్య, వేణుగోపాల్, మాధవి, కృష్ణవేణి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

స్విమ్మింగ్‌లో కోటేశ్వరరావుకు 4 స్వర్ణాలు

నెల్లూరు(విద్య), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఏపీ అమెచ్యూర్ ఆక్వాటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో నగరంలోని తడికల బజారు ప్రాంతానికి చెందిన యు కోటేశ్వరరావు అండర్-55-59 విభాగంలో ఉత్తమ ప్రదర్శన కనబరిచి నాలుగు బంగారు పతకాలు సాధించారు. 100 మీటర్ల ఫ్రీ స్టయిల్, 100 మీటర్ల బ్యాక్ స్ట్రోక్, 50 మీటర్ల బ్యాక్ స్ట్రోక్, 200 మీటర్ల స్ట్రోక్‌లో పతకాలు సాధించి అందరినీ అబ్బురపరిచారు. 15 సంవత్సరాలుగా ఈత సాధన చేస్తూ పోటీల్లో పాల్గొంటున్నానని ఆయన తెలిపారు.

న్యాయవాది విజయం మృతి

నెల్లూరు (లీగల్), నవంబరు 11 : సీనియర్ న్యాయవాది పీఈ విజయం (90) సోమవారం రాత్రి వృద్ధాప్య కారణాలతో మృతి చెందారు. ఆయన తొలుత డ్రిల్ మాస్టర్‌గా జీవితం ప్రారంభించి న్యాయవాద వృత్తిలోకి అడుగుపెట్టారు. విజయం మృతికి రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ వేనాటి చంద్రశేఖర్ రెడ్డి, నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పీ అయ్యప్ప రెడ్డి, ఉపాధ్యక్షుడు జల్లి పద్మాకర్, ఐలు జిల్లా కమిటీ, న్యాయవాదులు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన భౌతిక కాయాన్ని పలువురు న్యాయవాదులు సందర్శించి నివాళులు అర్పించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు (జడ్పీ), నవంబరు11 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఏకేనగర్ సబ్ స్టేషన్ పరిధిలో లైన్లకు మరమ్మతులు చేస్తున్నందున బుధవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్‌శాఖ ఈఈ ఎం శ్రీధర్ ఓ ప్రకటనలో తెలిపారు. రిత్విక్ లేఅవుట్, కరెంటాఫీసు సెంటర్, వేదాయపాళెం ప్రాంతంలో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

క్యాన్సర్ ఆసుపత్రికి రూ. 2లక్షల విరాళం

నెల్లూరు (వైద్యం), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ క్యాన్సర్ ఆసుపత్రికి కలికి సుందరరామిరెడ్డి జ్ఞానకార్థం వారి కుమారుడు కలికి రమేష్‌కుమార్ రూ. 2 లక్షల విరాళాన్ని అందించారు. మంగళవారం ఆసుపత్రిలో రెడ్‌క్రాస్ పాలక మండలి చైర్మన్ వాకాటి విజయకుమార్‌రెడ్డికి ఈ విరాళాన్ని అందించారు.

అంతా మాఇష్టం!

(5వ పేజీ తరువాయి)

ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

● **15 మందికి బదిలీలు...**

ఇటీవల ఏకంగా 15 మంది వరకూ నెల్లూరు సర్కిల్ పరిధిలో ఉద్యోగులను ఒకచోట నుంచి మరోచోటకు మార్చారు. ఇది కొంతమంది ఉద్యోగులకు లాభదాయకంగా మారుతుండగా, మిగిలిన వారికి భారంగా మారుతోంది. ఉదాహరణకు కావలి డివిజన్‌లో పనిచేస్తున్న ఓ సూపరింటెండెంట్, ఏటీవో, టైపిస్ట్‌ను నెల్లూరు ఎస్‌ఈ కార్యాలయానికి వర్కింగ్ అరేంజ్‌మెంట్ పేరుతో మార్చారు. ఈ మూడు పోస్టులు డివిజన్ స్థాయిలో చాలా కీలకమైనవి. ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్ చూసుకునేందుకు సూపరింటెండెంట్, టెక్నికల్ వర్కు చూసుకునేందుకు ఏటీవో, ఫైళ్లు సిద్ధం చేయడంలో టైపిస్టు ప్రధానమైన ఉద్యోగులు. అయితే ఈ ముగ్గురినీ నెల్లూరు సర్కిల్ కార్యాలయానికి బదిలీ చేయడంతో కావలి డివిజన్‌పై ఆ ప్రభావం తీవ్రంగా పడింది. అక్కడ మిగిలిన ఉద్యోగులపై వీరిద్దరి పనిభారం మోపారు. అయితే నెల్లూరు ఎస్‌ఈ కార్యాలయంలో సూపరింటెండెంట్, ఏటీవో, టైపిస్టు పోస్టులు ఖాళీగా లేకపోవడం గమనార్హం. ఇక్కడ సరిపడా సిబ్బంది ఉన్నా, అవసరం లేకపోయినా స్వలాభం కోసం కావలి నుంచి ముగ్గురు ఉద్యోగులను నెల్లూరుకు తీసుకొచ్చారని ఆ శాఖ వర్గాలు చెబుతున్నాయి.

● **అంత అవసరం దేనికొచ్చింది...?**

ఓ సీనియర్ అసిస్టెంట్‌ను తిరుపతి కార్యాలయం నుంచి మరో జూనియర్ అసిస్టెంట్‌ను గూడూరు డివిజన్ కార్యాలయం నుంచి నెల్లూరుకు తీసుకొచ్చారు. ఆ రెండు పోస్టులు నెల్లూరులో ఖాళీ లేకపోయినా ఆ ఉద్యోగుల కోసం నిబంధనలకు విరుద్ధంగా ఉన్నతాధికారి ఆర్డర్స్ వేశారు. వీరే కాకుండా నాయుడుపేట, పొదలకూరు సబ్ డివిజన్ల పరిధిలో కూడా ఇష్టమొచ్చినట్లు ఉద్యోగులను అటు, ఇటు బదిలీ చేశారు. నెల్లూరు సర్కిల్ పరిధిలో ఉన్న ఒంగోలు కార్యాలయాల్లోని ఉద్యోగుల వర్కింగ్ అరేంజ్‌మెంట్లు కూడా వివాదాస్పదమవుతున్నాయి. ఇలా వర్కింగ్ అరేంజ్‌మెంట్ల పేరుతో మారిన ఉద్యోగుల్లో చాలా మంది ఇటీవలే బదిలీపై వెళ్లి తిరిగి వారు కోరుకున్నచోటుకు రావడం గమనార్హం. ఆర్‌అండ్‌బీ అధికారులు ఇష్టమొచ్చినట్లు బదిలీలు చేసుకునేటప్పుడు ప్రభుత్వం బదిలీలు అనే ప్రక్రియ చేపట్టడం ఎందుకన్న ప్రశ్న తలెత్తుతోంది. గతేడాది ఇదే మాదిరిగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో డిప్యుటేషన్ల దందా కొనసాగడంతో అప్పటి కలెక్టర్ జిల్లాలోని అన్నీ శాఖల్లో డిప్యుటేషన్లు రద్దు చేశారు. కానీ ఆర్‌అండ్‌బీ శాఖలో కలెక్టర్ ఆదేశాలు కూడా లెక్కచేయడం లేదు. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ ఇన్‌చార్జ్ ఎస్‌ఈ రామకృష్ణప్రసాద్‌ను వివరణ కోరగా, పూర్వ పు ఎస్‌ఈ కొంత మందికి వర్కింగ్ అరేంజ్‌మెంట్లు ఇచ్చినట్లున్నారని చెప్పారు. వీటిని పరిశీలిస్తామని ఆయన పేర్కొన్నారు.

ఆత్మకూరు బస్టాండు అభివృద్ధికి కృషి

● ఆర్టీసీ జోనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పీఎస్‌ఆర్(ఆత్మకూరు) బస్టాండు అభివృద్ధికి దాతల సహకారంతో కృషి చేస్తున్నామని ఆర్టీసీ నెల్లూరు జోనల్ చైర్మన్ నన్నపురెడ్డి సురేష్‌రెడ్డి తెలిపారు. ఆత్మకూరు బస్టాండులో మంగళవారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పబ్లిక్ డస్ట్‌బిన్లు, పరిసరాలను శుభ్రపరిచే కిట్లు, అవుట్ సోర్సింగ్ కార్మికులకు రెయిన్ కోట్లను ఆయన అందించారు. ప్రయాణికు లకు శుభ్రమైన, సురక్షిత వాతావరణం లక్ష్యమని చెప్పారు. మెడికవర్ సంస్థకు చెందిన అనిల్ కృష్ణారెడ్డి సహకారంతో బస్టాండులో త్వరలో ఆర్‌వో ప్లాంటు ఏర్పాటు చేస్తున్నా మని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజారవాణాధికారి ఎస్‌కే షమీమ్, అధికారులు పాల్గొన్నారు.


డస్ట్‌బిన్లు అందిస్తున్న సురేష్‌రెడ్డి

మౌలానా ఆజాద్‌కు లాయర్ల నివాళి

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు మంగళవారం లా ప్రొటెక్టర్స్ భవన్‌లో న్యాయవాదులు నిర్వహించారు. అడ్వకేట్ పర్వేజ్ మాట్లాడుతూ ఇండియాలో మొట్టమొదటి ఐఐటీ కాలేజ్ ఖరగ్ పూర్‌లో స్థాపించి ప్రపంచ స్థాయి సాంకేతిక విద్యకు శ్రీకారం చుట్టింది ఆజాద్ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సందానీ, మొహమ్మద్ రఫీ, అబ్దుల్ వహీద్, రెహమాన్, సల్మాన్, షాహిద్, ఫహద్, ఆశిష్ తదితరులు నివాళులర్పించారు.


ఆజాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న లాయర్లు

టీడీపీ నివాళి

నెల్లూరు (వైద్యం): భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు మరువలేనివని తెలుగుదేశం పార్టీ మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షరీఫ్ వెల్లడించారు. మంగళవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆజాద్ జయంతి నిర్వహించారుద. ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. దేశానికి మొదటి విద్యాశాఖ మంత్రిగా ఆయన అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఖలీల్, పాషా మొహిద్దీన్, మౌలానా అబుల్ అజీజ్, ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర కార్యాలయం ప్రారంభం

నెల్లూరు(వెంకటేశ్వరపురం), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రూరల్ నియోజకవర్గంలో జరుగుతున్న స్వర్ణాంధ్ర-2047 కార్యక్రమాన్ని ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం నెల్లూరు ఆర్డీవో కార్యాలయంలో నూతనంగా నిర్మించిన నియోజక వర్గ దార్శనిక కార్యాచరణ ప్రణాళిక కార్యలయాన్ని ఆయన ప్రారంభించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దూర దృష్టితో స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్ రూపొందించినట్లు తెలిపారు. అందులో భాగమే పీ4 అన్నారు. అనంతరం నూతన కార్యాలయంలో పూజలు చేశారు. ఆర్డీవో అనూష, ఏవో నిర్మలానందబాబా, ఉద్యోగులు పాల్గొన్నారు.


కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, పక్కన ఆర్డీవో అనూష తదితరులు

కార్యకర్తలే అధినేతలు : రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరురూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : తనకు కార్యకర్తలే అధినేతలని నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. పార్టీలో వివిధ విభాగాల్లో పదవులు పొందిన వారితో మంగళవారం నెల్లూరులోని తన కార్యాలయంలో ప్రమాణస్వీకారం చేయించారు. తనను ఎల్లప్పుడూ కనిపెట్టుకుని ఉండేది కార్యకర్తలేనని చెప్పారు. అన్నీ రంగాలలో అభివృద్ధి చెందేందుకు కార్యకర్తలను, నాయకులను ప్రోత్సహించే బాధ్యత తనదన్నారు. టీడీపీ కష్టకాలంలో ఉన్న సమయంలో తనను కనిపెట్టుకుని ఉన్న వారికి తగిన ప్రాధాన్యత ఇస్తానన్నారు. కార్యకర్తల నుంచి ఎమ్మెల్యేదాక ఒకేలా గౌరవించే పార్టీ దేశంలో టీడీపీ ఒక్కటేనన్నారు. కార్యకర్తల కష్టసుఖాలను తెలుసుకునేందుకు తాను ఉదయం 9 నుంచి 10 గంటల వరకు కార్యాలయంలో అందుబాటులో ఉంటానని, ఈ గంటలో ఏకాంతంగా తనను కలవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, భానుశ్రీ, క్లష్టర్ ఇన్‌చార్జీలు పాల్గొన్నారు. కాగా, నెల్లూరులోని కొండాయపాళెం, వేదాయపాళెం ప్రాంతాలలో రైల్వే గేట్ల వద్ద అండర్ బ్రిడ్జిల ఏర్పాట్లపై కమిషనర్ నందన్‌తో కలిసి ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి కార్పొరేషన్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఇందులో రైల్వే డిప్యూటీ చీఫ్ ఇంజనీరు పీవీరమణరావు కూడా పాల్గొన్నారు. కాగా కొండాయపాళెం, వేదాయపాళెం ప్రాంతాల్లో డీఈ, ఆర్డీవో అనూష, టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి క్షేత్ర స్థాయి పరిశీలన చేశారు.

వీఆర్ హైస్కూల్‌కు నాలుగు బస్సుల బహూకరణ

నెల్లూరు(విద్య), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : యూనియన్ బ్యాంక్ సీఎస్‌ఆర్ నిధులతో నగరంలోని వీఆర్ ఎంసీ హైస్కూల్‌కు రూ.1.20కోటి విలువైన నాలుగు బస్సులను బహూకరించింది. మంగళవారం పాఠశాల ఆవరణలో నగర కమిషనర్ నందన్ బస్సులను ప్రారంభించి మాట్లాడారు. పేద విద్యార్థులకు ఆధునిక పద్ధతుల్లో విద్యనందించేందుకు మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ వీఆర్ ఉన్నత పాఠశాలను పునరుద్ధరించారని తెలిపారు. మంత్రి సూచనల మేరకు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ నిధులతో నాలుగు బస్సులు అందించారని తెలిపారు.

'నారాయణ'లో 69 మూర్ఛ శస్త్రచికిత్సలు విజయవంతం

● డాక్టర్లు హరీష్, సంపత్‌కుమార్

నెల్లూరు (వైద్యం), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) :నగరంలోని నారాయణ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిలో 69 మంది మూర్ఛ వ్యాధిగ్రస్తులకు శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించినట్లు ఆసుపత్రి అడిషనల్ సూపరింటెండెంట్ డాక్టర్ హరీష్, న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ సంపత్‌కుమార్ వెల్లడించారు. మంగళవారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మూర్ఛ వ్యాధిగ్రస్తులకు ఆసుపత్రిలో ప్రత్యేక క్లినిక్‌ను ఏర్పాటు చేశామన్నారు. న్యూరాలజీ, న్యూరోసర్జరీ, అనస్థీషియా వైద్యుల సమష్టి కృషితో ఈ శస్త్రచికిత్సలను విజయవంతంగా పూర్తి చేశామని తెలిపారు. ప్రభుత్వ సహకారంతో ఇన్సూరెన్స్, ఈహెచ్‌ఎస్, ఎన్టీఆర్ వైద్యసేవ పథకాల ద్వారా ఉచితంగా వైద్య చికిత్సలు అందిస్తున్నామన్నారు. న్యూరో సర్జన్ డాక్టర్ సాయికిరణ్ మాట్లాడుతూ 33 చానల్ వీడియో, ఈఈజీ, 3 టెస్లా, ఎమ్మారై వంటి ఆధునిక పరికరాలు ఆసుపత్రిలో ఉండటం వల్ల శస్త్రచికిత్సలు విజయ వంతం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి, న్యూరాలజిస్టులు డాక్టర్ అనూష, డాక్టర్ కృష్ణచైతన్య, డాక్టర్ అనిల్, ఏజీఎం శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వైద్యనిపుణులు

అనుమానితుల సమాచారం ఇవ్వండి : లాడ్జీల తనిఖీల్లో సీఐ

నెల్లూరురూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : అనుమానాస్పద వ్యక్తులెవరైనా లాడ్జీల్లోకి వస్తే వారి సమాచారం తమకు అందచేయాలని నెల్లూరురూరల్ సీఐ గుంజి వేణు లాడ్జీల యజమానులకు సూచించారు. ఢిల్లీ సంఘటనతో అప్రమత్తమై నెల్లూరురూరల్లోని ప్రధాన రహదారులు, కూడళ్లు, లాడ్జీల్లో మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లాడ్జీల్లో రూములు తీసుకునే వారి పూర్తి సమాచారం సేకరించాలని తెలిపారు. ఎందుకు వచ్చారు...? ఏం పనిపై వచ్చారు...? అనే వివరాలతోపాటు వ్యక్తిగత వివరాలు తీసుకోవాలన్నారు. వ్యక్తిగత గుర్తింపు ఉంటేనే రూములు ఇవ్వాలని స్పష్టం చేశారు. అనంతరం రోడ్డు, రహదారులపై వాహనాలను తనిఖీ చేసి అనుమానాస్పద వస్తువులను రవాణా చేస్తే అదుపులోకి తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై లక్ష్మణరావు పాల్గొన్నారు.

గాండ్ల తెలికుల, దేవ తెలికుల ఫైనాన్స్ కార్పొరేషన్ పునరుద్ధరించండి

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని గాండ్ల, తెలికుల, దేవ తెలికుల కోసం 2019లో ఏర్పాటు చేసిన ఫైనాన్స్ కార్పొరేషన్‌ను పునరుద్ధరించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి ఆంధ్రప్రదేశ్ అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గ్రోసు సుబ్బారావు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో గాండ్ల, తెలికుల, దేవ తెలికులకు చెందిన వారు 15లక్షల మందికిపైగా ఉన్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు. యాంత్రీకరణతో తమ కుల వృత్తి గానుగలు మూతపడ్డాయని తెలిపారు. తమ కులం వారికి వ్యాపారాలు లేవు, వ్యవసాయం లేదు. ప్రస్తుతం రాష్ట్రంలోని గాండ్ల తెలికులు 90 శాతం మంది రిక్షా డ్రైవర్లు, వ్యవసాయ కూలీలుగా దుర్భర జీవితం గడుపుతున్నారని తెలిపారు. ఫైనాన్స్ కార్పొరేషన్‌ను పునరుద్ధరించి, పాలక వర్గాన్ని నియమించి, గాండ్ల తెలికుల జీవన ప్రమాణాలు పెంచాలని కోరారు.

జీజీహెచ్ ఘటనపై విచారణ జరిపించండి

నెల్లూరు (వైద్యం), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో మహిళను వార్డులోకి ఈడ్చుకెళ్లారని మేడ రోజా చేసిన ఆరోపణలపై పూర్తి స్థాయి విచారణ జరిపించాలని మంగళవారం కలెక్టర్ హిమాన్షు శుక్లాను జీజీహెచ్ సూపరింటెండెంట్ మాధవి కోరారు. 80 ఏళ్ల వృద్ధురాలు ఆదెమ్మ అనారోగ్యంతో జీజీహెచ్‌కు గత నెల 15వ తేదీ వచ్చారన్నారు. అయితే చికిత్స పొందుతూ 20వ తేదీ మృతువాత పడ్డారని తెలిపారు. ఆదెమ్మను నేలపైన వైద్య సిబ్బంది ఈడ్చుకు వెళ్లారని ఆమె కుమార్తె రోజా ఓ ఫేక్ వీడియోను చూపిస్తున్నారని, ఆ వీడియా జీజీహెచ్‌ది కాదని పేర్కొన్నారు. వెంటనే వాస్తవాలు బట్టబయలు చేసేందుకు పూర్తి విచారణ చేయాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. కాగా, అసలు జరిగిందేమిటో వాస్తవాలతో నివేదిక అందించాలని కలెక్టర్ సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైద్య కళాశాల అదనపు ప్రిన్సిపాల్ డాక్టర్ మస్తాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఫార్మాసిస్టుల కుటుంబాలను ఆదుకోవాలి

నెల్లూరు (వైద్యం), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని వైద్య ఆరోగ్యశాఖలో ఇటీవల మరణించిన కాంట్రాక్టు ఫార్మాసిస్టులు ఖాజామస్తాన్, బోయపాటి హరిబాబు కుటుంబాలను ఆదుకోవాలని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్ చేసింది. మంగళవారం డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాతను కలిసిన యూనియన్ నేతలు వినతిపత్రం అందించారు. చిన్న పిల్లలు ఉన్న ఆయా కుటుంబాలను ఆదుకునేందుకు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలల్లో చిన్నపాటి ఉద్యోగాలు కల్పించాలని కోరారు. ఇందుకు డీఎంహెచ్‌వో సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది. ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షుడు సతీష్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు సాయితేజ, ప్రధాన కార్యదర్శి రూపేంద్ర, కోశాధికారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, SHAIKH ABDUL NASEER (Old name), Resident of D.No.26-10-1246, Autonagar Colony, Padaru palli, Nellore- 524004, SPSR Nellore Dt, AP. Here by declare that I have changed my name as **SHAIK ABDULNA SEER** (New name) S/o. SHAIK GHOUSE BASHA.

ప్రకటన

నా క్లయింట్ అయిన జోగి సుబ్రహ్మణ్యం తండ్రి రమణయ్య, 25-2-1744, బి-బ్లాక్, ప్రగతినగర్, 6వ వీధి, పొదలకూరు రోడ్డు, నెల్లూరు సిటీ అనువారు ఇచ్చిన వివరముల మేరకు యిందుమూలముగా యావన్మందికి తెలియజేయునదేమనగా:- నా క్లయింట్ నెల్లూరు బిట్-1 కొత్తూరు పంచాయితిలో చేరిన నెల్లూరు బిట్-1 కొత్తూరు గ్రామంలోని కావేరి నగర్‌కు ఉత్తరం సర్వే నెం.2134/7 దులోని నెం.16రు ప్లాటు విస్తీర్ణం 32 అంకణములు 51 చదరపు అడుగులు లేక 261.66 చదరపు గజముల స్థలమును దేవరాల కాంతమ్మ భర్త లేట్ సుందరయ్య వీరి వల్ల విక్రయ స్వాధీన అగ్రిమెంటుతో కూడిన జిపి ఏజెంట్లు 1.జోగి సుధాకరరావు, 2. ఈదూరు హరేంద్రనాథ్‌రెడ్డి అనువారల వద్ద నుండి రిజిష్టర్డు విక్రయపత్రం తేది: 26-03-2010 డాక్యుమెంటు నెం.6848/2010 (RO, Nellore) ద్వారా కొనుగోలు చేసినారు. సదరు ఒరిజినల్ డాక్యుమెంటును జెరాక్స్ తీసుకొను నిమిత్తం తే.02-11-2025దిన నా క్లయింట్ తన నివాసం నుండి పొదలకూరు రోడ్డు సర్కిల్ వద్ద వున్న జెరాక్స్ షాపునకు పోవుచుండగా మార్గమధ్యములో ఒరిజినల్ డాక్యుమెంటు పోయినది. తదుపరి నా క్లయింట్ చుట్టు ప్రక్కల ఎంత వెతికినను కనిపించలేదని తెలియజేయుచున్నాడు. సదరు ఒరిజినల్ డాక్యుమెంటు నెం.6848/2010 ఎవ్వరికైనను దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్సుకు తెచ్చి ఇచ్చిన వారికి తగిన పారితోషికం ఇవ్వబడును. సదరు ఒరిజినల్ డాక్యుమెంటును ఉపయోగించి ఎవ్వరైనా ఎట్టి లావాదేవీలు జరిపిన అవి చెల్లనేరవు. అవి నా క్లయింట్‌ను బద్ధగించవు.

వి.రంగారావు, B.Com., B.L.,
అడ్వకేట్, డోర్ నెం.26-1-962, సాయిబాబాగుడి ఎదురుగా, బి.వి.నగర్, నెల్లూరుసిటీ, సెల్: 94404 25241

TRANSMISSION CORPORATION OF ANDHRA PRADESH LIMITED

APTRANSCO

వేలము ప్రకటన

132/33KV రాజేంద్రనగర్ విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణమునకు అడ్డుగా ఉన్న 68 వివిధ రకములైన వృక్షములను వేలము పాట ద్వారా విక్రయించుటకు నిర్ణయించడమైనది. వేలము పాట జరుగు ప్రదేశము DM&HO Office, నెల్లూరు, శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వెనుక భాగమున కల ప్రతిపాదిత 132/33KV రాజేంద్రనగర్ సబ్ స్టేషన్ స్థలము నందు.

వేలము నిర్వహించు తేది: 18-11-2025 ఉదయం 11:00 గంటల నుండి 13:00 గంటల మధ్య (అటవీశాఖ మరియు AP TRANSCO అధికారుల సమక్షములో)

కనీస అంచనా విలువ (Upset Price) : **రూ.72,864/-**

వేలము నందు పాల్గొనుటకు కట్టవలసిన ధరావతు విలువ (Bid Security) **రూ.3,643.00**

ధరావతు విలువ SUPERINTENDING ENGINEER/O&M/ AP TRANSCO/ Nellore వారి పేరు మీద Bank Demand Draft సమర్పించవలెను.

Note: వేలము పాటలో నెగ్గిన వ్యక్తి/ సంస్థ తేది:23-11-2025 లోపల అటవీశాఖ అనుమతితో వృక్షములను తొలగించి రవాణా చేసుకొనవలెను.

ఇట్లు: **Executive Engineer**
Construction Division,
AP TRANSCO, NELLORE. Ph. No:94408 10915.


శ్రద్ధాంజలి
జోహార్ శీనన్న
ప్రజల మనసును గెలిచిన ప్రజా నాయకుడు,
ఆప్యాయతతో పిలిచే మనిషి ఇక లేరనే
విషయం నమ్మలేకపోతున్నాం...
నిస్వార్థ సేవతో, ప్రేమతో, ఆప్యాయతతో
ప్రతి మనసులో నిలిచిన మీరు...
మా హృదయాలలో ఎప్పటికీ నిలిచిపోతారు.
మీరు చూపిన మార్గం
మాకు ఎప్పటికీ ఆదర్శప్రాయం...
మీ స్మృతులు ప్రతి హృదయంలో శాశ్వతం...
మీ... బెజవాడ వంశీకృష్ణారెడ్డి
ఊటుకూరు గ్రామం, విడవలూరు మండలం
ఉత్తరక్రియలు: తేది:12-11-2025 బుధవారం నాడు విడవలూరులోని వారి స్వగృహం నందు జరుగును.

యూరియా గురించి ఆందోళన వద్దు

అల్లూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లా రైతులు యూరియా గురించి అపోహలకు వెళ్లి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా వ్యవసాయాధికారి పీ.సత్యవాణి అన్నారు. అల్లూరు వ్యవసాయశాఖ కార్యాలయంలో రైతులు, సొసైటీ కార్యదర్శులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో ఇప్పటికే 20 వేల టన్నులు యూరియా ఉందని, యూరియా కొరత ఏర్పడుతుందనే అపోహలు వద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ నర్సోజీరావు, మార్క్‌ఫెడ్ డీఎం పవన్‌కుమార్, వ్యవసాయాధికారి పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యం : కలెక్టర్

నెల్లూరు (హరనాధపురం), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యమని కలెక్టర్ హిమాన్షుశుక్లా అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని శంకరన్ హాలులో భారతరత్న మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జయంతిని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కలెక్టర్, ఎమ్మెల్యే సోమిరెడ్డి, ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్య ద్వారానే సమాజంలో పేదరికాన్ని దూరం చేయగలమన్నారు. అనంతరం ఎమ్మెల్యే సోమిరెడ్డి తదితరులు మాట్లాడారు. తొలుత ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జేసీ మొగిలి వెంకటేశ్వర్లు, డీఆర్‌వో విజయ్‌కుమార్, విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ మహమ్మద్ అయూబ్, బీసీ సంక్షేమ శాఖ అధికారి వెంకటలక్ష్మమ్మ,తదితరులు పాల్గొన్నారు.



ఆజాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, సోమిరెడ్డి తదితరులు

● పోలీసు కార్యాలయంలో...

నెల్లూరు(క్రైం/విద్య), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. కాగా, ఆజాద్ జయంతిని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలోనూ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమగ్ర శిక్ష విభాగం ఏపీసీ డీ వెంకట సుబ్బయ్య మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సమగ్రశిక్ష సెక్టోరియల్ అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

17 నుంచి కుష్ఠు వ్యాధిగ్రస్థుల గుర్తింపు

నెల్లూరు (వైద్యం), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఈ నెల 17 నుంచి 30 వరకు కుష్టు వ్యాధిగ్రస్థులను పక్కాగా గుర్తించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత ఆదేశించారు. మంగళవారం ఆమె కార్యాలయంలో పీహెచ్‌సీ వైద్యుల సమావేశం నిర్వహించారు. ఏఎన్‌ఎంలు, వైద్య సిబ్బంది ఇంటింటికి తిరిగి కుష్టు వ్యాధిగ్రస్థుల గుర్తించాలని సూచించారు. జిల్లా కుష్టు నివారణ అధికారి డాక్టర్ ఖాదర్‌వలి మాట్లాడుతూ స్పర్శ లేని రాగి వర్ణపు మచ్చలు ఎవరి శరీరంపై ఉంటాయో వారిని కుష్టు వ్యాధిగ్రస్థులుగా గుర్తించాలని, అలాంటి వారిని వైద్యాధికారులతో నిర్ధారణ చేయించాలని తెలిపారు. జిల్లా న్యూక్లియర్ అధికారి డాక్టర్ సురేంద్ర బాబు తదితరులు మాట్లాడారు. డామియన్ ఫౌండేషన్ ట్రస్ట్ ఏవో సతీష్‌కుమార్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కుష్టు వ్యాధి గుర్తింపును వివరించారు.

హైరిస్క్ గర్భిణులు మరణించకుండా చూడండి

జిల్లాలో హైరిస్క్ గర్భిణులు ఎలాంటి పరిస్థితిలో మృత్యువాత పడకూడదని డీఎంహెచ్‌వో సుజాత ఆదేశించారు. మాతృమరణాలపై మంగళవారం కలెక్టరేట్‌లో సమీక్ష జరిగింది. ఆమె మాట్లాడుతూ హైరిస్క్ గర్భిణులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని వైద్యాధికారులు, సిబ్బందికి సూచించారు. గర్భిణుల్లో రక్తహీనత నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీసీహెచ్‌ఎస్ డాక్టర్ పరిమళ, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ మాధవి, జీజీహెచ్ గైనిక్ హెచ్‌వోడీ డాక్టర్ గీతాలక్ష్మి, పీడియాట్రిక్ హెచ్‌వోడీ డాక్టర్ సుల్తానా, డాక్టర్ రుషేంద్రకుమారి, డాక్టర్ సుబ్బారావు, డీఐవో డాక్టర్ ఉమామహేశ్వరి, డెమో కనకరత్నం పాల్గొన్నారు.

క్వార్ట్జ్ తవ్వకాలకు ఒప్పుకోం..

● ప్రజాభిప్రాయ సేకరణలో గ్రామస్థుల వెల్లడి

ఉదయగిరి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మాది మెట్ట ప్రాంతం.. వర్షాధారంతోనే పంటలు సాగు చేస్తాం.. దీంతోపాటు మూగజీవాలను మేపుకుని జీవనం సాగిస్తాం.. వీటన్నింటికీ ఈ వెలుగొండే ఆధారం. అలాంటి కొండను క్వార్ట్జ్ కోసం తవ్వేందుకు తాము ఒప్పుకునే ప్రసక్తే లేదు... అని మండలంలోని బండగానిపల్లి రెవెన్యూ పరిధిలోని గ్రామస్థులు అధికారుల ఎదుట తమ ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని బండగానిపల్లి రెవెన్యూ పరిధిలో క్వార్ట్జ్ తవ్వకాలకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వడంతో మంగళవారం ఆత్మకూరు ఆర్డీవో బీ.పావని, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ అశోక్‌కుమార్‌లు ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈ భూమిలో ప్రభుత్వం ఏడాదికి 99,900 టన్నుల క్వార్ట్జ్ తవ్వకాలను చేపడుతుందని, ప్రజల అభిప్రాయాలను తెలిపాలని సూచించారు. స్పందించిన గ్రామస్థులు ఈ కొండే మాకు ఆధారం. అలాంటి కొండను తవ్వి క్వార్ట్జ్ తవ్వకాలు చేస్తే నష్టపోతామన్నారు. స్పందించిన అధికారులు మీ అభిప్రాయాలను ఉన్నతాధికారులకు నివేదిక రూపంలో అందజేసి, తదుపరి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఉదయగిరి సీఐ ఎన్ వెంకట్రావు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దారు షాజియా, ఎంపీటీసీ కాకు విజయమ్మ, సర్పంచి లక్కు రమణమ్మ, కాకు వెంకటయ్య పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

కావలెను

బైక్ ఫైనాన్స్ నందు పనిచేయుటకు ఎగ్జిక్యూటివ్స్ కావలెను (నాగ ఏజెన్సీస్) హిందూజా (ఎల్ అండ్ టి) నెల్లూరు సం.ప్ర. సెల్: 8499949111, 9550876111

AJR-240332

జ్యోతిర్లింగ్ శక్తి పీఠయాత్ర

వైద్యనాథ్, మాయాపూర్, తారకేశ్వర్, కామాఖ్య, కలకత్తా, శృంకాలదేవి తేది:16-01-2026, 8 రోటీకి 16000/- (రైలు, బస్సు, భో+రూం) కె.వాసు, నెల్లూరు. సం.ప్ర. సెల్: 94913 40504

AJR-240421

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారులతో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడీవీటీ

నిర్లక్ష్యం వీడాలి !

● ఆందోళన రేపుతున్న న్యూమోనియో కేసులు
● అశ్రద్ధ చేస్తే ప్రాణాంతకమే...
● సకాలంలో వైద్యచికిత్సలు చేయించుకోవాలి
● జిల్లాలో 1.50 లక్షల కేసులు
● నేడు ప్రపంచ నిమోనియా దినం



జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న న్యూమోనియా వ్యాధిగ్రస్థులు

నెల్లూరు (వైద్యం), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): శ్వాసకోశ వ్యాధుల్లో న్యుమోనియా వ్యాధి ఎంతో ప్రమాదకరమైంది. దీన్ని నిర్లక్ష్యం చేస్తే ప్రాణాపాయం తప్పదు. ప్రస్తుతం వాతావరణంలో సంభవిస్తున్న మార్పులు, వాయు కాలుష్యం కారణంగా శ్వాసకోస వ్యాధులు చుట్టుముడుతున్నాయి. తాజాగా జిల్లాలో 1.50 లక్షలమంది న్యుమోనియా బాధితులు ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రతిఏటా నవంబరు 12న (నేడు) ప్రపంచ నిమోనియా దినం జరుపుకుంటున్నారు. ఈ వ్యాధిపై ప్రపంచ ఆరోగ్య సంస్థ అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నది.

● చిన్నారులు, వృద్ధులపై జాగ్రత్తగా ఉండాలి

వర్షాకాలంలో చిన్నారులు, వృద్ధులు శ్వాసకోశ వ్యాధులపై జాగ్రత్తగా ఉండాలి. ఎలాంటి అశ్రద్ధ చేసినా అది చివరకు న్యూమోనియాకు దారితీసి, ప్రాణాంతకంగా మారుతుంది. ప్రస్తుతం జిల్లాలోని పలు ఆసుపత్రుల్లో న్యుమోనియా బాధితులే ఎక్కువగా ఉన్నారు. సాధారణ జ్వరాలతో పాటు టైఫాయిడ్, డెంగ్యూ వంటి కేసులు ఎక్కువగా ఉన్నాయి. జిల్లాలోని ఏ ఆసుపత్రిలోనైనా ఇలాంటి కేసులు ఎక్కువగా ఉన్నా న్యుమోనియా కేసులుగా మారుతున్నాయి.

● ఊపిరితిత్తులకు అంతరాయం ఏర్పడితే..

మనం శ్వాసించడానికి ఉపయోగపడేవి ఊపిరితిత్తులు. క్షణం ఖాళీ లేకుండా ఎప్పుడూ ఊపిరి తీసుకుంటూనే ఉండాలి. ఊపిరితిత్తుల పని విధానానికి అంతరాయం జరిగితే, అది న్యుమోనియా వ్యాధికి దారి తీస్తుంది. ఊపిరితిత్తుల సామర్థ్యం దెబ్బతిని, వాటి పనివిధానంలో పలు మార్పులు చోటుచేసుకుంటాయి. ఈ పరిస్థితిలో సరైన చికిత్సలు చేయించుకోకపోతే ప్రాణాపాయానికి గురికావాల్సి వస్తుంది. రెండు, మూడు రోజులు నుంచి జ్వరం, దగ్గు, ఊపిరి అందకపోవడం వంటి లక్షణాలు ఉన్నవారు వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. నిమోనియాకు సమయానికి చికిత్సలు తీసుకోకపోతే వ్యాధి తీవ్రతకు దారితీస్తుంది. రక్తానికి ఇన్‌ఫెక్షన్ సోకడం, మూత్రపిండాలు దెబ్బతినడం, మెదడుపై ప్రభావం చూపి మరణానికి దారి తీయవచ్చు.

● చికిత్సలు ఇలా...

- న్యుమోనియాకు తగిన యాంటిబయాటిక్‌తో చికిత్స చేయాల్సి ఉంది. దీని మోతాదును జాగ్రత్తగా నిర్ణయించి వైద్యుల పర్యవేక్షణలో మందులు ఇవ్వాలి.
- సీబీపీ, సీఎక్స్‌రే వంటి పరీక్షలతోపాటు ఛాతీ సిటీస్కాన్, గళ్ల పరీక్షల ద్వారా వ్యాధి తీవ్రతను గుర్తించవచ్చు.
- తీవ్రమైన న్యుమోనియాకు సంబంధించి ఐసీయూలో ఉంచి నరాలకు యాంటిబయాటిక్ ఇంజక్షన్‌లు వేస్తారు.

వ్యాధిని ఏమాత్రం అశ్రద్ధ చేయవద్దు

ప్రస్తుతం జిల్లాలో న్యుమోనియా వ్యాధిగ్రస్థులు ఎక్కువగానే ఉన్నారు. జీజీహెచ్‌కి ప్రతిరోజూ వస్తున్న 50 మంది శ్వాసకోశ వ్యాధిగ్రస్థుల్లో 20 మంది న్యుమోనియా వ్యాధిగ్రస్థులు ఉన్నారు. వృద్ధులు, చిన్నారులపై వ్యాధిప్రభావం ఎక్కువగా ఉంటుంది. వ్యాధిగ్రస్థులు వెంటనే వైద్యున్ని కలిసి చికిత్స చేసికోవాలి. ముందుగానే గుర్తించి చికిత్స చేయించు కుంటే వ్యాధిని నయం చేయవచ్చు.



- డాక్టర్ అరుణ, పల్మనాలజిస్ట్, ప్రొఫెసర్, హెచ్‌వోడీ, జీజీహెచ్

చిన్నారులపైనే ఎక్కువ ప్రభావం

న్యుయోనియా ప్రభావం ఎక్కువగా చిన్నపిల్లలపై ఉంటుంది. వీరికి న్యూమోనియా వస్తే ప్రమాదంగా భావించి, వెంటనే వైద్య చికిత్సలు చేయించుకోవాలి. ఎందుకంటే వీరిలో వ్యాధినిరోధక శక్తి చాలా తక్కువగా ఉంటుంది. న్యుమోనియా వ్యాధి ప్రమాదకరమైన వ్యాధి. తొలి దశలోనే వ్యాధిని గుర్తిస్తే నయం చేయవచ్చు. ఈ నేపథ్యంలో వ్యాధిపై అవగాహన పెంచుకుని వైద్యనిపుణులను సంప్రదించాలి.



- డాక్టర్ అపర్ణ, పల్మనాలజిస్ట్, జీజీహెచ్

ఆంగ్ల సదస్సుకు పాటూరు ఉపాధ్యాయిని

కోవూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): బెంగళూరులో బుధవారం నుంచి జరగనున్న అంతర్జాతీయ ఇంగ్లీషు భాషా బోధన సదస్సుకు హాజరు కావాలని పాటూరు జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయిని జాలాది కేశవర్ధనికి క్రిస్టియన్ విశ్వవిద్యాలయం ఆహ్వానం పంపింది. దీంతో ఆమెను మంగళవారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయిని డాక్టర్ జుల్ఫీకర్‌అలీ, ఉపాధ్యాయులు ఉమామహేశ్వరి, అరుణ, శేషయ్య, విజయకుమారి, వల్లీబాషా, కృష్ణమోహన్ తదితరులు అభినందించారు.



కేశవర్ధినికి టీచర్ల అభినందన

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

ధైర్యవంతుడి కథ



సందీప్‌కిషన్ కథానాయకుడిగా విజయ్ తనయుడు జేసన్ సంజయ్ ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. లైకా ప్రొడక్షన్స్ బేనర్‌పై సుభాస్కరన్ నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా టైటిల్‌ను ఖరారు చేసి ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల చేశారు. 'సిగ్మా' అనేది చిత్ర టైటిల్. 'స్వతంత్ర, ధైర్యవంతమైన వ్యక్తిత్వం గల ఓ వ్యక్తి కథే ఇది. నిధి అన్వేషణ నేపథ్యంలో సాగుతుంది. అద్భుమైన టేకింగ్‌తో రూపొందుతున్న ఈ చిత్రం ప్రేక్షకులకు థ్రిల్లింగ్ అనుభూతిని ఇస్తుంది' అని పేర్కొన్నారు. ఒక్క పాట మినహా చిత్రీకరణ పూర్తయినట్లు తెలిపారు. వేసవిలో చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు మేకర్స్. ఈ చిత్రానికి ఎడిటర్: ప్రవీణ్ కేఎల్, సినిమాటోగ్రాఫర్: కృష్ణన్ వసంత్, సంగీతం: థమన్.ఎస్.

అబ్బాయిలు క్లాప్స్ కొడుతున్నారు



అనూ ఇమ్మాన్యుయేల్

'ది గర్ల్‌ఫ్రెండ్' సినిమాలో నా పాత్ర కన్నా కథే నన్ను ఎక్కువగా ప్రభావితం చేసింది. ఈతరం అమ్మాయిలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి చర్చించే మంచి చిత్రమిది. అందుకే హీరోయిన్ పాత్ర కాకపోయినా అంగీకరించాను. కొన్ని సన్నివేశాల్లో నా నటనకు అబ్బాయిలు క్లాప్స్ కొడుతుండడం సంతోషాన్నిస్తోంది' అని అనూ ఇమ్మాన్యుయేల్ అన్నారు. రష్మిక మందన్న లీడ్‌రోల్‌లో నటించిన చిత్రమిది. రాహుల్ రవీంద్రన్ దర్శకుడు. ఇటీవలే విడుదలై చక్కటి ఆదరణతో కొనసాగుతోంది. ఈ చిత్రంలో కీలక పాత్ర పోషించిన అనూ ఇమ్మాన్యుయేల్ మీడియాతో మాట్లాడారు. ఒక మంచి సినిమాలో భాగమవ్వాలనే ఈ చిత్రంలో నటించాను. ఈ సినిమాను మంచి హిట్‌గా నిలిపిన ప్రేక్షకులకు ధన్యవాదాలు. ఇందులో దుర్గ అనే పాత్రలో నటించాను. నా వ్యక్తిత్వానికి పూర్తి భిన్నంగా ఉండే పాత్ర కావడంతో ప్రేక్షకులు ఎలా స్పందిస్తారో అని కంగారు పడ్డాను. రాహుల్ నా పాత్రను ప్రత్యేక శ్రద్ధతో తీర్చిదిద్దారు. ఇకపై నటనకు ఆస్కారమున్న కథానాయికల పాత్రలే చేయాలనుకుంటున్నాను' అని ఆమె చెప్పారు.

కుమారి పాత్ర దక్కడం నా అదృష్టం



'కాంత' చిత్రంలో కుమారి పాత్ర చేయడం నా అదృష్టం. ఇది నా కెరీర్‌లో చాలా ప్రత్యేకమైన చిత్రం. రెగ్యులర్ హీరోయిన్ తరహాలో కాకుండా ఇందులో నటనా ప్రాధాన్యమైన పాత్ర దక్కింది' అని కథానాయిక భాగ్యశ్రీ బోర్సే అన్నారు. దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటించిన చిత్రమిది. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వంలో దుల్కర్ సల్మాన్‌తో కలసి రానా నిర్మించారు. ఈ నెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా సినిమా విశేషాలను భాగ్యశ్రీ బోర్సేమీడియాతో పంచుకున్నారు.

● కెరీర్ ఆరంభంలోనే నాకు కుమారి లాంటి మంచి పాత్ర దొరికినందుకు ఆనందంగా ఉంది.'కాంత' చిత్రంలో నటిగా నాకు సవాల్ విసిరే పాత్రను పోషించాను. 1960ల నాటి నేపథ్యం కావడంతో నా పాత్ర కోసం చాలా సన్నద్ధమవ్వాల్సి వచ్చింది. చాలా కష్టమనిపించింది. శ్రీదేవి, సావిత్రి నటించిన పాత సినిమాలు చూశాను. వారి నటన స్ఫూర్తిగా కుమారి పాత్రను నాదైన శైలిలో ఆవిష్కరించేందుకు ప్రయత్నించాను.

● నేను ఇండస్ట్రీలోకి వచ్చాక తొలిసారి విన్న కథ ఇదే. అయితే చిత్రీకరణలో జాప్యం వల్ల నేను నటించిన ఇతర చిత్రాలు ముందు విడుదలయ్యాయి. దుల్కర్ సల్మాన్, రానాతో నటించడం మరింత ఆనందాన్నిచ్చింది. దర్శకుడు సెల్వ నా పాత్రను తీర్చిదిద్దిన విధానం అద్భుతం.

మా నాన్న బతికే ఉన్నాడు..

-ఈషా డియోల్



బాలీవుడ్ నటుడు ధర్మేంద్ర మరణించారంటూ మంగళవారం వార్తలొచ్చాయి. వీటిని ఆయన కుమార్తె ఈషా డియోల్ ఖండించారు. ఆ వార్తలు అవాస్తవం అని తెలిపారు. తమ కుటుంబం చెప్పేవరకూ ఎలాంటి వదంతులు వ్యాప్తి చేయొద్దని కోరారు. ధర్మేంద్రకు ముంబైలోని బ్రీచ్ క్యాండీ ఆస్పత్రిలో చికిత్స జరుగుతోందని, ప్రస్తుతం ఆయన ఆరోగ్యం బాగానే ఉందన్నారు. ఈ మేరకు ఓ పోస్ట్ పెట్టారు. 'మా నాన్న క్షేమంగానే ఉన్నారు. మేము ప్రస్తుతం ప్రైవసీని కోరుకుంటున్నాం. ఆయన కోలుకోవాలని కోరుకున్నవారందరికీ కృతజ్ఞతలు' అని పేర్కొన్నారు.ఈ ఫేక్ వార్తలపై ధర్మేంద్ర సతీమణి హేమమాలిని స్పందించారు. 'చికిత్స పొందుతూ కోలుకుంటున్న వ్యక్తి గురించి ఇలాంటి వార్తలు రాయడం క్షమించరానిది. బాధ్యత గల మీడియా ఛానళ్లు ఇలాంటి తప్పుడు వార్తలని ఎలా ప్రచారం చేస్తాయి. ఇది అత్యంత అవమానకరమైన, నిర్లక్ష్యమైన చర్య' అని అసహనం వ్యక్తం చేశారు.

భారీ యాక్షన్ డ్రాప్‌లో




కొత్త తరహా కథాంశంతో తెరకెక్కిన క్రైమ్ థ్రిల్లర్ 'రాబందు'. జయశేఖర్ కల్లు దర్శకత్వంలో పులిజాల సురేశ్ నిర్మించారు. త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ నేటి సమాజంలో చర్చనీయాంశంగా మారిన కొన్ని అంశాల ఆధారంగా రాసుకున్న కథతో ఈ చిత్రాన్ని భారీ యాక్షన్ డ్రాప్‌లో తెరకెక్కించాం' అని చెప్పారు. 'చిత్ర నిర్మాణంలో రాజీ పడకుండా భారీ వ్యయంతో నిర్మించాం' అని నిర్మాత చెప్పారు.

నాన్‌స్టాప్ ఎంటర్‌టైన్‌మెంట్



రోడ్ ట్రిప్ నేపథ్యంలో తెరకెక్కిన చిత్రం గోపీ గాళ్ల గోవా ట్రిప్'. రోహిత్, శశి దర్శకత్వం వహించారు. సాయికుమార్, సీతారామరాజు, రమణారెడ్డి నిర్మించారు. అజిత్ మోహన్, రాజు శివరాత్రి తదితరులు కీలకపాత్రలు పోషించారు. ఈ నెల 14న విడుదలవుతోంది. మంగళవారం చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. ఈ సందర్భంగా రోహిత్ మాట్లాడుతూ'గతంలో మేము తెరకెక్కించిన లఘు చిత్రాలకు మంచి పేరు వచ్చింది. యువతకు చక్కని సందేశంతోపాటు నాన్‌స్టాప్ ఎంటర్‌టైన్‌మెంట్‌ను అందించాలనే లక్ష్యంతో ఈ చిత్రం చేశాం. హాలీవుడ్ తరహా మేకింగ్‌తో ఎంతో కష్టపడి తెరకెక్కించాం' అని చెప్పారు.'కథలో ఊహించని మలుపులు ప్రేక్షకులను ఉత్కంఠకు గురి చేస్తాయి, కొన్నాళ్లపాటు ప్రేక్షకులను వెంటాడే సినిమా ఇది. అన్ని విభాగాలు ఎంతో శ్రమకోర్చి పనిచేసి మంచి అవుట్‌పుట్‌ను రాబట్టాయి' అని నిర్మాతలు చెప్పారు.

ఆస్పత్రిలో చేరిన బాలీవుడ్ విలన్



బాలీవుడ్ సీనియర్ నటుడు, విలన్ పాత్రల పోషణలో తనకంటూ ఓ ప్రత్యేకత ఏర్పరచుకున్న ప్రేమ్ చోప్రా(92) అనారోగ్య కారణాలతో సోమవారం ముంబైలోని లీలావతి ఆస్పత్రిలో చేరారు. వైరల్ ఇన్‌ఫెక్షన్, వయసు రీత్యా వచ్చే ఇబ్బందుల వల్ల ప్రేమ్‌చోప్రా అస్వస్థతకు గురయ్యారనీ, త్వరలోనే ఆయన కోలుకుంటారనీ చికిత్స చేస్తున్న డాక్టర్లు చెప్పారు. 1960-70ల దశకంలో విలన్‌గా ఓ వెలుగు వెలిగారు ప్రేమ్‌చోప్రా. ఆరు పదుల తన నట జీవితంలో ఆయన 380 చిత్రాల్లో నటించారు. సంభాషణలు పలికే తీరు, ఎక్స్‌ప్రెషన్స్‌తో నటుడిగా తన ప్రత్యేకతను చాటుకున్న ప్రేమ్‌చోప్రా బాలీవుడ్‌లోని ప్రముఖ విలన్లలో ఒకరిగా వెలిగారు. 'ఓ కౌన్ థీ'(1954), 'ఉపాకర్(1967), దో రాస్తే (1969), 'కటీ పతంగ్'(1970), బాబీ (1973), దో అంజానే (1976), త్రిశూల్ (1978), దోస్తానా (1980) తదితర చిత్రాల్లో ప్రేమ్‌చోప్రా అభినయం ఇప్పటికీ గుర్తుంటుంది.

నాలుగు తరాల కథ ఇది



- అక్కినేని నాగార్జున

'నాకు పూర్వ జన్మల నేపథ్యంలో తీసిన సినిమాలు చాలా ఇష్టం. అదే సబ్జెక్టుతో వచ్చిన నాన్నగారి 'మూగ మనసులు', నేను నటించిన 'జానకి రాముడు' సూపర్ హిట్ అయ్యాయి. 'గత వైభవం' కూడా నాలుగు తరాల కథ. ఈ సినిమా తీయడానికి ఎంత కష్టపడ్డారో ట్రైలర్ చూస్తూంటే అర్థమవుతోంది. సన్నివేశాలు అద్భుతంగా ఉన్నాయి. సినిమా పెద్ద బ్లాక్‌బస్టర్ కావాలి' అని హీరో నాగార్జున ఆకాంక్షించారు. ఎస్ఎస్ దుష్యంత్, ఆషికా రంగనాథ్ ప్రధాన పాత్రధారులుగా సింపుల్ సుని దర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రం 'గత వైభవం'. సర్వెగర సిల్వర్ స్క్రీన్స్, సుని సినిమాస్ బేనర్లపై దీపక్ తిమ్మప్ప, సుని నిర్మించారు. సినిమా ఈనెల 14న విడుదలవుతున్న సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. ఈ కార్యక్రమానికి నాగార్జున ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హీరో దుష్యంత్ మాట్లాడుతూ 'నాలుగు జన్మలకు సంబంధించిన చిత్రమిది. స్క్రీన్‌ప్లే చాలా కొత్తగా ఉంటుంది' అని తెలిపారు. చిత్రదర్శకుడు సింపుల్ సుని మాట్లాడుతూ 'ఇదొక డిఫరెంట్ జానర్ సినిమా. అన్ని వ్యాపారాంశాలు ఉన్న ప్రయోగాత్మక చిత్రం. ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారనే నమ్మకం మాకుంది' అని అన్నారు.

సంతాన ప్రాప్తిరస్తు విజయం ఖాయం



విక్రాంత్, చాందినీ చౌదరి జంటగా సంజీవ్ రెడ్డి తెరకెక్కించిన చిత్రం 'సంతాన ప్రాప్తిరస్తు' మధుర ఎంటర్‌టైన్‌మెంట్, నిర్వి ఆర్ట్స్ బేనర్‌పై మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మించారు. సినిమా ఈనెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర బృందం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించింది. దర్శకులు బాబీ, సందీప్ రాజ్,శైలేశ్ కొలను, బీవీఎస్ రవి, నిర్మాత లగడపాటి శ్రీధర్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బాబీ మాట్లాడుతూ "సంతాన ప్రాప్తిరస్తు' ట్రైలర్ బాగుంది. ఇలాంటి సున్నిత కథాంశాన్ని అందరికీ నచ్చేలా చేప్పే ప్రయత్నం చేశారు. తప్పకుండా సినిమా మంచి విజయం సాధిస్తుంది' అని అన్నారు. సందీప్‌రాజ్ మాట్లాడుతూ 'నా తొలి సినిమాకు హీరోయిన్ చాందినీ. ఆమె ఒక సినిమా చేస్తుందంటే అందులో కంటెంట్ ఉంటుందనే పేరు తెచ్చుకున్నారు' అని అన్నారు. శైలేష్ కొలను మాట్లాడుతూ 'ఒక సున్నిత కథాంశంతో వినోదాన్ని కలిపి తీసిన చిత్రమిది. గతంలో ఇలాంటి సినిమాలు మంచి విజయం సాధించాయి. ఈ మూవీ కూడా పెద్ద హిట్ అవుతుంది' అని పేర్కొన్నారు. చిత్ర దర్శకుడు సంజీవ్ రెడ్డి మాట్లాడుతూ 'సంతాన సమస్యలు ఉన్న వారు చికిత్స తీసుకోవచ్చు. కానీ అన్నీ బాగుండి లైఫ్ స్టయిల్ వల్ల సంతాన లేమితో బాధపడేవారి గురించి ఈ సినిమాలో చర్చించాం. మంచి ప్రేమ కథ, వినోదంతో పాటు గొప్ప సందేశమూ ఉంటుంది' అని వివరించారు. నిర్మాత మధుర శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ 'ఈ చిత్రంతో ఒక మంచి ప్రయత్నం చేశాం. విడుదలకు ముందు చిన్న చిత్రం గురించి చెప్పేందుకు ఏమీ ఉండదు, రిలీజ్ అయ్యాక అది సాధించే విజయాలకు అడ్డు ఉండదు' అని అన్నారు.

ముక్కోణపు ప్రేమకథ



గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన ఎమోషనల్ డ్రామా రోలుగుంట సూరి'. అనిల్ కుమార్ పల్లా దర్శకుడు. నాగార్జున పల్లా, ఆద్యారెడ్డి, భావన నీలప్ హీరో హీరోయిన్లుగా నటించారు. సౌమ్యా చాందిని నిర్మించారు. ఈనెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా మంగళవారం చిత్రబృందం నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్లో అనిల్ కుమార్ మాట్లాడుతూ 'గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన ముక్కోణపు ప్రేమకథా చిత్రమిది. మాస్ అంశాలతో పాటు కట్టిపడేసే భావోద్వేగాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి' అని అన్నారు. వాస్తవ ఘటనల ఆధారంగా తెరకెక్కిన చిత్రమిది అని సౌమ్యా చాందిని తెలిపారు. తెలుగులో అరుదైన, అద్భుతమైన సినిమాగా 'రోలుగుంట సూరి' మిగిలిపోవడం ఖాయం అని నాగార్జున పల్లా చెప్పారు.

17న కార్తీక వనభోజనాలు

ఉదయగిరి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని గన్నేపల్లి పంచాయతీలో ఉన్న శ్రీఅడవిపేరంటాలమ్మతల్లి ఆలయ సన్నిధిలో ఈనెల 17వ తేదీన కార్తీకమాసం సందర్భంగా వనభోజనాల కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా కార్తీక దీపోత్సవం, వనభోజనాల కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 11884
వెండి కిలో ధర	రూ. 158800
వెండి ఒక గ్రాము	రూ. 164.80

కార్యకర్తలే తెలుగుదేశం పార్టీకి బలం : ఎమ్మెల్యే కాకర్ల



ఎస్ఆర్ పురం : మండల కన్వీనర్లతో ఉదయగిరి ఎమ్మెల్యే సురేష్ తదితరులు

వింజమూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడి ఆదేశాల మేరకు స్థానిక తెలుగుదేశం ప్రధాన పార్టీ కార్యాలయంలో మంగళవారం మండలం, క్లస్టర్, యూనిట్ కమిటీలు అధ్యక్ష, కార్యదర్శుల ప్రమాణ స్వీకారోత్సవం ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్, మాజీ ఎమ్మెల్యే తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంభం విజయరామిరెడ్డి, రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి పి.చంచలబాబుయాదవ్, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి ఎల్సీ రమణారెడ్డిలు హాజరయ్యారు. అదేవిధంగా నియోజకవర్గంలో 8 మండలాల ముఖ్య నేతలు సమావేశానికి హాజరయ్యారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు, నాయకులకు పార్టీలో సముచిత స్థానం కల్పించడంలో తెలుగుదేశం పార్టీ ముందుంటుందన్నారు. కార్యకర్తలే పార్టీకి బలమని తెలి పారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ సానుభూతిపరులు పార్టీ సూచించిన నేతలను అఖండ విజయం సాధించేందుకు కృషి చేయాలన్నారు.

వింజమూరు మండల కన్వీనర్‌గా గూడా నరసారెడ్డి, దుత్తలూరు మండల కన్వీనర్‌గా ఉండేలా గురవారెడ్డి, వరికుంటపాడు మండల కన్వీనర్‌గా చంద్ర మధుసూదన్‌రావు, సీతారాంపురం కన్వీనర్‌గా చింతల శ్రీనివాసులు, కొండాపురం కన్వీనర్‌గా పోలినేని చంద్రబాబు నాయుడు, జలదంకి మండల కన్వీనర్‌గా మునగాల తిరుమలరెడ్డి, అలాగే మండల క్లస్టర్ ఇన్‌చార్జ్‌లుగా సీతారాంపురం తోకల రామచంద్ర, ఉదయగిరి షేక్ రియాజ్, దుత్తలూరు తాళ్లూరి దయానందం, వరికుంటపాడు పోక మహేష్, వింజమూరు చేబ్రోలు వసంతరావు, కొండాపురం పోలినేని రమేష్, కలిగిరి కల్లూరి చంద్రమౌళి, గంజం రాఘవేంద్ర, జలదంకి మందపల్లి మాల్యాద్రి, హునూరు భాస్కర్‌రెడ్డి, కో క్లస్టర్ ఇన్‌చార్జ్‌లుగా పేరం సుధాకర్‌రెడ్డి, మారెళ్ల మల్లికార్జున, పాములపాటి మాల్యాద్రి, అంబటి శంకరయ్య, నోటి మల్లికార్జున, దివి శ్రీనివాసులు, మండల ప్రధాన కార్యదర్శులుగా ముత్తూరు సుమన్‌బాబు, పోలుబోయిన శ్రీకాంత్‌యాదవ్, బద్దిపూడి మాచర్ల, జాజుల శివరామయ్య, చల్లా శ్రీనివాసులుయాదవ్, కందుకూరి వెంకటేశ్వర్లు, వీరితోపాటు మండల పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీలు, కోశాధికారులు, యూనిట్ ఇన్‌చార్జ్‌లుగా మరో 95 మంది చేత ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో 8 మండలాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

సీతారామపురం మండల టీడీపీ అధ్యక్షుడిగా చింతల

సీతారామపురం: వింజమూరులోని తెలుగు దేశం పార్టీ ప్రధాన కార్యాలయంలో ఉదయగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అధ్యక్షతన మంగళవారం సీతారామపురం మండల కమిటీని ప్రకటించారు. మండల అధ్యక్షుడిగా చింతల శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడిగా మేకనబోయిన మాల కొండయ్య, ప్రధాన కార్యదర్శిగా ముత్తూరు సుమన్‌బాబు, కార్యదర్శులుగా షేక్ బాబు, తోట మనోజ్‌బాబు, సయ్యద్ బాషా, తమ్మిశెట్టి వెంకటసుబ్బమ్మ, తమ్మిశెట్టి రమణయ్య, క్లస్టర్ ఇన్‌చార్జ్‌గా తోకల రామచంద్ర, యూనిట్ కమిటీలతో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ నూతన మండల అధ్యక్షుడు చింతల శ్రీనివాసులును శాలువాతో సత్కరించారు.

దుత్తలూరు మండల కన్వీనర్‌గా ఉండేలా

● దుత్తలూరు(ఉదయగిరి): తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్‌గా మండలంలోని రెడ్డదిన్నె గ్రామానికి చెందిన ఉండేలా గురవారెడ్డి నియమితులయ్యారు. మంగళవారం వింజమూరు టీడీపీ ప్రధాన కార్యాలయంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో దుత్తలూరు మండల నూతన టీడీపీ కన్వీనర్‌గా ఉండేలా గురవారెడ్డి, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిలు ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన ఎంపికకు సహకరించిన ఎమ్మెల్యే కాకర్ల సురేష్, మండల టీడీపీ నాయకులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

న్యూస్ బాక్స్

వాహనాల తనిఖీ


వాహనదారులను ప్రశ్నిస్తున్న ఎస్ఐ

అనంతసాగరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): దేశ రాజధానిలో జరిగిన పేలుళ్ల ఘటనతో పోలీసులు అప్రమత్తమయ్యారు. అనంతసాగరం ఎస్ఐ సూర్యప్రకాష్ రెడ్డి తమ సిబ్బందితో కలసి ఉప్పలపాడు వద్ద జాతీయ రహదారిపై వాహనాలను ఆపి తనిఖీలు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో గోపూజ

అనంతసాగరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగంగుంటలో ఉన్న తుమ్మాలమ్మ ఆలయంలో మంగళవారం మహిళలు గోపూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గోవులను అలంకరించి పూజలు చేశారు. ఈసందర్భంగా ఆలయంలో అన్నదానం నిర్వహించారు.

విత్తనశుద్ధి తప్పనిసరి


రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారి విజయభాస్కర్

ఉదయగిరి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పంటల సాగులో రైతులు తప్పనిసరిగా విత్తనశుద్ధి పాటించాలని మండల వ్యవసాయాధికారి విజయభాస్కర్ సూచించారు. మంగళవారం మండలంలోని అప్పసముద్రం, గుడినరవ రైతుసేవా కేంద్రాల పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వరినార్లు పోసుకునేందుకు సిద్ధమవుతున్న తరుణంలో వ్యవసాయాధికారులు సూచించిన మందులతో విత్తనశుద్ధి చేపట్టాలన్నారు. విత్తనశుద్ధి వల్ల నాటిన 20 రోజుల వరకు తెగుళ్ల సోకవన్నారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రీ సర్వేలో తప్పిదాలను సవరించాలి


ఆర్డీవోకు అర్జీలు అందజేస్తున్న రైతులు

ఉదయగిరి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం చేపట్టిన భూ రీసర్వేలో చోటుచేసుకున్న తప్పిదాలను సవరించాలని, నోషనల్ ఖాతాలు తొలగించాలని మంగళవారం బండగానిపల్లి రెవెన్యూ పరిధిలోని పలు గ్రామాల రైతులు ఆత్మకూరు ఆర్డీవో పావనికి విన్నవించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రీసర్వే తప్పిదాలు, నోషనల్ ఖాతాల వల్ల ప్రభుత్వ సంక్షేమ పథకాలు దరిచేరకపోవడంతోపాటు పంటల సాగుకు బ్యాంకు రుణాలు సైతం ఇవ్వడంలేదని వాపోయారు. ఏళ్ల తరబడి కార్యాలయాల చుట్టూ తిరిగినా సమస్య పరిష్కారం కావడంలేదని ఆర్డీవో ఎదుట రైతులు వాపోయారు. స్పందించిన ఆర్డీవో రీసర్వేలో జరిగిన తప్పిదాలను సవరించేందుకు మరలా సర్వే చేపట్టి రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దారు షాజియా, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కౌశల్ పోటీల్లో తరుణవాయి విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

సంగం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తరుణవాయి ఉన్నత పాఠశాల విద్యార్థులు కౌశల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. 10వ తరగతికి చెందిన పి పల్లవి, షేక్ సమీర్, 9వ తరగతికి చెందిన జి గిరిష్మా, వి లాస్య, 8వ తరగతికి చెందిన ఎం ప్రవీనాష్ అనే విద్యార్థులు ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి కౌశల్ పోటీలకు ఎంపికయ్యారు. త్వరలో జిల్లాస్థాయిలో పోటీలు నిర్వహిస్తారని ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు తెలిపారు. దీంతో కౌశల్ కు ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

బాధిత కుటుంబానికి ఎంపీ వీపీఆర్ అండ

● రూ. 5లక్షల చెక్కు అందజేసిన వీపీఆర్ సిబ్బంది


చెక్కును అందజేస్తున్న వీపీఆర్ సిబ్బంది

వింజమూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కర్నూలు రోడ్డు ప్రమాద ఘటనలో మృతి చెందిన వింజమూరు మండలం గోళ్లవారిపల్లెకు చెందిన గోళ్ల రమేష్ కుటుంబ సభ్యులకు నెల్లూరు పార్లమెంటు సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆర్థికసాయం అందించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించిన సమయంలో తనతరపున రూ.5లక్షలు అందజేస్తానని ఇచ్చిన హామీ మేరకు మంగళవారం మృతుడు రమేష్ తండ్రి మాలకొండయ్య, తల్లి సుశీలకు వీపీఆర్ సిబ్బంది శంకర్, రమేష్, తదితరులు చెక్కును అందచేశారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి బాధిత కుటుంబానికి ఎప్పుడూ అండగా ఉంటారని వారు తెలిపారు. బాధిత కుటుంబ సభ్యులు కొండా మహేశ్వరరావు మాట్లాడుతూ ఇచ్చిన మాట మేరకు తమ కుటుంబానికి అండగా నిలబడిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

వనభోజన మహోత్సవాన్ని విజయవంతం చేయాలి


వన భోజన మహోత్సవ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న జిల్లా యాదవ సంఘం నాయకులు

ఆత్మకూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలోని మర్రిపాడులో పిఎస్ఆర్ బృందావనంలో ఈనెల 16వ తేదీన కార్తీకమాస వన భోజన మహోత్సవానికి యాదవులందరూ కుటుంబసమేతంగా తరలివచ్చి విజయవంతం చేయాలని నెల్లూరు జిల్లా యాదవ్ భవన్ ట్రస్ట్ అధ్యక్షుడు బొమ్మి కిషోర్‌యాదవ్, యాదవ యంప్లాయిస్ అసోషియేషన్ (యాపా) జిల్లా అధ్యక్షుడు పెరుమాళ్ల కొండయ్యయాదవ్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ మహిళా ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ల పద్మజా యాదవ్ కోరారు. మంగళవారం వారు ఆత్మకూరు పట్టణంలో స్థానిక యాదవులతో కలిసి వన భోజన మహోత్సవం కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం పలువురు యాదవుల ఇళ్లకు వెళ్లి కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వనభోజన మహోత్సవం సందర్భంగా ఉదయం 9 గంటలకు గోపూజ, ఉసిరిచెట్టు, శివలింగం పూజలు జరుగుతాయన్నారు. కావున నియోజకవర్గంలోని యదు వంశీయులందరూ కుటుంబసమేతంగా హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత యాదవ సంఘం జిల్లా మహిళా అధ్యక్షురాలు ఉడత శైలజయాదవ్, యాపా నాయకులు రామచంద్రయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విషపురుగుల ఆవాసాలుగా ఖాళీ జాగాలు

● భయాందోళనలో ప్రజలు


ఖాళీ జాగాల్లో ఏపుగా పెరిగిన కంపచెట్లు

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఖాళీ జాగాలు విషపురుగులకు ఆవాసాలుగా మారడంతో ప్రజలు భయందోళన చెందుతున్నారు. రహదారులు, నివాసాల నడుమ ఉన్న ఖాళీ స్థలాల్లో ఏళ్ల తరబడి ఏపుగా పెరిగిన కంపచెట్ల నడుమ విషపురుగుల సంచారం అధికమవడంతో అటుగా ప్రయాణాలు సాగించాలంటే ఎలాంటి ప్రమాదాలకు గురికావల్సి వస్తుందోనని బెంబేలెత్తిపోతున్నారు. మండలంలోని తోటలచెరువుపల్లి బస్టాండ్ సెంటర్ సమీపంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న ఖాళీ జాగాల్లో అడవిని తలపించేలా కంపచెట్లు పెరిగి విషపురుగులకు అడ్డాగా మారింది. దీంతో వాటిని ఆనుకొని ఉన్న నివాసాల్లోకి విషపురుగులు రాత్రి, పగలు లేకుండా సంచరితస్తుండడంతో ప్రజలు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని జీవనం సాగించాల్సి వస్తోంది. అంతేగాక అలాంటి ప్రాంతాలు దోమలకు నిలయంగా మారడంతో వాటి తాకిడిని తట్టుకోలేక రాత్రంతా జాగారం చేయాల్సి వస్తోందని వాపోతున్నారు. రహదారిపై రాకపోకలు సాగించే ప్రజలతో పాటు వాహనదారులకు విషపురుగులు కనిపించిన సమయంలో వాటి నుంచి కాపాడుకునే క్రమంలో తిప్పలు తప్పడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

చిరుధాన్యాల సాగు రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు



రైతుల సమావేశంలో పాల్గొన్న ఏడీ సత్యవాణి

వింజమూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): వరిసాగు చేస్తున్న రైతులకు గిట్టుబాటు ధర లేక నష్టపోతున్నారని, దానికి ప్రత్యామ్నాయ పంటగా చిరుధాన్యాల సాగుకు రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టి, ప్రోత్సాహకాలు అందిస్తోందని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని గోనుగుంట కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన చిరుధాన్యాల మేళా కార్యక్రమానికి ఎమ్మెల్యే కాకర్ల ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. అనంతరం జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి మాట్లాడుతూ చిరుధాన్యాల సాగుకు ఉదయగిరి నియోజకవర్గం అనుకూలమైన ప్రాంతంగా ఉంటుందని తద్వారా రైతులు అధిక మొత్తంలో చిరుధాన్యాలు సాగు చేయాలని సూచించారు. చిరుధాన్యాల సాగు లాభసాటిగా ఉంటుందని, పోషక విలువలు ఎక్కువగా ఉండడం వలన ప్రజారోగ్యం మెరుగుపడుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా సీనియర్ శాస్త్రవేత్త వెంకటేశ్వర్లు, ఆత్మ డీపీవో మురళీ, జిల్లా ఏడీఏ నర్సోజీరావు, ఐటీడీఏ ఏపీఓ నీరజా, వింజమూరు సబ్ డివిజన్ ఏడీఏ శేషగిరి, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, ఏఓ వాసు, అధికారులు, రైతులు, పాల్గొన్నారు.

దెబ్బతిన్న అరటి తోటలను పరిశీలించిన అధికారులు


వెంకట్రావుపల్లి వద్ద అరటి తోటలను పరిశీలిస్తున్న ఉద్యానవన అధికారి షాహిల్

ఆత్మకూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీ పరిధిలోని వెంకట్రావుపల్లిలో దెబ్బతిన్న అరటి తోటలను జిల్లా ఉద్యాన వనశాఖ అధికారి ఆదేశాల మేరకు మంగళవారం వింజమూరు ఉద్యానవన అధికారి షాహిల్ స్థానిక సచివాలయం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దెబ్బతిన్న అరటి తోటలపై త్వరలో జిల్లా అధికారులకు నివేదిక అందజేస్తామని తెలిపారు. రైతు సంఘం నాయకులు లక్కు కృష్ణప్రసాద్ మాట్లాడుతూ దెబ్బతిన్న అరటి తోటలకు నష్ట పరిహారం కోసం గ్రీవెన్స్ సెల్‌లో సంబంధిత అధికారులకు వినతిపత్రం అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయం వీఏవో ఇంద్రాణి, రైతు సంఘం నాయకులు హారతి, రైతులు పాల్గొన్నారు.

బోడబండ సప్లయ్ చానల్ పరిశీలన


కాలువను పరిశీలిస్తున్న జలవనరుల శాఖ అధికారులు

ఉదయగిరి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి చిన్న, పెద్ద చెరువులకు వరద నీరు అందించే బోడబండ సప్లయ్ చానల్‌ను మంగళవారం జలవనరుల శాఖ అధికారులు పరిశీలించారు. ఈసందర్భంగా డీఈ కందు కూరి చంద్రమౌళి మాట్లాడుతూ సప్లయ్ చానల్ సమీపంలో లేఅవుట్లు ఉండడంతో కొందరు ఎక్స్‌కవేటర్‌తో కాలువను చదును చేసి ఆక్రమించేందుకు యత్నిస్తున్నారని తమకు ఫిర్యాదులు అందాయన్నారు. దీంతో చదును చేసిన వారిపై రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేయడంతోపాటు కాలువను పరిశీలించడం జరిగిందన్నారు. కాలువ పోరంబోకు స్థలంలో వేసి ఉన్న రాళ్లను తొలగించడం జరిగిందన్నారు. త్వరలో బోడబండ సప్లయ్ చానల్, చిన్న, పెద్ద చెరువులను సర్వే చేయించి హద్దురాళ్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఎవరైనా ఆయా స్థలాలను ఆక్రమించి ఉంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఈలు వేణు, సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

విత్తనశుద్ధిపై రైతులకు అవగాహన అవసరం


రైతులచే విత్తనశుద్ధి చేయిస్తున్న శాస్త్రవేత్తలు

దుత్తలూరు (ఉదయగిరి), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పంటలు సాగుచేసే రైతులు విత్తనశుద్ధి చేపడితే అధిక లాభాలు ఉంటాయని నెల్లూరు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు లలితశివజ్యోతి, కిరణ్‌కుమార్‌రెడ్డి, విజయకుమార్‌నాయక్‌లు సూచించారు. మంగళవారం మండల వ్యవసాయాధికారి మదన్‌మోహన్ సమక్షంలో రైతులకు శనగ విత్తనాలను పంపిణీ చేసి విత్తనశుద్ధిపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్‌బీఈజీ-776 రకం శనగ రకం ఎండు తెగులు తట్టుకుని, మొక్కలు 45-50 సెంటీమీటర్ల ఎత్తు పెరిగి మిషన్ కోతకు అనుకూలంగా ఉంటుందన్నారు. శనగ, జొన్న విత్తనం విత్తే ముందు విత్తనశుద్ధి చేయాలన్నారు. విత్తనశుద్ధి చేయడం ద్వారా మొక్క చీడపీడలను తట్టుకుంటుందన్నారు. విత్తనశుద్ధి ఎలా చేయాలో చూపించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు దినేష్, రామకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

సంగం సొసైటీకి ఎరువుల సరఫరా

సంగం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (సొసైటీ)కి యూరియాతోపాటు పలు రకాల ఎరువులు సరఫరా అయ్యాయని సొసైటీ చైర్మన్ గుండ్లపల్లి శ్రీనివాసులు యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. డీఏపీ, సూపర్ పాస్పెట్ (గుళికలు), జింక్ సల్ఫేట్, యూరియా వంటి ఎరువులు సరఫరా అయ్యాయన్నారు. కావలసిన రైతులు తీసుకువెళ్లాలని ఆయన కోరారు.

C.R.I.M.E N.E.W.S

అగ్నిప్రమాదంలో రెండు దుకాణాల దగ్ధం


ఆగ్నికి ఆహుతైన రెండు దుకాణాలు

సీతారామపురం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పబ్బులేటి పల్లి రోడ్డు సెంటర్‌లో జాతీయ రహదారి పక్కన గల రెండు దుకాణాలు మంగళవారం అగ్నికి ఆహుతయ్యాయి. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రోడ్డు సెంటర్లో కడుగు లక్ష్మయ్య పెట్రోల్, డీజల్ లూజు విక్రయాలతో పాటు కూల్‌డ్రింక్స్ జిరాక్స్, కిరాణా షాపులను నిర్వహిస్తుండగా, పక్కనే మరో గదిలో బూతపాటి వెంకటమ్మ టైలరింగ్ షాపుతో పాటు చీరల దుకాణం నిర్వహిస్తోంది. ఈనేపథ్యంలో మంగళవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో కడుగు లక్ష్మయ్య దుకాణంలో ఆకస్మాత్తుగా మంటలు చెలరేగి పక్కనున్న దుకాణంలో కూడా మంటలు వ్యాపించడంతో చీరలు దుస్తులన్నీ కాలిపోయాయి. లక్ష్మయ్య దుకాణంలోని సామాగ్రి కూడా అగ్నికి ఆహుతి అయింది. ఉదయగిరి నుంచి ఫైర్ ఇంజన్ వచ్చేలోపు రెండు దుకాణాల్లోని సామాగ్రి అంతా కాలిపోయింది. సుమారు రూ. 5 లక్షల మేరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు అంచనా. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

రెండు బైకులు ఢీకొని ముగ్గురికి తీవ్రగాయాలు


బైకులు ఢీకొన్న ప్రమాదంలో గాయపడిన వ్యక్తులు

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాగులపాడు సెంటర్ సమీపంలోని నాగమాంబాపురం రోడ్డు మలుపులో ముంబై జాతీయ రహదారిపై రెండు బైకులు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల మేరకు... మంగళవారం ఓ బైక్‌పై గురజాల వెంకటేశ్వర్లు, ఆమారి వెంకటరమణయ్యలు నెల్లూరు నుంచి బుచ్చికి వస్తూ కాగులపాడు సెంటర్ సమీపంలోని జాతీయ రహదారిపై నాగమాంబాపురం వెళ్లే రోడ్డు వైపు మలుపు తిరుగుతుండగా వెనుక నుంచి మరో బైకులో వచ్చిన మండలంలోని ఖాజానగర్ చెందిన ఎస్‌కే.సోను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో గాయపడిని ముగ్గురిని స్థానికులు చికిత్స నిమిత్తం బుచ్చి ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం అనంతరం నెల్లూరులోని ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

గేదెను ఢీకొని వ్యక్తికి గాయాలు

రాపూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాపూరు పట్టణం సమీపంలో ఉన్న టోల్ ప్లాజా వద్ద గేదెను ఢీకొనడంతో ద్విచక్ర వాహనదారుడికి తీవ్ర గాయలయ్యాయి. వివ రాలి ఉన్నాయి. మంగళవారం రాత్రి భూపతి సురేంద్ర గుండవోలు నుండి స్వగ్రామమైన ఆంజనేయపురం వస్తుండగా టోల్ ప్లాజా వద్ద రాత్రి వేళ గమనించకుండా గేదెను ఢీ కొట్టడంతో తీవ్ర గాయాల వ్వగా, 108 సిబ్బంది రాపూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు.

పోక్సో కేసులో నిందితుడికి జీవితఖైదు

నెల్లూరు (లీగల్), నవంబరు 11(ఆంధ్రజ్యోతి) బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడన్న కేసులో నేరం రుజువు కావడంతో మహమ్మద్ నాసిర్‌కు జీవిత ఖైదుతోపాటు రూ. 40 వేల జరిమానా విధిస్తూ నెల్లూరు జిల్లా పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయాధికారి సిరిపిరెడ్డి సుమ మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు వివరాలు... నెల్లూరు నగరం జాకీర్‌హుసేన్‌లో నాసిర్ కారు మెకానిక్‌గా ఉండేవాడు. ఈ నేపథ్యంలో పెన్నానది సమీపంలో ఓ రేకుల ఇంటిని కొనుగోలు చేశాడు. ఆ ఇంటిని రిపేరు చేసే క్రమంలో ఓ షాపులో సిగరెట్టు కొనేందుకు వెళ్లాడు. అదే సమయంలో అ ప్రాంతానికి చెందిన బాలిక(7) తినుబండారాలు కొనుక్కునేందుకు అక్కడికి వచ్చింది. ఆ బాలికతో నాసిర్ పరిచయం పెంచుకున్నాడు. ఈ క్రమంలో 2020 డిసెంబరు 8న తినుబండరాలు కొనిస్తానని చెప్పి, ఆ బాలికను తన స్కూటర్‌పై ఎక్కించుకుని తాను కొత్తగా కొన్న ఇంటికి తీసుకువెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. నవాబుపేట పోలీసులు నిందితుడిపై పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. విచారణా కాలంలో నిందితుడిపై నేరం రుజువు కావడంతో పైవిధంగా శిక్ష విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డీ. చంద్రశేఖర్ వాదించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

నెల్లూరు(క్రైం), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్ పార్శిల్ కార్యాలయం సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మంగళవారం మృతి చెందాడు. సుమారు 40 నుంచి 45 ఏళ్లలోపు వయసు కలిగి, పింక్ కలర్ ఫుల్ హ్యాండ్స్ చొక్కా, సిమెంటు రంగు జీన్స్ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని జీజీహెచ్‌కి తరలించి రైల్వే ఎస్ఐ హరిచందన కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు రైల్వే పోలీసులకు తెలియజేయాలని ఎస్ఐ కోరారు.

సోమశిలకు 10,501 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

అనంతసాగరం నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి మంగళవారం 10,501 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. దిగువకు 12,650, ఉత్తర కాలువకు 50, కండలేరుకు 560 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నామన్నారు. డ్యాంలో 71.791 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు.

● **కండలేరులో నీటి నిల్వ 58.37 టీఎంసీలు**

రాపూరు : మండలంలోని కండలేరు డ్యాం నీటి నిల్వ సామర్థ్యం 68 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటిమట్టం 58.37 టీఎంసీలుగా ఉన్నదని ఏఈ అనిల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల నుంచి 600 క్యూసెక్కుల నీరు ఇన్ ఫ్లో వస్తుండగా, 850 క్యూసెక్కులు అవుట్ ఫ్లో ఉందని ఆయన తెలిపారు.

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	130
స్కిన్ చికెన్	234
స్కిన్‌లెస్	258

కోడిగుడ్ల ధర (100): 600

నేడు టీడీపీ కమిటీల ప్రమాణ స్వీకారం

కావలి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కావలి నియోజకవర్గంలో టీడీపీ మండల, క్లస్టర్, యూనిట్, అనుబంధ, గ్రామ, బూత్‌కమిటీల ప్రమాణ స్వీకారోత్సవం బుధవారం జరుగుతోందని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆదేశాల మేరకు కావలి ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి ఆధ్వర్యంతో కావలి టీడీపీ కార్యాలయంలో ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఉదయం 10 గంటలకు, కావలి రూరల్, 11.30 గంటలకు బోగోలు, మధ్యాహ్నం 3గంటలకు దగదర్తి, సాయంత్రం 5 గంటలకు అల్లూరు మండలం ప్రమాణస్వీకారోత్సవాలు జరుగుతాయని తెలిపారు. పదవులు పొందిన వారు ఆయా సమయాలకు వచ్చి ప్రమాణ స్వీకారం చేయాల్సి ఉంది.

టీడీపీ మండల కన్వీనర్‌గా మునగాల



జలదంకి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల కన్వీనర్‌గా చామదలకు చెందిన మునగాల తిరుమలరెడ్డి ఎంపికయ్యారు. ఈయన ఇప్పటి వరకు తెలుగుయువత మండల అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. అదేవిధంగా ప్రధానకార్యదర్శిగా చోడవరంకు చెందిన జాజుల శివరామయ్యయాదవ్, ఉపాధ్యక్షుడుగా అన్నవరంకు చెందిన వేల్పుల వేణుగోపాల్‌లతో పాటు మొత్తం 13 మందితో టీడీపీ మండల కమిటీని ఏర్పాటు చేశారు. నూతన కమిటీకి మంగళవారం వింజమూరులోని పార్టీ కార్యాలయంలో ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ప్రమాణస్వీకారం చేయించారు. సుదీర్ఘకాలం మండల కన్వీనర్‌గా కొనసాగిన పీ.మధుమోహన్‌రెడ్డి సోమశిల ప్రాజెక్ట్ ఉపాధ్యక్షుడిగా ఎన్నిక కావడంతో మండల కన్వీనర్ బాధ్యతలు తిరుమలరెడ్డికి అప్పగించారు. గత సార్వత్రిక ఎన్నికల్లో మండలంలోనే అత్యధికంగా ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు చామదల పంచాయతీలో మెజార్టీ రావడంతో అదే పంచాయతీకి చెందిన తిరుమలరెడ్డిని పార్టీ అధిష్ఠానం మండల కన్వీనర్‌గా ఎంపిక చేసింది. ఈ సందర్భంగా తిరుమలరెడ్డి ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ మండలంలో పార్టీ బలోపేతానికి తన వంతు కృషిచేస్తానన్నారు. తనపై నమ్మకం ఉంచి పదవి అప్పజెప్పిన ఎమ్మెల్యే కాకర్ల సురేష్, జిల్లా, రాష్ట్ర పార్టీకిరుణపడి ఉంటానని పేర్కొన్నారు. ఆయనకు జలదంకి కూటమి పార్టీల నాయకులు అభినందనలు తెలిపారు.

టీడీపీ బలోపేతానికి కృషి చేస్తా



చంద్రబాబునాయుడును అభినందిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల, తదితరులు

కొండాపురం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలో తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కృషిచేస్తానని నూతనంగా నియమితులైన టీడీపీ మండల అధ్యక్షుడు పోలినేని చంద్రబాబునాయుడు అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అధిష్ఠానం సూచన మేరకు తన కార్యాలయంలో చంద్రబాబునాయుడు పేరును ప్రకటించి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన కాకర్ల సురేష్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కాగా చంద్రబాబునాయుడుకు టీడీపీ మండల నాయకులు గంటా నరసింహులు, బొట్లగుంట హరిబాబు, యారవ క్రిష్ణయ్య, పోలినేని రమేష్, దాసరి అశోక్, జాగర్లమూడి శ్రీనివాసులు బి.మాచర్ల, అల్లిక మధు, కొమ్మి ప్రభాకర్, తదితరులు అభినందనలు తెలిపారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

కావలి రూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లపాలెంలో హెచ్‌ఐవీ సేవా కేంద్రంలో పట్టణానికి చెందిన అన్నం సుబ్బారావు సతీమణి సుగుణమ్మ ప్రథమ వర్థంతి సందర్భంగా ఆమె కుటుంబ సభ్యులు మంగళవారం హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. సేవాకేంద్రం నిర్వాహకురాలు సిస్టర్ జెసింతా మాట్లాడుతూ మా సేవా కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న వ్యాధి గ్రస్తుల కోసం పౌష్టికాహారం పంపిణీ చెయ్యటం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా సుగుణమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సేవా కేంద్రం కోఆర్డినేటర్ సుబ్బారావు, సుగుణమ్మ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అంతా మా ఇష్టం !

(5వ పేజీ తరువాయి)

● 15 మందికి బదిలీలు..

ఇటీవల ఏకంగా 15 మంది వరకూ నెల్లూరు సర్కిల్ పరిధిలో ఉద్యోగులను ఒకచోట నుంచి మరోచోటకు మార్చారు. ఇది కొంత మంది ఉద్యోగులకు లాభదాయకంగా మారుతుండగా, మిగిలిన వారికి భారంగా మారుతోంది. ఉదాహరణకు కావలి డివిజన్‌లో పనిచేస్తున్న ఓ సూపరింటెండెంట్, ఏటీవో, టైపిస్ట్‌ను నెల్లూరు ఎస్ఈ కార్యాలయానికి వర్కింగ్ అరేంజ్‌మెంట్ పేరుతో మార్చారు. ఈ మూడు పోస్టులు డివిజన్ స్థాయిలో చాలా కీలకమైనవి. ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్ చూసుకునేందుకు సూపరింటెండెంట్, టెక్నికల్ వర్క్ చూసుకునేందుకు ఏటీవో, ఫైళ్ల సిద్ధం చేయడంలో టైపిస్టు ప్రధానమైన ఉద్యోగులు. అయితే ఈ ముగ్గురినీ నెల్లూరు సర్కిల్ కార్యాలయానికి బదిలీ చేయడంతో కావలి డివిజన్‌పై ఆ ప్రభావం తీవ్రంగా పడింది. అక్కడ మిగిలిన ఉద్యోగులపై వీరిద్దరి పని భారం మోపారు. అయితే నెల్లూరు ఎస్ఈ కార్యాలయంలో సూపరింటెండెంట్, ఏటీవో, టైపిస్టు పోస్టులు ఖాళీగా లేకపోవడం గమనార్హం. ఇక్కడ సరిపడా సిబ్బంది ఉన్నా, అవసరం లేకపోయినా స్వలాభం కోసం కావలి నుంచి ముగ్గురు ఉద్యోగులను నెల్లూరుకు తీసుకొచ్చారని ఆ శాఖ వర్గాలు చెబుతున్నాయి.

● అంత అవసరం దేనికొచ్చింది...?

అలానే ఓ సీనియర్ అసిస్టెంట్‌ను తిరుపతి కార్యాలయం నుంచి మరో జూనియర్ అసిస్టెంట్‌ను గూడూరు డివిజన్ కార్యాలయం నుంచి నెల్లూరుకు తీసుకొచ్చారు. ఆ రెండు పోస్టులు నెల్లూరులో ఖాళీ లేకపోయినా ఆ ఉద్యోగుల కోసం నిబంధనలకు విరుద్ధంగా ఉన్నతాధికారి ఆర్డర్స్ వేశారు. వీరే కాకుండా నాయుడుపేట, పొదలకూరు సబ్ డివిజన్ల పరిధిలో కూడా ఇష్టమొచ్చినట్లు ఉద్యోగులను అటు, ఇటు బదిలీ చేశారు. నెల్లూరు సర్కిల్ పరిధిలో ఉన్న ఒంగోలు కార్యాలయాల్లోని ఉద్యోగుల వర్కింగ్ అరేంజ్‌మెంట్లు కూడా వివాదాస్పదమవుతున్నాయి. ఇలా వర్కింగ్ అరేంజ్‌మెంట్ల పేరుతో మారిన ఉద్యోగుల్లో చాలా మంది ఇటీవలే బదిలీపై వెళ్లి తిరిగి వారు కోరుకున్నచోటుకు రావడం గమనార్హం. ఆర్‌అండ్‌బీ అధికారులు ఇష్టమొచ్చినట్లు బదిలీలు చేసుకునేటప్పుడు ప్రభుత్వం బదిలీలు అనే ప్రక్రియ చేపట్టడం ఎందుకున్న ప్రశ్న తలెత్తుతోంది. గతేడాది ఇదే మాదిరిగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో డిప్యుటేషన్ల దందా కొనసాగడంతో అప్పటి కలెక్టర్ జిల్లాలోని అన్నీ శాఖలో డిప్యుటేషన్లు రద్దు చేశారు. బదిలీల్లో ఎక్కడికి వెళ్లినా ఉద్యోగి అక్కడే పనిచేయాలని, వారిని మార్చేందుకు వీల్లేదంటూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. కానీ ఆర్‌అండ్‌బీ శాఖలో కలెక్టర్ ఆదేశాలకు కూడా లెక్కచేయడం లేదు. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ ఇన్‌చార్జ్ ఎస్ఈ రామకృష్ణప్రసాద్‌ను వివరణ కోరగా, పూర్వపు ఎస్ఈ కొంత మందికి వర్కింగ్ అరేంజ్‌మెంట్లు ఇచ్చినట్లున్నారని చెప్పారు. వీటిని పరిశీలిస్తామని ఆయన పేర్కొన్నారు.

రాళ్లపాడు ఆయకట్టు పరిధిలో...

వరి సాగుకు శ్రీకారం!

● ప్రారంభమైన నారుమడులు



ప్రాజెక్టు కుడి కాలువలో ప్రవహిస్తున్న నీరు



చినపవని పొలాల్లో వరి నారుమడి

లింగసముద్రం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రాళ్లపాడు ఆయకట్టు పరిధిలో వరిసాగుకు రైతులు సమాయత్తం అయ్యారు. అందులో భాగంగా నారుమడులు పనుల్లో రైతులు బిజీగా ఉన్నారు. మొంథా తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురవడంతో ప్రాజెక్టులోకి పూర్తి సామర్థ్యానికి మించి నీరు చేరింది. దీంతో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఈ నెల 9వ తేదీన ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువలకు సాగు నీటిని విడుదల చేశారు. దీంతో కుడి, ఎడమ కాలువల పరిధిలోని రైతులు మాగాణి భూముల్లో వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టారు. దుక్కులు దున్ని వరి నారుమడులను సిద్ధం చేస్తున్నారు. ఈ క్రమంలో విత్తనాల కోసం స్థానికంగా ఉన్న డీలర్లతో పాటు కావలి, కందుకూరు ప్రాంతాలకు వెళ్లి కొనుగోలు చేస్తున్నారు. కాగా ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలో లింగసముద్రం, వలేటివారిపాలెం, గుడ్లూరు, కొండాపురం మండలాలు ఉండగా అధికారిక ఆయకట్టు 16,000 ఎకరాలు, అనధికారికంగా మరో 8, 9వేల ఎకరాలు సాగు చేస్తారు. ముఖ్యంగా కుడి కాలువ పరిధిలో 14,500, ఎడమ కాలువ పరిధిలో 1500 ఎకరాల భూములు ఉన్నాయి. అయితే ఈ ఏడాది ఎక్కువ మంది రైతులు వరి సాగు చేస్తుండగా, మరికొందరు రైతులు పత్తి పైరు సాగు చేస్తారని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 20 అడుగులకు పైగా నీటిమట్టం ఉండడం, సోమశిల ప్రాజెక్టు నుంచి కూడా నీరు వచ్చే అవకాశం ఉండడంతో రైతులకు పంటల సాగుకు పూర్తి భరోసా కలిగింది. అయితే ప్రాజెక్టులో ఉన్న అధికారులు, సిబ్బంది కొరతను దృష్టిలో ఉంచుకొని కాలువలపై నీటి నిర్వహణకు కొందరిని నియమించాలని రైతులు కోరుతున్నారు.

ఘనంగా మౌలానా అబుల్ కలాం జయంతి



కందుకూరు : మౌలానా అబుల్ కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

కందుకూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : భారత రత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు స్థానిక టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పట్టణ పార్టీ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధుడు, తొలి విద్యాశాఖ మంత్రిగా దేశానికి ఆయన అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సయ్యద్ అహ్మద్‌బాషా, షేక్ సలాం, షేక్ రూబీ, సయ్యద్ జియావుద్దీన్, షేక్ నజీర్, నాయబ్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

● ఆర్ఎస్ఆర్‌లో...

బిట్రగుంట(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కడనూతలలోని ఆర్ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల్లో నేషనల్ ఎడ్యుకేషన్ డే కళాశాల ప్రిన్సిపాల్ పీవీఎన్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా జరిగింది. భారతదేశ మొదటి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయింతిని పురస్కరించుకుని ఇన్స్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ కౌన్సిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో ఆర్వీ.రమణారెడ్డి జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభిచగా రిసోర్స్ పర్సన్‌గా హ్యూమానిటీస్ అండ్ సైన్సెస్ విభాగాధిపతి డాక్టర్ లక్ష్మీ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఐఐసీ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, ఉపాధ్యక్షుడు పీ.బృందావని, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో విద్యుత్ వైర్ల చోరీ

● రూ.4 లక్షల నష్టం



వలేటివారిపాలెం జగనన్న కాలనీలో విద్యుత్ తీగలను కత్తిరించడంతో ఖాళీగా ఉన్న విద్యుత్ స్తంభాలు

వలేటివారిపాలెం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన వలేటివారిపాలెం జగనన్న కాలనీలో దొంగలు పడ్డారు. కాలనీలో విద్యుత్ స్తంభాలకు లాగిన విద్యుత్ వైర్లను అపహరించకెళ్లారు. వీటి విలువ సుమారు రూ.4 లక్షలకు పైనే ఉంటుందని విద్యుత్ అధికారులు అంచనా వేస్తున్నారు. ఇది ఎప్పుడు జరిగిందో ఏమోగానీ మంగళవారం వెలుగులోకి వచ్చింది. వైసీపీ ప్రభుత్వ హయంలో వలేటివారిపాలెంలో గ్రామానికి దూరంగా 5 ఎకరాల్లో జగనన్న లేఅవుట్ వేసి 170 ప్లాట్లు ఏర్పాటు చేసి 130 మంది లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు. ఈ లేవుట్‌లో సుమారు 50 విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్ వైర్లు లాగారు. ఊరికి దూరంగా లేఅవుట్లు వేసి పట్టాలు పంపిణీ చేయడంతో లబ్ధిదారులు ఒక్క ఇల్లు కూడా నిర్మించలేదు. దీంతో ఆ కాలనీలో ముళ్ల చెట్లు దట్టంగా పెరిగాయి. దీనికి తోడు జనసమూహం లేని ప్రాంతం కావడంతో గుర్తు తెలియని దుండగులు స్తంభాలకు ఉన్న లక్షలు విలువైన విద్యుత్ తీగలను అపహరించుకెళ్లారు. ఈ ఘటనపై విద్యుత్ ఏఈ మధుబాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా గత ఏడెనిమిది నెలల క్రితం రేళ్లపాడు జగనన్న కాలనీలో ఇదేవిధంగా విద్యుత్ స్తంభాలకు ఉన్న తీగలను అపహరించుకుపోయారు.

జిల్లాస్థాయికి నేకునాంపేట విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం రమణ, తదితరులు

కొండాపురం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్లో ఈనెల 3,4,5 తేదీలలో జరిగిన కౌశల్ పరీక్షలో మండలంలోని నేకునాంపేట జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపి జిల్లాస్థాయికి ఎంపికయినట్లు ప్రధానోపాధ్యాయుడు వీవీ.రమణ తెలిపారు. క్విజ్ విభాగంలో ఇండ్ల వెంకటమనోజ్, గూడూరు సుజిత్, పీ.నాజియా, పోస్టర్ విభాగంలో ఇండ్ల నాగచైతన్య, రీల్స్ విభాగంలో మేడం అభిలాష్‌రెడ్డి ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా మంగళవారం కౌశల్ పోటీలకు విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయుడు ఎస్.హరిప్రసాద్‌తోపాటు విద్యార్థులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల నిరీక్షణ

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులు సొసైటీలు వద్ద పడిగాపులు కాసిన సంఘటన మంగళవారం బుచ్చిరెడ్డిపాళెం లోని వవ్వేరు కోఆపరేటివ్ సొసైటీ, బుచ్చి కోఆపరేటివ్ సొసైటీకి సంబంధించి రేబాల గోడౌన్ల వద్ద నెలకొంది. ఓ వైపు సర్వర్ల సమస్య, మరోవైపు సిబ్బంది కొరతతో రైతులు గంటల తరబడి నిరీక్షించక తప్పలేదు. ప్రభుత్వం సబ్సిడీపై ఇచ్చే యూరియా పక్కదోవ పట్టకుండా రైతులకు కార్డులు పంపిణీ చేసి ఆ మేరకు సొసైటీలు, రైతు సేవా కేంద్రాలలో యూరియా పంపిణీకి శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలో వవ్వేరు, బుచ్చి కోఆపరేటివ్ సొసైటీలలో రైతులకు యూరియా పంపిణీకి ఒక్కొక్క వీఏఏ(గ్రామ వ్యవసాయ సహాయకులు)ని ఏర్పాటు చేశారు. ఆ వ్యక్తి ఒక్కో రైతుకు సంబంధించిన కార్డు పరిశీలించి వివరాలు నమోదు చేసుకుని యూరియా అందించేందుకు సుమారు 40 నిమిషాలు పడుతుంది. ఈ వివరాలన్నీ ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు సమయం పడుతుండడంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. కాగా మండలంలో రబీ సీజనుకు 1600 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు అవసరం కాగా ఇప్పటి వరకు 500 మెట్రిక్ టన్నులు పంపిణీ చేసినట్టు మండల వ్యవసాయాధికారి శ్రీహరి తెలిపారు. దామరమడుగు సొసైటీ నుంచి 800 బస్తాలు యూరియా పూర్తిగా పంపిణీ చేయగా, బుచ్చి సొసైటీలో 300 బస్తాలు, వవ్వేరు సొసైటీలో 200 బస్తాలు ఉందని తెలిపారు. వవ్వేరు 12వందల బస్తాలు, ఇస్కపాళెం 400బస్తాలు, కాగులపాడు 300, పంచేడు ఆర్ఎస్‌కేలో 100 బస్తాలు యూరియా పంపిణీ చేసినట్టు తెలిపారు.

కామాక్షితాయి అన్నదానానికి విరాళం

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన పథకానికి తిరుపతి జిల్లా శ్రీకాళహస్తికి చెందిన ఆర్ వర్షిణి పేరుతో రూ.10,116, కే.పద్మిని పేరుతో రూ.10వేలు విరాళాలను మంగళవారం రాంబాబు దంపతులు అందజేశారు. స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.

బంగారు కుటుంబాలకు నిత్యావసరాలు, నగదు పంపిణీ




నిత్యావసరాలు అందచేస్తున్న ఆర్డీవో సన్నీ వంశీక్రిష్ణ

కావలి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ-4 కార్యక్రమంలో భాగంగా ఎంపిక చేసిన బంగారు కుటుంబాలలో సంయుక్త సేవా సంస్థ దత్తత తీసుకున్న వారికి నిత్యావసరాలు, నగదు పంపిణీ చేశారు. కావలి ఆర్డీవో కార్యాలయ సమావేశం మందిరంలో ఆర్డీవో ఎం.సన్నీ వంశీ క్రిష్ణ అధ్యక్షతన మంగళవారం జరిగిన కార్యక్రమంలో సంయుక్త సేవా సంస్థకు సహకరించిన దాతల సమక్షంలో 24 బంగారు కుటుంబాలకు నిత్యావసరాలు, బియ్యం, కూరగాయలు అందజేశారు. డాక్టర్ బెజవాడ రవికుమార్ వారి కుటుంబ సభ్యుల సహకారంతో 14 మంది విద్యార్థులకు ఉన్నత విద్యకోసం ఒక్కక్కరికి రూ.10 వేలు రూ.1,40,000 అందచేశారు. పీ-4 విజయవంతం కావడంలో తన వంతు పాత్ర పోషిస్తున్న సంయుక్త సేవా సంస్థ సభ్యులను ఆర్డీవో ప్రశంసించారు. పీ-4 కార్యక్రమానికి మరింత తోడ్పాటు అందిస్తున్న డాక్టర్లు పామూరు శ్రీధర్, పామూరు శివప్రసాద్, సీహెచ్ విజయభాస్కరరావు, ఎం.అజిత్‌బాబు, పామూరు రాజా, పచ్చిపులుసు వెంకన్న, పీఐ జాఫర్‌ఖాన్, ఎం. చంద్రశేఖర్, వీవీ సాయితేజతో పాటు సంయుక్త సేవాసంస్థ వ్యవస్థాక అధ్యక్షుడు జీ సురేంద్రలను ఆర్డీవోతోపాటు ఎమ్పీడీవో సీహెచ్ శ్రీదేవిలు అభినందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో పీ-4 కోఆర్డినేటర్ గుండెమడుగుల సత్యానందం తదితరులు పాల్గొన్నారు.

నేటి నిరసన ర్యాలీని విజయవంతం చేయండి

● మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి



మాట్లాడుతున్న ప్రతాప్‌కుమార్ రెడ్డి

కావలి(టౌన్), నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను నిరసిస్తూ బుధవారం పట్టణంలో చేపట్టనున్న నిరసన ర్యాలీని జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ముసునూరులోని ఆయన క్యాంప్ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇండస్ట్రియల్ జోన్ కొరకు భూములిచ్చిన మత్స్యకారులకు తాను రూ.35 లక్షలు పరిహారం ఇప్పిస్తానని చెబితే ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కృష్ణారెడ్డి భూములు కోల్పోయిన తీరప్రాంత మత్స్యకారు లు రూ.5 లక్షల కమీషన్ ఇస్తే రూ.50లక్షలు పరిహారం, ఇంటికో ఉద్యోగం ఇప్పిస్తానని, ఆమేరకు కలెక్టర్ దగ్గర సంతకం చేయించి పత్రాలు కూడా ఇప్పిస్తానని హామీ ఇచ్చారని ఆరోపించారు. తీరా మత్స్యకారులు ఎమ్మెల్యేను రూ.50 లక్షల పరిహారం, ఉద్యోగాలు అడిగితే మీ భూమికి రూ.12 లక్షల మాత్రమే వస్తుంద ని, దయతలచి మరో రూ.6లక్షలతో కలిపి రూ.18 లక్షల ఇస్తారని, ఉద్యోగాలిప్పి స్తానని నేనేమీ చెప్పలేదని మత్స్యకారులను తిట్టి పంపించారని ఆరోపించారు. ఈ సమావేశంలో నేతలు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కనమర్లపూడి నారాయణ, గంధం ప్రసన్నాంజనేయులు, వేమిరెడ్డి విజయకుమార్‌రెడ్డి, గయాజ్, ఎం.రఘు, నాగాచారి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ అంకమ్మ

ఉలవపాడు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా ఆటోలు నడిపి ప్రమాదాలకు కారణమైన డ్రైవర్లపై చట్టపరంగా కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని ఎస్ఐ అంకమ్మ హెచ్చరించారు. మంగళవారం ఉలవపాడులోని ఆటో డ్రైవర్లకు ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా అవగాహన కల్పించారు. మద్యం తాగి ఆటోలు నడపడం, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించడం, సౌండ్ బాక్స్‌లు అమర్చి హైవేపై అతివేగంగా వెళ్లడం, రైతు కూలీలను పరిమితికి మించి ఎక్కించుకోవడం, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా ఆటోలను నడపడంతోపాటు సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించారు. నిబంధనలకు లోబడి నడుచుకోవాలని, లేని పక్షంలో కేసులు బనాయించాల్సి వస్తుందని హెచ్చరించారు.

పామాయిల్ సాగుకు ప్రభుత్వం రాయితీ



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యాన అధికారి జ్యోతి

కందుకూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): జామాయిల్, సరుగుడు తోటలకు బదులుగా పామాయిల్ తోటలను పెంచాలని మండల ఉద్యాన అధికారి బీ జ్యోతి రైతులకు సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలుకూరు, మహదేవపురం గ్రామాల్లో రైతులకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పంటకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకాలు, రాయితీలు అందిస్తారని, ఆసక్తి కలిగిన రైతులు పామాయిల్ సాగుపై దృష్టి సారించాలన్నారు. అదేవిధంగా శనగ పంట పండించే రైతులకు రాయితీపై విత్తనాలు ప్రభుత్వం అందిస్తుందని, అవసరమైన రైతులు ఆయా రైతుసేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి అబ్దుల్ రహీం రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై విద్యార్థులకు శిక్షణ



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా రెడ్‌క్రాస్ ఫీల్డ్ ఆఫీసర్ సుందరరాజు

కావలి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కార్డియోపల్మోనరీ రిసస్టేషన్ (సీపీఆర్) అనేది చాతి కుదింపులు, రెస్క్యూ శ్వాసలతో కూడిన అత్యవసర ప్రక్రియ అని, ఇది కార్డియాక్ అరెస్ట్‌కు ప్రాణాలు కాపాడే చర్య అని జిల్లా రెడ్‌క్రాస్ ఫీల్డ్ ఆఫీసర్ సుందరరాజు పేర్కొన్నారు. మండలంలోని సర్వాయపాలెం జడ్పీ హైస్కూల్‌లో మంగళవారం ప్రధానోపాధ్యాయుడు తోట వెంకటేశ్వర్లు అధ్యక్షతన సీపీఆర్‌పై శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జూనియర్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులతో పాటు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బందికి ఏ పరిస్థితులలో సీపీఆర్ ఎలా చేయాలో సుందరరాజు వివరించి వారికి శిక్షణ ఇచ్చారు. హార్ట్‌ఎటాక్, కార్డియాక్ అరెస్ట్ మధ్య బేధాలను వివరించి నివారణ చర్యలను తెలిపారు. ఈ కార్యక్రమంలో జూనియర్ రెడ్‌క్రాస్ బాధ్యులు బెజవాడ ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిస్వార్థ సేవకుడు తాళ్లూరు రమణయ్యనాయుడు



రోగులను పరీక్షిస్తున్న నెల్లూరు కిమ్స్ వైద్యులు

దగదర్తి(బిట్రగుంట), నవంబరు 11(ఆంధ్రజ్యోతి): నిస్వార్థ సేవకుడు తాళ్లూరు రమణయ్య నాయుడు అని నెల్లూరు కిమ్స్ వైద్యశాల డాక్టర్ రామానాయుడు అన్నారు. తాళ్లూరు రమణయ్య నాయుడు ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు కిమ్స్ హాస్పిటల్ వారిచే మంగళవారం మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వైద్యులు నాగరాజు, ఉదయ్‌కిరణ్, మొరాజ్, సన్నీషరెడ్డి, శ్రీనివాసులు, భగీరథ, మెడికల్ కోఆర్డినేటర్ శ్రీధర్‌రెడ్డి పాల్గొన్ని రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందచేశారు. దగదర్తి మండ లంలోని వివిధ పంచాయతీలకు చెందిన వందలమంది హాజర య్యారు. పలువురు నేతలు తాళ్లూరు రమణయ్య నాయుడు చిత్రపటానికి పుష్పాలతో నివాళులర్పించారు. పేద ప్రజలకు వైద్యసేవలందించిన తాళ్లూరు కుటుంబ సభ్యులను అభినందించారు.

జక్కేపల్లిగూడూరులో 'పొలం పిలుస్తోంది'



రైతులతో మాట్లాడుతున్న ఎంఏవో శైలజ

బిట్రగుంట, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం జక్కేపల్లిగూడూరులో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం మండల వ్యవసాయ అధికారి బీశైలజ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో ఆమె మాట్లాడుతూ నాట్లు వేసేముందు నారు కొసలు తుంచినట్లైతే కాండం తొలిచే పురుగు గుడ్లను నాశనం చేయవచ్చన్నారు. యూరియా విషయమై రైతులు ఆందోళన పడాల్సిన పనిలేదని, రైతుసేవా కేంద్రాల్లో అందుబాటులో ఉందన్నారు. అనంతరం ఎస్వీపీఎం ఎండీ-1 అధ్యక్షుడు యర్రం వెంకటేశ్వర్లురెడ్డి చేతుల మీదుగా రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈవో పొలు, వీఏఏ శ్రీవాణి, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణపై సర్వే

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగమాం బాపురం గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 106లో కొంత ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందని ఇటీవల కలెక్టర్ గ్రీవెన్స్‌లో కొందరు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం తహసీల్దారు అంబటి వెంకటేశ్వర్లు, వీఆర్వో అక్రమ్, సర్వేయర్‌లు సర్వే చేపట్టి 78 సెంట్లు ప్రభుత్వ శివాయి భూమి ఆక్రమించినట్లు నిర్ధారించారు.

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.
తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట : 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు : 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు : 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్ళపల్లి : 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు : 99890 59755

పారిశ్రామిక జోష్

సీఎం చంద్రబాబుచే వర్చువల్‌గా శంకుస్థాపనలు.. ప్రారంభోత్సవాలు

రెండు ఎంఎస్ఎంఈ పార్కుల అభివృద్ధికి.. ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ నిర్మాణానికి.. దమ్ము బయో ఫ్యూయెల్స్ ప్లాంట్.. ఈ మూడింటికి మంగళవారం సీఎం చంద్రబాబు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. తిరుచానూరు వద్ద ఫైవ్ స్టార్ హోటల్‌ను, పాలచ్చూరులో ఫార్మా కంపెనీకి ప్రారంభోత్సవం చేశారు. ఇలా గూడూరు, పెళ్లకూరు, వరదయ్యపాళెం, తిరుపతి రూరల్ మండలాల్లో శంకుస్థాపనలు, ప్రాంభోత్సవాలతో పారిశ్రామిక జోష్ కనిపించింది. ప్రత్యక్షంగా పెళ్లకూరులో మంత్రి నిమ్మల రామానాయుడు, మిగతా చోట్ల స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని శిలాఫలకాలను ఆవిష్కరించారు. కూటమి ప్రభుత్వంతో పెట్టుబడులు రావడంతో వేలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.



◆ శంకుస్థాపనలు

● కొమ్మనేటూరు ఎంఎస్ఎంఈ పార్కు



ఎంఎస్ఎంఈ పార్కుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, ఆర్డీవో భానుప్రకాశ్‌రెడ్డి

ఎక్కడ: గూడూరు మండలం కొమ్మనేటూరు సమీపం
విస్తీర్ణం: 43.10 ఎకరాలు, **ప్లాట్లు:** 129
మొదటి దశ: 20 ఎకరాలు.. రూ.9.65 కోట్లతో పనులు
శంకుస్థాపన చేసింది: వర్చువల్ విధానంలో సీఎం చంద్రబాబు
ప్రత్యక్షంగా పాల్గొంది: ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్, ఆర్డీవో భానుప్రకాశ్‌రెడ్డి, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు రాజు, మట్టం శ్రావణి, అల్లూరు కరుణాకర్‌రెడ్డి, ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్ రహీమ్, పెంచలయ్య, సురేంద్ర, బత్తిన ప్రణీత్, తహసీల్దారు ప్రసాద్ తదితరులు
ఏం చెప్పారు: సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ) రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలాంటివి. నిరుద్యోగులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడం, స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పించే లక్ష్యంతో ఏపీఐఐసీ ఆధ్వర్యంలో ఎంఎస్ఎంఈ పార్కులను అభివృద్ధి పరుస్తున్నార్న ఎమ్మెల్యే, ఆర్డీవో.

- గూడూరు, ఆంధ్రజ్యోతి

● ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ (ఎఫ్ఎఫ్‌సీ)



శిలాఫలకం ఆవిష్కరణ

ఎక్కడ: వరదయ్యపాళెం మండలం చిన్నపాండూరు
అంచనా వ్యయం: రూ.16.78 కోట్లు
ప్రత్యక్షంగా పాల్గొంది: భూమిపూజలో ఎమ్మెల్యే ఆదిమూలం, సర్పంచి శ్యామల, ఎంపీటీసీ సభ్యురాలు భువనేశ్వరి, పరిశ్రమల జెడ్ఎం చంద్రశేఖర్, తహసీల్దారు సుధీర్, ఎంపీడీవో విజయలక్ష్మి, శ్రీసిటీ డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ అరుణ్‌కుమార్‌రెడ్డి, టీడీపీ నేతలు బండారి, జయశంకర్‌రెడ్డి, భవన నిర్మాణ కార్మిక నేత కోటేశ్వరరావు, అపోలో పరిశ్రమ ప్లాంట్ ఎస్‌వో సాయిబాబు.
ఏం చెప్పారు: చంద్రబాబు సీఎం అయ్యాక పెట్టుబడులు ఊపందుకున్నాయి. దీంతో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా రాష్ట్రంలో శాశ్వత అభివృద్ధికి కృషి జరుగుతోందన్నారు ఎమ్మెల్యే.

- వరదయ్యపాళెం, ఆంధ్రజ్యోతి

● శిరసనంబేడు ఎంఎస్ఎంఈ

ఎక్కడ: పెళ్లకూరు మండలం శిరసనంబేడు గ్రామం
విస్తీర్ణం: 58.33 ఎకరాల సేకరణ. మొదటి విడతలో 22.42 ఎకరాల్లో అభివృద్ధి.
పెట్టుబడి: రూ.5.5 కోట్లు.
ఉపాధి: ప్రత్యక్షంగా, పరోక్షంగా 5 వేల మందికి.
లక్ష్యం: ఎంఎస్ఎంఈ పార్కు అభివృద్ధితో సూక్ష్మ, చిన్న పరిశ్రమల ఏర్పాటుకు అవకాశం కల్పించడం.

● దమ్ము బయో ఫ్యూయెల్స్ ప్లాంట్

ఎక్కడ: పెళ్లకూరు మండలం పాలచ్చూరు-శిరసనంబేడు పారిశ్రామికవాడ
పెట్టుబడి: రూ.300 కోట్లతో శంకుస్థాపన
ఉత్పత్తి: ఇథనాల్ తయారీ
ఉపాధి: 500 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా
ప్రయోజనం: గ్రామీణాభివృద్ధి, పరిశుభ్రమైన శక్తి ఉత్పత్తి దిశగా ఇది ఒక మైలురాయిగా నిలుస్తుంది, భారతదేశ జీవ ఇంధన మిషన్‌కు ఇది కీలకం కానుంది. పర్యావరణ పరిరక్షణ, ఇంధన స్వావలంబన దిశగా ముందడుగు.

- పెళ్లకూరు, ఆంధ్రజ్యోతి

◆ ప్రారంభోత్సవాలు

● కోర్ట్‌యార్డ్ బైమారియట్ హోటల్

ఎక్కడ: తిరుపతి రూరల్ మండలం తిరుచానూరు వద్ద, **పెట్టుబడి:** రూ.220 కోట్లు
సామర్థ్యం: 130 గదులతో 5 స్టార్ హోటల్, **ఉపాధి:** ప్రత్యక్షంగా, పరోక్షంగా 300మందికి
ఉద్దేశ్యం: తిరుపతికి వచ్చే యాత్రికులకు ప్రపంచస్థాయి ఆతిథ్య సేవలు అందించనున్న ఈ ప్రాజెక్ట్ పర్యాటకాభివృద్ధికి కృషి, **వర్చువల్ ప్రారంభం:** సీఎం చంద్రబాబుచే



ప్రత్యక్షంగా పాల్గొంది: కమిషనర్ ఎస్.మౌర్య, ఏపీ జీబీసీ ఛైర్‌పర్సన్ ఎం.సుగుణమ్మ, ఏపీ హ్యాండిక్రాఫ్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, తుడా ఛైర్మన్ సి.దివాకర్‌రెడ్డి, ఏపీటీఏ ప్రాంతీయ సంచాలకుడు ఆర్.రమణప్రసాద్, ఏపీటీడీసీ ఈడీ ఎం.జనార్దన్‌రెడ్డి, ఆర్డీవో రామ్మోహన్, టీడీపీనాయకులు ఈశ్వర్ రెడ్డి, అమిలినేని మధుసూదన్‌నాయుడు, దొండపాటి మునిశంకర్‌నాయుడు, ఆర్‌సీ మునికృష్ణ, చెరుకూరి మధుశేఖర్, కత్తి సుధాకర్, సాయిరాయల్, హరిరామరెడ్డి, ఖలీమ్

- తిరుపతిరూరల్, ఆంధ్రజ్యోతి

● 3ఎక్స్‌పర్ ఇన్నోవెంచర్ ఫార్మా లిమిటెడ్

ఎక్కడ: పెళ్లకూరు మండలం పాలచ్చూరు, **పెట్టుబడి:** రూ.137 కోట్లు, **ఉపాధి:** 250 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా
ప్రారంభం: సీఎం చంద్రబాబుచే వర్చువల్‌గా, **ప్రత్యక్షంగా పాల్గొంది:** మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, కలెక్టర్ వెంకటేశ్వర్, సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి, నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు కృష్ణయ్య, నాయకులు,
ప్రయోజనం: నాణ్యమైన ఔషధ ఆవిష్కరణ, తయారీ, ఉత్పత్తి అభివృద్ధి సేవలు అందిస్తుంది. రవాణా, హోటళ్లు, లాజిస్టిక్స్ వంటి రంగాలలో పరోక్షంగా మరెందరికో ఉపాధి అవకాశాలు కలుగుతాయి. ప్రాంతీయ పారిశ్రామిక వృద్ధికి, ఆర్థికాభివృద్ధికి దోహదం చేయనుంది.

- పెళ్లకూరు, ఆంధ్రజ్యోతి



3ఎక్స్‌పెర్ ఇన్నోవెంచర్ పరిశ్రమను ప్రారంభిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు



ఇంటికో పారిశ్రామికవేత్త

● ఇదీ సీఎం చంద్రబాబు లక్ష్యం ● మంత్రి నిమ్మల రామానాయుడు



పారిశ్రామిక వేత్తలతో మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రతి ఇంట ఒక ఐటీ నిపుణుడు.
- ఇదీ గతంలో సీఎంగా ఉన్నప్పుడు చంద్రబాబు ఆలోచనా విధానం. ఈ కార్యక్రమం ఎంత సత్ఫలితాన్నిచ్చిందో చూశాం.
మరిప్పుడు..
ప్రతి ఇంటిలో పారిశ్రామిక వేత్త ఉండాలి.
ప్రస్తుతం చంద్రబాబు పెట్టుకున్న లక్ష్యం ఇది. దీని కార్యరూపం దాల్చేలా సీఎం, మంత్రి నారా లోకేశ్ పనిచేస్తున్నారన్నారు మంత్రి నిమ్మల రామానాయుడు. పెళ్లకూరు మండలం పాలచ్చూరులో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. దీనివల్ల రాబోయే కాలంలో పేదరికమనేది కనిపించకుండా పోతుందన్నారు. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించేలా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. తిరుపతిని మెగా సిటీతో పాటు ఆటోమొబైల్ కారిడార్లు, ఆగ్రో ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. వైసీపీ పాలనలో యువత గంజాయి, డ్రగ్స్ బాట పడితే నేడు ఉద్యోగ, ఉపాధి కల్పించేలా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పారిశ్రామిక వేత్తల కూడా సీబీఎన్ అంటే ఒక బ్రాండ్‌లా భావించి సీఎం మీద ఉన్న అపారమైన నమ్మకంతో రాష్ట్రానికి పరిశ్రమలు తరలివస్తున్నాయన్నారు. దొరవారి సత్రం మండలంలోని తీర ప్రాంతాలలో చెక్‌డ్యాం, తడ మండలంలో గ్రాయిన్, పెళ్లకూరు మండలంలో చెంబేడు చెరువును మినీ రిజర్వాయర్‌గా మార్చేందుకు నిధులు మంజూరు చేయాలని మంత్రి నిమ్మల రామానాయుడును ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ కోరారు. ఈ సందర్భంగా కొందరు పారిశ్రామిక వేత్తలు మంత్రిని కలిశారు.

- పెళ్లకూరు, ఆంధ్రజ్యోతి

పోక్సో కేసులో టీచరు అరెస్టు



పోలీసుల అదుపులో ఉపాధ్యాయుడు

తిరుపతి (నేరవిభాగం), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయుడు వక్రబుద్ధితో బాలికను వంచించాడు. మూడేళ్లుగా మాయ మాటలు చెప్పి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఈ అమానవీయ ఘటన తిరుపతిలో వెలుగులోకి వచ్చింది. ఈస్ట్ సీఐ శ్రీనివాసులు తెలిపిన ప్రకారం.. తిరుపతి వైకుంఠపురానికి చెందిన చెన్నంపల్లి జలపతిరెడ్డి (వీవీ) నగరంలోని ఓ ప్రైవేటు స్కూల్లో సామాజిక శాస్త్ర ఉపాధ్యాయుడు. ఓ బాలికను వంచించాడు. బాలిక ఇంట్లో ఎవరూ లేనప్పుడు ఆ ఉపాధ్యాయుడు తరచూ అఘాయిత్యానికి పాల్పడేవాడు. ప్రస్తుతం ఆ బాలిక ఇంటర్ చదువుతోంది. ఆ బాలికలో మార్పును గమనించిన తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. నిందితుడు జలపతి రెడ్డిపై పోలీసులు పోక్సో, అత్యాచారం కింద కేసు నమోదు చేశారు. మంగళవారం సాయంత్రం అరెస్టు చేసి నగరంలోని రోడ్లపై నడిపించుకుంటూ కోర్టుకు తీసుకెళ్లారు. ఈ కేసును డీఎస్పీ భక్తవత్సలం దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పసికందు ఏం చేసింది పాపం

● బిడ్డ చేతిలో ఉండగా తల్లిపై దాడి
● తీవ్రంగా గాయపడి ప్రాణం విడిచిన చిన్నారి



మృతి చెందిన దీక్షితాప్రియ

చంద్రగిరి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మహిళల మధ్య వివాదంలో ఓ పసికందు ప్రాణాలు కోల్పోయింది. పోలీసుల కథనం మేరకు మదనపల్లె సమీపంలో బికొత్తకోటకు చెందిన క్రిష్ణానాయక్, ప్రసన్నలకు 8ఏళ్ల క్రితం పెళ్లయింది. వీరు చంద్రగిరిలో మూలస్థాన ఎల్లమ్మ ఆలయం సమీపంలో ఉంటున్నారు. గత ఏడాది జూలై 31న క్రిష్ణానాయక్ మృతి చెందాడు. అప్పటికే ప్రసన్న గర్భవతి. పాప దీక్షితాప్రియకు జన్మనిచ్చింది. ఇటీవల తిరుపతి కొర్లగుంటలో ఉంటున్న మిట్టపాలెంకు చెందిన సుబ్రమణ్యం, ప్రసన్నల మధ్య వివాహేతర బంధం ఏర్పడింది. ఈ విషయం తెలుసుకున్న సుబ్రమణ్యం భార్య ఉమ, మరో మహిళ దుర్గ మంగళవారం ప్రసన్న ఇంటికి వచ్చారు. గట్టిగా ఆమెతో గొడవ పడ్డారు. ఈక్రమంలో ప్రసన్నపై ఉమ దాడి చేసింది. అదే సమయంలో ఆమె చేతిలో ఉన్న ఏడాది బిడ్డ దీక్షితాప్రియకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చంద్రగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. వైద్యులు పరీక్షించి చిన్నారి మృతి చెందినట్లు నిర్ధారించారు. పోలీసులు ఆసుపత్రికి చేరుకుని దీక్షితాప్రియ మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారును ఢీకొన్న లారీ

● తల్లీ కొడుకుల దుర్మరణం ● మరొకరికి తీవ్రగాయాలు
● స్వల్పగాయాలతో బయటపడిన చిన్నారి ● మృతులది కర్నూలు



మృతి చెందిన చంద్రభానుసింగ్



తీవ్ర గాయాలతో మృతిచెందిన సరస్వతి బాయి .. గాయపడిన దివ్య



స్వల్ప గాయాలతో బయటపడిన త్రిషిక

రేణిగుంట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మలుపు వద్ద అదుపు తప్పిన లారీ.. కారును ఢీకొనడంతో తల్లీ కొడుకులు దుర్మరణం చెందారు. కోడలికి తీవ్రగాయాలు కాగా, మనవరాలు స్వల్పగాయాలతో బయటపడ్డారు. మృతులది కర్నూలు. చెన్నై వెళ్తుండగా మంగళవారం తెల్లవారుజామున రేణిగుంట- కడప మార్గంలోని చైతన్యపురం క్రాస్ వద్ద ఈ ప్రమాదం జరిగింది. రేణిగుంట సీఐ జయచంద్ర తెలిపిన ప్రకారం.. కర్నూలు నగరానికి చెందిన చంద్రభానుసింగ్ చెన్నైలోని మెడికల్ ఏజెన్సీలో బిజినెస్ మేనేజర్. ఆయన భార్య దివ్య చెన్నైలోనే బరోడా బ్యాంక్ రీజినల్ ఆఫీసర్. వారాంతపు సెలవులు కర్నూలులో గడిపారు. సోమవారం సాయంత్రం కర్నూలు నుంచి కారులో తన తల్లి సరస్వతిబాయి, భార్య దివ్య, కుమార్తె త్రిషికతో కలిసి చంద్రభాను సింగ్ చెన్నై బయలుదేరారు. మంగళవారం తెల్లవారుజామున రేణిగుంట మండలం చైతన్యపురం క్రాస్ వద్దకు కారు చేరుకుంది. అదే సమయంలో రేణిగుంట నుంచి కడప వెళ్తున్న లారీ మలుపు వద్ద అదుపుతప్పి కారుని ఢీకొంది. కారు నడుపుతున్న చంద్రభాను సింగ్ (37) తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. పక్కన కూర్చున్న దివ్యకు రెండు కాళ్లు విరగడంతో పాటు తలకు ఓవైపు తీవ్రగాయాలయ్యాయి. వెనక సీటులోని సరస్వతి బాయి తలకు తీవ్రగాయాలయ్యాయి. డ్రైవింగ్ సీటుకు వెనుక కూర్చున్న త్రిషిక స్వల్పగాయాలతో బయటపడింది. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని 108 అంబులెన్స్‌కు సమాచారమిచ్చారు. అనంతరం వాహనంలో క్షతగాత్రులను తరలిస్తుండగా మార్గమధ్యంలో సరస్వతిబాయి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దివ్య పరిస్థితి విషమంగా ఉంది. ఎస్ఐ నాగరాజు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఒక క్లిక్‌తో ఫోను హ్యాక్

● రూ.7.5 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

తిరుపతి (నేరవిభాగం), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆ రైతు సెల్‌ఫోనుకు ఒక లింకు వచ్చింది. దానిపై ఆయన క్లిక్ చేశారు. అంతే ఫోను హ్యాక్ అయింది. బ్యాంకు ఖాతాలోని రూ.7.5 లక్షలు సైబర్ నేరగాళ్ల ఖాతాల్లోకి పోయాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు తిరుపతి రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. రూరల్ సీఐ చిన్నగోవిందు మంగళవారం తెలిపిన ప్రకారం... అన్నమయ్య జిల్లా పుల్లంపేట మండలం ఎగువరెడ్డిపల్లెకు చెందిన రైతు, తన ఇద్దరు పిల్లల చదువు నిమిత్తం తిరుపతి రూరల్ మండలం ఓటేరు పంచాయతీలో పదేళ్లుగా నివసిస్తున్నారు. వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. కెనరా బ్యాంకులో ఆయనకు సేవింగ్స్ అకౌంట్ ఉంది. జూలై నెలలో ఆయన ఫోనుకు వాట్సాప్ ద్వారా పీఎంజేవై కిసాన్ యోజన పేరుతో వచ్చిన ఓ లింకును ఆయన క్లిక్ చేశారు. 'మీ వివరాలు నమోదు చేయండి' అంటూ మరో లింకు వచ్చింది. ఏ మాత్రం అనుమానించకుండా దానిని క్లిక్ చేసి తన వ్యక్తిగత వివరాలు, బ్యాంక్ సమాచారం అందించారు. అంతే, ఆయన ఫోను హ్యాక్ అయింది. ఇటీవల గుండె సంబంధిత చికిత్స కోసం ఇంట్లోని బంగారాన్ని తాకట్టు పెట్టి రూ.10.81 లక్షల రుణం తీసుకున్నారాయన. ఆ మొత్తాన్ని తన బ్యాంక్ అకౌంట్‌లో జమ చేశారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం రూ.7.50 లక్షలు ట్రాన్స్‌ఫర్ అయినట్లు ఆయన సెల్‌ఫోనుకు మెసేజీ వచ్చింది. వెంటనే ఆ రైతు బ్యాంను సంప్రదించారు. సైబర్ హెల్ప్‌లైన్ 1930 నెంబరుకు కాల్ చేశారు. దీంతో రూ.3.09 లక్షలు హోల్డ్ చేయగలిగారు. ఈ ఘటనపై రూరల్ సీఐ టి.చిన్నగోవిందు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గుర్తు తెలియని వ్యక్తులు పంపించే వాట్సాప్, ఎస్ఎంఎస్, లేదా సోషల్ మీడియా లింకులను ఎట్టి పరిస్థితుల్లోనూ క్లిక్ చేయొద్దని, వ్యక్తిగత, బ్యాంక్ వివరాలు ఎవరికీ చెప్పొద్దని సూచించారు.



ధ్వజస్తంభాన్ని శుద్ధి చేస్తున్న జేఈవో వీరబ్రహ్మం తదితరులు

అమ్మవారి ఆలయ శుద్ధి


తిరుచానూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులో ఈనెల 17న ప్రారంభం కానున్న పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం (ఆలయ శుద్ధి) నిర్వహించారు. ఉదయం 6 నుంచి 9గంటల వరకు అధికారులు, అర్చకులు, సిబ్బంది ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర వస్తువులను నీటితో శుద్ధి చేశారు. జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో మురళీకృష్ణ, ఎస్వీ సుబ్బరాయుడు, డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్, ఏఈవో దేవరాజులు, ఏవీఎస్వో రాధాకృష్ణమూర్తి, సూపరింటెండెంట్ రమేష్, ఆలయ ఇన్‌స్పెక్టర్లు ప్రసాద్, చలపతి, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు. కాగా, ఈనెల 17న ఉదయం ధ్వజారోహణంతో మొదలయ్యే బ్రహ్మోత్సవాలు.. 25న పంచమీ తీర్థం, ధ్వజావరోహణంతో ముగియనున్నాయి. ప్రతిరోజూ ఉదయం 8 నుంచి 10గంటల వరకు, రాత్రి 7 నుంచి 9గంటల వరకు వాహనసేవలు ఉంటాయి. బ్రహ్మోత్సవాల్లో అన్ని రకాల ఆర్జిత సేవలను టీటీడీ రద్దు చేసింది.



10 పరదాలు
బహూకరణ : హైదరాబాద్‌కు చెందిన స్వర్ణకుమార్‌రెడ్డి తన ప్రతినిధుల ద్వారా అమ్మవారి ఆలయానికి మంగళవారం 7 పరదాలు, అదే విధంగా తిరుపతికి చెందిన మణి 3 పరదాలను అందించారు. వీటిని ఆలయ అధికారులకు అందజేశారు.

ANDHRA PRADESH STATE CIVIL SUPPLIES CORPORATION LIMITED
DISTRICT OFFICE : TIRUPATI DISTRICT
స్వల్ప కాల టెండరు ప్రకటన
Lr. No.Paddy/Tarpaulins/2025-26 Dt. : 10-11-2025
ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి జిల్లాలో గల రైతు సేవ కేంద్రముల ద్వారా రైతులకు పంపిణీ చేయుట కొరకు 700 టార్పలిన్‌లు కొనుగోలుకై www.neml.in website ద్వారా టెండర్లు కోరడమైనది. కొనుగోలు చేయబడిన టార్పలిన్‌లు తిరుపతి జిల్లాలో గల నిర్ణయించబడిన అగ్రికల్చర్ మార్కెట్ యార్డ్‌లకు సరఫరా చేయవలెను. ఆసక్తి గల టెండరుదారులు www.neml.in వెబ్ సైట్ ను సందర్శించి టెండర్ పత్రాలను ఉచితంగా చూడవచ్చు మరియు డౌన్ లోడ్ చేసుకోవచ్చు.
టెండర్‌లో పాల్గొనడానికి ఆసక్తి వున్నవారు కస్టమరు సర్వీస్ గ్రూపు ఫోన్ నెం.లు (+91-22) - 48810500 / 9962059599 / 9032429420 లేదా ఇ-మెయిల్ : askus@neml.in ద్వారా సంప్రదించవచ్చు. ఆన్‌లైన్ టెండర్‌లను సమర్పించడానికి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ మరియు ఫార్మాలిటీలను పూర్తి చేయడానికి చివరి తేదీ 17-11-2025 సాయంత్రం 5.00 గంటలకు వరకు ఉంటుంది.
సం/- కలెక్టరు, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ

శ్రీవారి సేవలో ప్రముఖులు


కార్తీకేయ మిశ్రా - ఎంవీ నరసింహారావు - శోభా చంద్రశేఖర్

తిరుమల, నవంబరు11(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ఏపీ సీఎం అడిషనల్ సెక్రటరీ కార్తీకేయ మిశ్రా, ఇండియన్ మాజీ క్రికెటర్ ఎంవీ నరసింహారావు, తమిళహీరో విజయ్ తల్లి శోభా చంద్రశేఖర్ ఉన్నారు.



బంగారు పతకాలు, ప్రశంసాపత్రంతో వెంకటేష్

వృద్ధాప్యంలోనూ తగ్గేదేలే...

● ఈత పోటీల్లో తిరుపతివాసుల ప్రతిభ

తిరుపతి(క్రీడలు), నవంబరు 11(ఆంధ్రజ్యోతి): విజయవాడలో గత ఆదివారం జరిగిన 6వ మాస్టర్స్ ఇంటర్ డిస్ట్రిక్ట్ అక్వాటిక్ చాంపియన్‌షిప్ పోటీల్లో తిరుపతికి చెందిన ఎ.వెంకటేష్(67), సి.జయశంకర్(58) ప్రతిభ కనబరిచారు. వేర్వేరుగా బ్యాక్, బ్రెస్ట్ స్ట్రోక్, ఫ్రీస్టయిల్ విభాగాలలో వెంకటేష్‌కు నాలుగు బంగారు, జయశంకర్‌కు రెండు చొప్పున సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ కైవసం చేసుకున్నారు. దీంతో నిర్వాహకులు మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేశారు. వీరిరువురు స్థానిక శ్రీనివాస క్రీడా సముదాయంలో స్విమ్మింగ్ శిక్షణ తీసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్‌డీవో శశిధర్, కోచ్ చక్రవర్తి, పలువురు క్రీడాకారులు, ప్రముఖులు వారిని అభినందించారు.



సిల్వర్, బ్రాంజ్ పతకాలు, ప్రశంసాపత్రంతో జయశంకర్


సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 24 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం : రూ.4.01 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 76,096

తలనీలాలు సమర్పించినవారు: 26,289



ర్యాగింగ్‌కు పాల్పడితే జైలుకే..!

● ఎస్పీ సుబ్బరాయుడు



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ర్యాగింగ్ అనేది సరదా కాదనీ, అదొక అమానుషమైన విషయమని ఎస్పీ సుబ్బరాయుడు పేర్కొన్నారు. ఎవరైనా ఎక్కడైనా ర్యాగింగ్‌కు పాల్పడినట్టు తమ దృష్టికి వస్తే జైలుకు పంపి కఠిన శిక్ష అమలు చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఎస్వీయూనివర్సిటీ శ్రీనివాసా ఆడిటోరియంలో మంగళవారం స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ విభాగం ర్యాగింగ్ వ్యతిరేక అవగాహన సదస్సు నిర్వహించింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్పీ సుబ్బరాయుడు మాట్లాడుతూ కొత్తగా యూనివర్సిటీలో అడుగు పెట్టిన విద్యార్థులను భయపెట్టకుండా స్నేహపూర్వకంగా ప్రోత్సహించడం ప్రతి సీనియర్ బాధ్యత అని గుర్తు చేశారు. ర్యాగింగ్ ద్వారా ఎవరికీ ఆనందం రాదని, ఎదుటివారికి మానసిక క్షోభను కలిగిస్తుందన్నారు. అలాంటి ఘటనలు జరిగితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ర్యాగింగ్ ఘటనపై ఫిర్యాదు చేసిన వారికి పూర్తి రక్షణ, న్యాయం అందిస్తామని వివరించారు. ఎస్వీయూ వీసీ నరసింగరావు మాట్లాడుతూ.. ర్యాగింగ్ అనేది విద్యార్థి జీవితాన్ని దెబ్బతీసే దుర్మార్గమైన అలవాటన్నారు. మన యూనివర్సిటీలో ప్రతీ విద్యార్థి సురక్షిత వాతావరణంలో చదువుకునే హక్కు ఉందన్నారు. ఆ హక్కుకు ఎవరైనా భంగం కలిగిస్తే చర్యలు తప్పవన్నారు. రెక్టార్ అప్పారావు మాట్లాడుతూ.. చదువుతో పాటు మంచి ప్రవర్తనను విద్యార్థులు అలవరుచుకోవాలని సూచించారు. రిజిస్ట్రార్ భూపతి నాయుడు మాట్లాడుతూ.. ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకుని, ఇందుకోసం నిరంతరం సాధన చేయాలని కోరారు. అనంతరం ర్యాగింగ్‌కు పాల్పడమంటూ విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీఎస్పీ భక్తవత్సలం, సీడీసీ డీన్ చెండ్రాయుడు, కల్చరల్ కో-ఆర్డినేటర్ పత్తిపాటి వివేక్, అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విమానాశ్రయంలో హైఅలర్ట్



రేణిగుంట నవంబర్ 11 (ఆంధ్రజ్యోతి): తిరుపతి విమానాశ్రయానికి హైఅలర్ట్ ప్రకటించారు. ఢిల్లీలో బాంబు పేలుడు ఘటనతో దేశంలోని ముఖ్యమైన విమానాశ్రయాలకు కేంద్ర ఇంటెలిజెన్స్ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో విమానాశ్రయ సీఐఎస్ఎఫ్ సిబ్బందితో కలిసి గాజులమండ్యం పోలీసులు ప్రత్యేక మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విమానాశ్రయ భద్రతా సిబ్బంది, సీఐ మంజునాథ్ రెడ్డి, ఎయిర్‌పోర్ట్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీసిటీని సందర్శించిన జర్మనీ వాణిజ్య ప్రతినిధుల బృందం



పాంటర్‌కు స్వాతం పలుకుతున్న శ్రీనిరాజు, సన్నారెడ్డి

సత్యవేడు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జర్మనీలోని సాక్సోని రాష్ట్రానికి చెందిన 18 మంది వాణిజ్య ప్రతినిధుల బృందం శ్రీసిటీని సందర్శించింది. ఆ రాష్ట్ర వాణిజ్య, కార్మిక, ఇంధన, వాతావరణ శాఖ మంత్రి డిర్క్ పాంటర్ నేతృత్వంలో పర్యటనకు విచ్చేసిన ప్రతినిధులకు శ్రీసిటీ చైర్మన్ శ్రీనిరాజు, ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రీసిటీ ప్రపంచ స్థాయి పారిశ్రామిక మౌలిక వసతులు, విభిన్న రంగాల పరిశ్రమల ఎకో సిస్టం, అంతర్జాతీయ పెట్టుబడి దారులకు ఒనగూరే వ్యూహాత్మక వ్యాపార ప్రయోజనాలను డాక్టర్ సన్నారెడ్డి వివరించారు. 31 దేశాలకు చెందిన 240కు పైగా ప్రముఖ కంపెనీలకు నిలయమైన శ్రీసిటీలో జర్మనీకి చెందిన బెల్ ఫ్లేవర్స్ అండ్ ఫ్రాగ్రెన్సెస్, క్నాఫ్, కాంక్యో బర్డ్ పరిశ్రమలు సైతం ఉన్నాయని వారి దృష్టికి తీసుకొచ్చారు. అలాగే బారత ప్రభుత్వం అందిస్తున్న పన్ను మినహాయింపులు, సబ్సిడీలు, ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం (పీఎల్ఐ), ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తున్న పెట్టుబడి దారుల అనుకూల విధానాలు, వేగవంతమైన అనుమతుల వ్యవస్థ (స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. శ్రీసిటీలో పెట్టుబడి అవకాశాలు, పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థ అనుకూలతలపై ప్రతినిధి బృందం చర్చలు జరిపింది. ఈ సందర్భంగా శ్రీసిటీ ప్రణాళిక, మౌలిక సదుపాయాలు, పెట్టుబడి అనుకూల విధానాలను ప్రశంసించిన పాంటర్ భవిష్యత్తులో మరిన్ని జర్మన్ సంస్థలు ఇక్కడ నెలకొల్పడానికి ఆసక్తి చూపుతాయన్న విశ్వాసం వ్యక్తం చేశారు. అనంతరం ప్రతినిధిబృందం స్థానిక బెల్ ఫ్లేవర్స్ అండ్ ఫ్రాగ్రెన్సెస్ పరిశ్రమను సందర్శించి, కార్యకలాపాలను పరిశీలించింది.

ట్రై మోటారు సైకిళ్లకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో విభిన్న ప్రతిభావంతులకు మూడుచక్రాల మోటారు వాహనాల మంజూరుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు విక్రమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈమేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. మూడుచక్రాల మోటారు వాహనాలను నియోజకవర్గానికి ఒకటి చొప్పున మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 25వ తేదీలోపు సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు ఈ నెల 25 నాటికి 18 సంవత్సరాలు పైబడి 45 లోపల ఉండాలని తెలిపారు. సదరం ధ్రువీకరణ ప్రకారం 70శాతం అంతకంటే ఎక్కువ ఉన్నవారు అర్హులన్నారు. కుటుంబ వార్షిక ఆదాయం రూ.3 లక్షలు దాటకూడదన్నారు. మోటారు వాహనచట్టం ప్రకారం చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్సు ఉండాలన్నారు.



అధికారులకు అవగాహన కల్పిస్తున్న బయాలజిస్టు రమేష్

పులుల గణనపై అటవీ అధికారులకు శిక్షణ

మంగళం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): వచ్చే నెలలో పులుల గణన ప్రారంభం కానుంది. ఇందులో భాగంగా తిరుపతిలోని బయోట్రిమ్‌లో తిరుపతి, అన్నమయ్య జిల్లాల పరిధిలోని 20మంది ఎఫ్‌ఆర్వోలు, ఇద్దరు బయాలజిస్టులు, సిబ్బదికి మంగళవారం శిక్షణ ఇచ్చారు. పులు గణన ఎలా చేపట్టాలి, ట్రాప్ కెమెరాల ఏర్పాటు లాంటి అంశాలపై బయాలజిస్ట్ రమేష్ అవగాహన కల్పించారు. కొంతకాలం క్రితం శేషాచల అటవీప్రాంతంలో ఉనికి గుర్తింపుతో శిక్షణ ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. శేషాచలాన్ని టైగర్‌కారిడార్‌గా ప్రకటించిన నేపథ్యంలో పెద్దపులులు సంచారం ఉందో లేదో త్వరలోనే స్పష్టంకానుంది. జిల్లా అటవీశాఖ అధికారి సాయిబాబా, బయోట్రిమ్ స్టేట్ సెల్వి కల్చరిస్టు బబిత, అటవీసిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మౌలానా అబుల్ కలాం అజాద్ జయంతి



కార్యక్రమంలో పాల్గొన్న డీఆర్వో నరసింహులు

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 11(ఆంధ్రజ్యోతి): స్వతంత్ర భారతదేశానికి తొలి విద్యాశాఖమంత్రిగా విశేష సేవలు అందించిన మౌలానా అబుల్‌కలాం ఆజాద్ జయంతి వేడుకలను మంగళవారం కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. డీఆర్వోనరసింహులు మాట్లాడుతూ గాంధేయవాది మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశ స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. తొలి విద్యాశాఖ మంత్రిగా దేశానికి విశేష సేవలు అందించారన్నారు. బాలబాలికలకు సమాన విద్యావకాశాలు కల్పించాలని ఆయన పిలుపునిచ్చారన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ ఈడీ హరినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు కేంద్రమంత్రి రాక

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ ఒక రోజు పర్యటన నిమిత్తం బుధవారం జిల్లాకు విచ్చేస్తున్నారు. ఉదయం 11.20గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నేరుగా తిరుచానూరు బాలాజీ కల్యాణ మండపంలో జరిగే బీజేపీ మహిళా మోర్చా సమావేశానికి హాజరవుతారు. మధ్యాహ్నం 3గంటలకు రేణిగుంట రోడ్డులోని అంబేడ్కర్ గ్లోబల్ లా ఇన్‌స్టిట్యూట్‌లో ఆత్మనిర్భర్ భారత్ సెమినార్ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్‌తో కలిసి కేంద్రమంత్రి పాల్గొంటారు. రాత్రి 7గంటలకు తిరుచానూరు రాహుల్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగే ఓ వివాహానికి హాజరైన అనంతరం అక్కడి నుంచి తిరుపతి రైల్వేస్టేషన్‌కు చేరుకుని తిరుమల ఎక్స్‌ప్రెస్‌లో వైజాగ్ బయలుదేరి వెళతారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో 46 మందికి జరిమానా

తిరుపతి (నేరవిభాగం), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరంలో మంగళవారం ట్రాఫిక్ పోలీసులు డ్రంకెన్ డ్రైవ్‌పై తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో మద్యం తాగి వాహనాలు నడిపిన 46 మందిపై, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న 26 మందిపై కేసులు నమోదు చేశారు. అనంతరం వీరిని అదనపు జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి సంధ్యారాణి విచారించారు. మద్యం తాగి వాహనం నడిపిన 46 మందికి రూ.పది వేల చొప్పున, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించిన వారికి రూ.500 చొప్పున రూ.13 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. మద్యం తాగి వాహనాలు నడపడం ద్వారా మీ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలనూ ప్రమాదంలోకి నెట్టే చర్యలకు పాల్పడవద్దని ఎస్పీ సుబ్బరాయుడు సూచించారు.

పూడిక, ఆక్రమణలతో సాగునీటికి గండి

●రాయల చెరువు నీరు స్వర్ణముఖి నదిపాలు ● చాన్నాళ్లుగా చేపట్టని మరమ్మతులు





నక్కలవాగులోకి వృథాగా పోతున్న నీరు - పూడిపోయిన చిన్నకాలువ -జలకళ ఉట్టిపడుతున్న రాయలచెరువు

రామచంద్రాపురం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రాయలచెరువులో నీరున్నా పూడికలు,ఆక్రమణలు సాగుకు సమస్యగా మారాయి. కొన్నేళ్లుగా మరమ్మతుకు పైసా ఖర్చు చేయకపోవడంతో ప్రధాన కాలువకు పూడిక ఏర్పడింది. దీంతో కొందరు దీనిని తమ పొలాల్లో కలుపుకున్నారు. ఫలితంగా పీవీపురం వద్ద నక్కల వంక ద్వారా చెరువు నీరు వృథాగా స్వర్ణముఖి నదిలో కలిసి సముద్రం పాలవుతోంది. చాన్నాళ్ల క్రితం 1,750 ఎకరాల విస్తీర్ణంలో రెండు గుట్టల నడుమ ఆనకట్టను కట్టి రాయలచెరువును ఏర్పాటుచేశారు. ఇది నిండితే ఐదు కిలోమీటర్ల దూరం సాగునీరు అందేది. పదేళ్లుగా వర్షాకాలంలో నీరు చేరుతూనే ఉంది. ప్రస్తుతం రెండేళ్లకు సరిపడా సాగునీరు ఉంది. 30 ఏళ్ల క్రితం చెరువు తూము నుంచి సంజీవరాయపురం వరకు ప్రధాన కాలువకు గట్టు కట్టారు. ఇది అక్కడక్కడ చీలికలు ఏర్పడి నీరు పొలాలపైకి వెళుతోంది. అక్కడి నుంచి పీవీపురం, గంగమాంబపురం, గంగిరెడ్డి పల్లి వరకు పెద్దకాలువ వచ్చి మూడు కాలువలుగా చీలి కమ్మకండ్రిగ, మిట్టూరు, నడవలూరు వరకు సాగునీరు వచ్చేది. ఈ కాలువలకు పూడిక ఏర్పడటంతో రైతులు పొలాల్లో కలుపుకొన్నారు. గతంలో పీవీపురం వద్ద నీరు కాలువల్లోకి వచ్చేందుకు గేట్లు వుండేవి. అవి ధ్వంసం కావడంతో నీరు వృథాగా పోతోంది. ప్రధాన కాలువకు పూడిక తీసి ఆక్రమణలు తొలగిస్తే దాదాపు వెయ్యి ఎకరాలకు సాగునీరు అందుతుందని ఈ ప్రాంత రైతులు చెబుతున్నారు.

కాలువ పూడిక తీయాలి



రాయలచెరువు నుంచి గంగిరెడ్డిపల్లి వరకు ప్రధాన కాలువకు పూడిక తీస్తే పొలాలకు నీరు వస్తుంది. కరెంటు ఉన్నా లేకపోయినా రైతులు ఏడాదిలో మూడు పంటలు పెట్టుకునే వసతి ఏర్పడుతుంది.

-హరినాథరెడ్డి, గంగిరెడ్డిపల్లి.

నిధులు కేటాయించండి



రాయలచెరువు అభివృద్ధికి నిధులు కేటాయించాలి. చెరువుకట్టను పటిష్టంగా తయారు చేయాలి. ఇబ్బందిగా మారిని ప్రధాన కాలువకు మరమ్మతులు చేస్తే మూడు కిలోమీటర్ల దూరం రైతులకు నీరు అందుతుంది.

-ఎం.హరి, గంగిరెడ్డి పల్లి

అమ్మవారి బ్రహ్మోత్సవాలకు పక్కాగా ఏర్పాట్లు

● 20న అమ్మవారి దర్శనానికి రాష్ట్రపతి రాక ● ఏర్పాట్లు పరిశీలించిన టీటీడీ ఈవో,అధికారులు



బ్రహ్మోత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, కలెక్టర్ వెంకటేశ్వర్ తదితరులు

తిరుచానూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారి వార్షిక కార్తీక బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ తెలిపారు. మంగళవారం ఆయన కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడుతో కలిసి తిరుచానూరులో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఏటా పెరుగుతున్న భక్తుల సంఖ్యకు అనుగుణంగా ప్రణాళికాయుతంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనిస్తున్నామన్నారు. అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. పంచమి తీర్థం రోజున 75వేలమంది భక్తులు వచ్చే అవకాశమున్న అన్నప్రసాదాలు సిద్ధం చేసుకోవాలన్నారు. పటిష్ట క్యూలైన్లు, జర్మన్‌షెడ్లు ఏర్పాటుతోపాటు పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. దాదాపు 600మంది పోలీసులు, 700మంది టీటీడీ సెక్యూరిటీ, 900మంది శ్రీవారి సేవకులు, 2వేలమంది పారిశుధ్య కార్మికులు సేవలు అందిస్తారన్నారు. బ్రహ్మోత్సవాల జరిగే సమయంలో అమ్మవారిని ఈనెల 20 రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము దర్శించుకోనున్న క్రమంలో భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు చేపడుతున్నామన్నారు. కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ శ్రీవారి ఆలయం నుంచి తిరుచానూరు వరకు సారె ఊరేగింపు సందర్భంగా పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. టీటీడీ జేఈవో వీరబ్రహ్మం మాట్లాడుతూ 17న రాష్ట్ర ప్రభుత్వం తరపున దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పట్టువస్త్రాలు సమర్పించనున్నారని తెలిపారు. ఎస్పీ సుబ్బరాయుడు మాట్లాడుతూ తొక్కిసలాటలు, తోపులాటలు లేకుండా భారీస్థాయిలో పోలీసు సిబ్బందిని నియమిస్తున్నామన్నారు. సీవీఎస్వో మురళీకృష్ణ, అదనపు ఎస్పీ రవి మనోహరాచారి,డీఎస్పీ ప్రసాద్, డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, అర్చకులు బాబుస్వామి, మణికంఠ స్వామి,ఏవీఎస్వో రాధాకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు

ఇద్దరు బాలికల మిస్సింగ్

తిరుపతి (నేర వార్తలు), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం సాయినగర్‌లో ఇద్దరు బాలికలు తప్పిపోయారు. ఓ బాలికల వసతి గృహంలో నక్షత్ర, అలేఖ్య అనే ఇద్దరు బాలికలు టాయ్‌లెట్‌కు వెళుతున్నామని చెప్పి వెళ్లి తిరిగిరాలేదు. దీనిపై వార్డెన్ శ్రీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు తెలిపారు.



నక్షత్ర, అలేఖ్య

24న కొట్టాయంకు ప్రత్యేక రైలు

హైదరాబాద్-కొల్లాం స్పెషల్ ట్రైన్స్ జనవరి 19 వరకు పొడిగింపు

హైదరాబాద్ సిటీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): శబరిమలకు వెళ్లే భక్తుల కోసం చర్లపల్లి-కొట్టాయం మార్గంలో రెండు ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్టు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. ఈ నెల 24న 07115 ప్రత్యేక రైలు చర్లపల్లి నుంచి కొట్టాయంకు, 25న 07116 ప్రత్యేక రైలు కొట్టాయం నుంచి చర్లపల్లికి బయల్దేరుతుందని సీపీఆర్‌ఓ శ్రీధర్ తెలిపారు. ఈ రైళ్లకు భువనగిరి, జనగాం, ఖాజీపేట్, వరంగల్, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం, విజయవాడ, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, తిరుపతి, చిత్తూరు తదితర స్టేషన్లలో హాల్ట్ కల్పించినట్టు వెల్లడించారు. హైదరాబాద్-కొల్లాం మార్గంలో ప్రతి శని, సోమవారాల్లో నడుస్తున్న ప్రత్యేక (07193/07194) రైళ్లను జనవరి 19 వరకు పొడిగిస్తున్నట్టు తెలిపారు.

రెండు లారీల ఢీ

కుక్కలదొడ్డి వద్ద స్తంభించిన ట్రాఫిక్

రేణిగుంట నవంబర్ 11 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట, కడప మార్గంలోని కుక్కలదొడ్డి సమీపంలో మంగళవారం ఉదయం రెండు లారీలు ఢీకొనడంతో రాకపోకలు స్తంభించాయి. కుక్కల దొడ్డి మలుపు వద్ద సరుకుతో వెళ్తున్న రెండు టిప్పర్ లారీలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఈ పరిస్థితి తలెత్తింది. తెల్లవారుజామున ప్రమాదం జరగడంతో పెద్దగా వాహనాల రాకపోకలు లేకపోయినా ఉదయం 8 గంటలకు సుమారు 5 కిలోమీటర్ల ఇరువైపులా వాహనాలు స్తంభించాయి. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఓ టిప్పర్‌లోని సరుకును పక్కకు దింపి అనంతరం వాహనాన్ని పక్కకు జరిపి రాకపోకలను పునరుద్ధరించారు.



కల్తీ నెయ్యిపై జగన్ సమాధానం చెప్పాలి

●శ్రీవారి లడ్డూపై భక్తుల మనోభావాలు దెబ్బతీశారు ● వైవీ సుబ్బారెడ్డిని కాపాడేందుకు మాజీ సీఎం ప్రయత్నం



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న రవినాయుడు

చిత్తూరు సిటీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి):తిరుమలకు సరఫరా అయిన కల్తీ నెయ్యిపై మాజీ సీఎం జగన్ సమాధానం చెప్పాలని శాప్ చైర్మన్ రవినాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం చిత్తూరులోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం తిరుమల శ్రీవారి పవిత్రతను దెబ్బతీసిందన్నారు. పవిత్రమైన లడ్డూ తయారీలో నకిలీ నెయ్యి వినియోగించి భక్తుల మనోభావాలు దెబ్బతీశారని చెప్పారు. కల్తీ నెయ్యి కుంభకోణంలో బాబాయి వైవీ సుబ్బారెడ్డిని కాపాడేందుకు జగన్ ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో టీటీడీకి నెయ్యి సరఫరా చేసే కాంట్రాక్ట్‌లో భారీ గోల్‌మాల్ జరిగిందన్నారు. సొంతంగా డెయిరీ ఉండి, పాలసేకరణ, నెయ్యి , వెన్న, తయారీలో సుదీర్ఘ అనుభవమున్న కంపెనీలకు మాత్రమే ఈ టెండర్లలో పాల్గొనే అర్హత ఉన్నప్పటికీ .. ఇవేమీ పట్టించుకోకుండా కమీషన్లకోసం ఏమాత్రం అర్హతలేని వారికి కాంట్రాక్టులు ఇచ్చారన్నారు. ఎమ్మెల్సీ దొరబాబు మాట్లాడుతూ జగన్ హయాంలో శ్రీవారి ప్రసాదాల తయారీకి కల్తీ నెయ్యి సరఫరా చేసినట్లు 2024 సెప్టెంబర్‌లోనే కూటమి ప్రభుత్వం చెప్పిందన్నారు. దీంతో అప్పుడే వైసీపీ నేతలు రివర్స్ డ్రామా మొదలు పెట్టారన్నారు. చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్ మాట్లాడుతూ తిరుమల వెంకన్నతో పెట్టుకున్న వారెవరూ బాగుపడిన చరిత్రలేదన్నారు.చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత,మేయర్ అముద, మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ త్యాగరాజులు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఝాన్సీ వెంకటేష్ యాదవ్,మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్,చిత్తూరు నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు సునీల్ కుమార్, మోహన్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

శబరిమల యాత్రకు ప్రత్యేక బస్సులు

తిరుపతి(ఆర్టీసీ), నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కేరళలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శబరిమలకు ప్రత్యేక ఆర్టీసీ బస్సులు ఏర్పాటుచేసినట్లు తిరుపతి డిపో మేనేజర్ సురేంద్రకుమార్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికే అయ్యప్పభక్తుల 11 బృందాలు బస్సులను ముందస్తుగా నమోదు చేసుకున్నారని గుర్తుచేశారు. కొత్త బస్సులు అందుబాటులో ఉన్నాయని, ఇద్దరు సుదీర్ఘ అనుభవం కలిగిన డ్రైవర్లను పంపుతామన్నారు. కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో ఎటువంటి ఆర్టీవో పన్నులు, అదనపు పన్నులు చెల్లించవసిన అవసరం లేదు. ఉచిత పార్కింగ్ సదుపాయం, వంట మనుషులు, గురుస్వామి, అటెండర్‌తో కలిపి ఏడుమందికి ఉచిత ప్రయాణం ఇస్తామన్నారు. ఆసక్తిగల అయ్యప్ప భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాల కోసం 9959225670, 8919188133, 7382881507 నెంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

ధిక్కార స్వరం.. అందెశ్రీ

● సంస్మరణ సభలో వక్తల నివాళి



అందెశ్రీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న దృశ్యం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రచయితగా, గాయకుడిగా తెలుగు నేలపై ఒక ధిక్కార స్వరంగా అందెశ్రీ నిలిచారని పలువురు వక్తలు నివాళి అర్పించారు. వేమన విజ్ఞాన కేంద్రం, సాహితీ స్రవంతి సంస్థల ఆధ్వర్యంలో మంగళవారం సీపీఎం జిల్లా కార్యాలయంలో అందెశ్రీ సంస్మరణ సభ చేపట్టారు. ఇందులో నగర ప్రముఖులు టెంకాయల దామోదరం, సీనియర్ జర్నలిస్టు ఆలూరి రాఘవశర్మ, వేమన విజ్ఞాన కేంద్రం కార్యదర్శి మల్లారపు నాగార్జున, సాహితీ స్రవంతి కన్వీనర్ వెంకటరమణ, తిరుపతి జిల్లా రచయితల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సాకం నాగరాజ, మన్నవ గంగాధరప్రసాద్, ప్రజా నాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి పెంచలయ్య, ఈతరం కవితా వేదిక ప్రతినిధి తోట వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొని మాట్లాడారు. ప్రజా పక్షం వహించిన సాహిత్యవేత్త అందెశ్రీ అని కొనియాడారు. అందెశ్రీ పాటలు ప్రజల మనసులో పదిలంగా ఉంటాయని అన్నారు. ఈ తరం కవులు, కళాకారులకు అందెశ్రీ జీవితం ఆదర్శనీయమని పేర్కొన్నారు. జానపద కళాకారులు కడివేటి మునిరత్నం, రెడ్డి ప్రసాద్, సోమశేఖర్ తదితరులు అందెశ్రీ రాసిన పాటలు పాడారు. ఈ కార్యక్రమంలో సాహిత్యవేత్తలు గురునాథం, రెడ్డెప్ప, నెమిలేటి కిట్టన్న, మునిరాజు తదితరులు పాల్గొన్నారు.

రైతు పక్షపాతి సీఎం చంద్రబాబు



రైతులకు యూరియా పంపిణీ చేస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రమీల

కోట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రైతు సంక్షేమం కోసం కోట్లాది రూపాయలతో అనేక పథకాలు అమలు చేస్తున్నారని వాకాడు వ్యవసాయ మార్కెట్ చైర్మన్ మర్రి ప్రమీల అన్నారు. కోట మండల పరిధిలోని చిట్టేడు, చెందోడు సహకార సంఘం, రైతు సేవా కేంద్రాల్లో మంగళవారం రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రమీల మాట్లాడుతూ ప్రతి రైతుకూ అవసరమైన యూరియా పంపిణీ చేయడం జరుగుతుందని, రైతులు ఆందోళన చెందవద్దన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ ఉపాధ్యక్షుడు కృష్ణపట్నం చంద్రశేఖర్, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి వాకా విజయభాస్కర్‌రెడ్డి, చిట్టేడు సహకార సంఘ చైర్మన్ చాపల శ్రీనివాసులు, చిట్టేడు ఉప సర్పంచ్ వెంకటేశ్వర్లు, భూపతి, నాయకులు పుచ్చలపల్లి సుధాకర్‌రెడ్డి, బాలసుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ దారా సురేష్, ఏవో సుచేంద్రప్రసాద్, సాయికుమార్, పంచాయతీ కార్యదర్శి కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి ఆర్చరీ పోటీలకు ప్రగతి విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రగతి విద్యాసంస్థల చైర్మన్ కిషోర్

కోట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి విలువిద్య పోటీలకు కోటలోని ప్రగతి విద్యాసంస్థల విద్యార్థులు ఎంపికయ్యారు. అల్లూరు సీతారామరాజు జిల్లా పాడేరులో ఈనెల 7, 8, 9 తేదీల్లో రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ విలువిద్య పోటీలు జరిగాయి. ప్రగతి విద్యానికేతన్‌లో 9వ తరగతి చదువుతున్న నిశ్వత అండర్14 విభాగంలో సిల్వర్ మెడల్ సాధించి జాతీయ పోటీలకు ఎంపికైంది. ఈ విద్యార్థిని ఈనెల 18 నుంచి 21వ తేదీ వరకు వారణాసిలో జరిగే జాతీయస్థాయి విలువిద్య పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తుంది. అదే విధంగా అండర్ 17 విభాగంలో ప్రగతి జూనియర్ కళాశాల విద్యార్థి చరణ్ క్యాంస పతకం సాధించి జాతీయస్థాయి విలువిద్య పోటీలకు అర్హత సాధించాడు. ఈ విద్యార్థి జనవరి 5 నుంచి 10వ తేదీ వరకు జార్ఖండ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఆంధ్రప్రదేశ్ తరపున ప్రాతినిధ్యం వహిస్తాడు. విద్యార్థులను మంగళవారం విద్యాసంస్థల చైర్మన్ పసుపులేటి కిషోర్ షీల్డులు, మెమెంటోలతో అభినందించారు.

రైస్ మిల్లుల్లో రెవెన్యూ అధికారుల తనిఖీలు

సూళ్లూరుపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పలు రైస్‌మిల్లుల్లో మంగళవారం రెవెన్యూ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఆర్‌ఐ రాజగోపాల్, వీఆర్వోలు రైస్‌మిల్లుల్లో బియ్యాన్ని పరిశీలించారు. వ్యాపారులకు, దుకాణాలకు సరఫరా చేసే బియ్యం నాణ్యత, తూకంలో నిబంధనలు పాటించాలని స్పష్టం చేశారు. బియ్యం నిల్వ, సరఫరా వివరాలతో కూడిన రికార్డులు నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈఆర్వో ఉషా తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ నమోదుకు ప్రత్యేక క్యాంపులు

వాకాడు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆరేళ్ల లోపు పిల్లల కోసం ప్రత్యేక ఆధార్ నమోదు క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు ఇక్బాల్ సయ్యద్, ఎంపీడీవో సాయిప్రసాద్ చెప్పారు. మంగళవారం తూపిలిపాళెం గ్రామంలోని గిరిజనులతో వారు మాట్లాడారు. ఆధార్ ప్రత్యేక క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

డిజిటల్ బ్యాంకింగ్, సైబర్ నేరాలపై అవగాహన

బాలాయపల్లి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగమాంబపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు డిజిటల్ బ్యాంకింగ్, సైబర్ నేరాలపై మంగళవారం ప్రిన్సిపాల్ అరుణకుమారి అవగహన కల్పించారు. ఫోన్‌లో వచ్చే అనవసర మెసేజ్‌లకు సమాధానం ఇవ్వవద్దని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది సోమశేఖర్, భాస్కర్, మునీంద్ర, విజయమ్మ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

సూళ్లూరుపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలోని సూళ్లూరులో మంగళవారం నెల్లూరు నారాయణ వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి వచ్చిన వారికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఆకుతోట రమేష్, కౌన్సిలర్ ఈదూరు చెంగమ్మ, మాజీ ఎంపీపీ పిట్ల సుబ్రహ్మణ్యం, టీడీపీ నాయకులు వెంకటస్వామి, ఆలీ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి న్యాయం చేయండి



జాతీయ రహదారిపై బైఠాయించిన బాధితులు, గ్రామస్తులు

నాయుడుపేట టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - శ్రీకాళహస్తి బైపాస్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అర్ధమాలవాసి శివ మృతి చెందిన సంఘటన విదితమే. మృతుడు కుటుంబానికి న్యాయం చేయాలంటూ మంగళవారం బాధిత కుటుంబసభ్యులు, గ్రామస్తులు నాయుడుపేట - పూతలపట్టు రోడ్డుపై బైఠాయించారు. సమాచారం తెలుసుకున్న అర్బన్ సీఐ బాబి, ఎస్‌ఐ ఆదిలక్ష్మి సంఘటనాస్థలికి చేరుకొని మృతుడి కుటుంబసభ్యులతో మాట్లాడి అక్కడ నుంచి పంపించేశారు.

7న అయ్యప్పస్వామి జ్యోతుల గ్రామోత్సవం

సూళ్లూరుపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో ఏటా నిర్వహించే అయ్యప్పస్వామి జ్యోతుల గ్రామోత్సవం వచ్చే నెల 7న జరగనుంది. ఇందుకు సంబంధించి ఆహ్వాన ప్రతులను మంగళవారం షార్ బస్టాండులో ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ఆవిష్కరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు లీలా మోహన్ రెడ్డి, రవీంద్ర రెడ్డి, చంద్రమౌళి రెడ్డి, హరినారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌జీవోల సమస్యలను పరిష్కరించాలి

కోట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎన్‌జీవోల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. కోటలోని మండల పరిషత్, తహసీల్దారు, వ్యవసాయశాఖ, ఐసీడీఎస్ కార్యాలయాల ఎదుట మంగళవారం ఎన్‌జీవో నాయకులు నిరసన తెలిపారు. అనంతరం ఆయా కార్యాలయాల్లో ఎన్‌జీవో సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో ఎన్‌జీవో అసోసియేషన్ వాకాడు తాలూకా అధ్యక్షుడు కృష్ణయ్య, జిల్లా చైర్మన్ సురేష్‌బాబు, కన్వీనర్ రఘు, ఫనికుమార్, శ్రీనివాసులు, గురుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే విజయశ్రీకి సన్మానం

పెళ్లకూరు, నవంబరు, 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శిరసనంబేడులో ఎంఎస్ఎంఈ పార్క్ శంకుస్థాపన చేసేందుకు విచ్చేసిన ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీకి టీడీపీ నాయకులు స్వాగతం పలికారు. కేఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వేలూరు కల్యాణిరెడ్డి, సర్పంచు గుంటపూడి పెంచలయ్య తదితరులు ఎమ్మెల్యేను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు.



ఎమ్మెల్యే నెలవల విజయశ్రీని సత్కరిస్తున్న వేలూరు కల్యాణ్‌రెడ్డి

ఆటో బోల్తా: డ్రైవర్‌కు గాయాలు

వాకాడు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆటో అదుపుతప్పి బోల్తా పడడంతో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... మండలంలోని పంబలి గ్రామానికి చెందిన వీరరాఘవారెడ్డి తన ఆటోలో కోట పట్టణానికి వెళ్తూ స్వర్ణముఖి బ్యారేజీ సమీపంలో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వీరరాఘవారెడ్డికి కుడికాలుకు తీవ్ర గాయాలవడంతో ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మంత్రి నిమ్మలకు సన్మానం



మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యే విజయశ్రీ, సుబ్రహ్మణ్యంను గజమాలతో సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

నాయుడుపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును టీడీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. నాయుడుపేట, మేనకూరు సెజ్, పెళ్లకూరు మండలాల్లో పలు పరిశ్రమల శంకుస్థాపనకు వచ్చిన మంత్రి ముందుగా నాయుడుపేట పట్టణంలోని టీడీపీ కార్యాలయానికి చేరుకున్నారు. ఎమ్మెల్యే విజయశ్రీ మంత్రికి ఘనంగా స్వాగతం పలికారు. మంత్రి నిమ్మల రామానాయుడుతో పాటు ఎమ్మెల్యే విజయశ్రీ, నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యంను టీడీపీ నాయకులు, కార్యకర్తలు గజమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో విజయభాస్కర్‌రెడ్డి, రఫీ, ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్‌కుమార్, సుధాకర్‌రెడ్డి, చంద్రారెడ్డి, వెంకటరమణారెడ్డి, సెల్వం, రాజేష్, సుధీర్, పగడాల శివప్రదీప్, నిత్యకృష్ణారెడ్డి, సంచి కృష్ణయ్య, సుబ్బారావు, నారాయణ, రవి, చెంగయ్య, భాస్కర్, శ్రీనివాసులు, చెంచయ్య, విజయకుమార్ నాయుడు, మైలారి రాజశేఖర్, చంద్రశేఖర్‌రెడ్డి, అశోక్, సుధాకర్ పాల్గొన్నారు.

ఆదర్శనీయుడు అజాద్

గూడూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): దేశ తొలి విద్యాశాఖ మంత్రి డాక్టర్ అబుల్ కలామ్ అజాద్ ఆదర్శనీయుడని పలువురు ప్రశంసించారు. మంగళవారం అజాద్ జయంతి సందర్భంగా స్థానిక ఆర్‌అండ్‌బీ కార్యాలయం సమీపంలోని ఆయన విగ్రహానికి సీపీఐ, కాంగ్రెస్, బీఎస్పీ, ప్రజాసంఘాలు, మైనారిటీ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో నివాళులర్పించారు. కార్యక్రమంలో జమాలుల్లా, ప్రభాకర్, భాస్కర్‌గౌడ్, విజయ్‌కుమార్, ఫయాజ్, శశికుమార్, సునీల్, గౌసఖబాషా, ఇబ్రహీం, సిసింద్రీ, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల నాణ్యత పరిశీలన

గూడూరు అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలో 2023లో నిర్మించిన పలు రోడ్లను విజిలెన్స్ అధికారులు మంగళవారం పరిశీలించారు. రోడ్ల నిర్మాణాల నాణ్యతను పరిశీలించేందుకు పలుచోట్ల నమూనాలను సేకరించారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



పేదలకు దుప్పట్లను పంపిణీ చేస్తున్న బాస్ సభ్యులు

గూడూరు అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక మధురెడ్డికాలనీ సమీపంలో మంగళవారం బాస్ స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. సంస్థ ప్రతినిధి కూరపాటి రవీంద్రబాబు, శోభారాణి, సుప్రియ, శాంతి, యశ్వంత్, సాయి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దారుకు అభినందన



తహసీల్దారు జయజయరావును సన్మానిస్తున్న అటవీశాఖ అధికారి శ్రీనివాసులు తదితరులు

కోట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ సమయంలో విస్తృతంగా సహాయక చర్యలు చేపట్టి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ప్రసంశాపత్రం అందుకున్న జయజయరావును మంగళవారం అటవీశాఖ అధికారులు సన్మానించారు. అటవీశాఖ అధికారి గాయం శ్రీనివాసులు ఆధ్వర్యంలో బీట్ ఆఫీసర్లు తహసీల్దారును పూలమాలలు, శాలువాలతో అభినందించారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల అందజేత



సీఎం సహాయనిధి లబ్ధిదారులతో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, నవంబర్ 11(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి నియోజకవర్గంలో 58మందికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.34,30,660 లక్షలు మంజూరయ్యాయి. ఆ చెక్కులను ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ లబ్ధిదారులకు మంగళవారం అందజేశారు.

ఉద్యాన రాయితీలను సద్వినియోగం చేసుకోండి

వెంకటగిరి టౌన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఉద్యాన పంటలకు అందజేస్తున్న రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆ శాఖ అధికారి ఆనంద్‌రెడ్డి కోరారు. ఇందుకు పండ్ల తోటల రైతులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

నేడు వైసీపీ ర్యాలీ

వెంకటగిరి టౌన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన కోటి సంతకాల సేకరణ ఉద్యమంలో భాగంగా బుధవారం ర్యాలీ నిర్వహించనున్నట్లు వైసీపీ పట్టణ కన్వీనర్ పులి ప్రసాద్ రెడ్డి మంగళవారం తెలిపారు. వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్ నేతృత్వంలో నిర్వహించే ఈ ర్యాలీ బుధవారం ఉదయం 9గంటలకు ఎన్‌జేఆర్ భవన్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు జరుగు తుందన్నారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

సప్లయ్ చానళ్లను పునరుద్ధరించకుంటే ఉద్యమిస్తాం

సాగరమాల రోడ్డు పనులను అడ్డుకుని రైతుల నిరసన



నెల్లూరుపల్లి కొత్తపాళెం వద్ద టిప్పర్లను అడ్డుకుని రైతుల నిరసన

కోట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సాగరమాల రోడ్డు పనుల కారణంగా పూడిపోయిన సప్లయ్ చానళ్లను పునరుద్ధరించకుంటే ఉద్యమిస్తామని రైతులు హెచ్చరించారు. మంగళవారం కోట మండలం నెల్లూరుపల్లి కొత్తపాళెం వద్ద సాగరమాల రోడ్డు పనులకు గ్రావెల్ తరలిస్తున్న వాహనాలను నెల్లూరుపల్లి, కొత్తపాళెం, విశ్వనాథపురం అగ్రహారం గ్రామాల రైతులు అడ్డుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని పెన్నక్కచెరువు నుంచి 16 సప్లయ్ చానళ్ల ద్వారా 9వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. సాగరమాల రోడ్డు పనులతో ఈ సప్లయ్ చానళ్లు పూడిపోయాయని, ఏడాది సెప్టెంబరు లోపు సప్లయ్ చానళ్లను పునరుద్ధరించి చెరువునీరు ఆయకట్టు భూములకు వెళ్లేలా చూస్తామని కాంట్రాక్టరు హామీ ఇవ్వడం జరిగిందన్నారు. అయితే నవంబరు నెల సగం పూర్తయినా ఇప్పటి వరకు సప్లయ్ చానళ్లను పునరుద్ధరించకపోవడంతో చెరువునీటిని ఆయకట్టు భూములకు వాడుకోలేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. తక్షణమే స్పందించి సప్లయ్ చానళ్లను పునరుద్ధరించాలని, లేకుంటే ఉద్యమం చేపడతామని రైతులు స్పష్టం చేశారు.

ఢిల్లీలో దాడులు విచారకరం

గూడూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీలో బాంబుదాడులు విచాకరమని సీపీఐ నాయకులు అన్నారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఢిల్లీ దుర్ఘటనలో మృతి చెందిన వారి ఒక్కో కుటుంబానికి రూ.25 లక్షలు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ దారుణానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో శశికుమార్, సునీల్, జమాలుల్లా, ఇలియాజ్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫిట్‌నెస్‌లేని పాఠశాలల బస్సులు

అధికారుల పరిశీలనలో బట్టబయలు



బస్సు డ్రైవర్‌తో మాట్లాడుతున్న రవాణాశాఖ అధికారులు

సూళ్లూరుపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ పాఠశాలల యజమానులు విద్యార్థులను తీసుకెళ్లే బస్సుల ఫిట్‌నెస్ విషయంలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తున్న యాజమాన్యాలు విద్యార్థుల భద్రతను గాలికొదిలేస్తున్నాయి. సాక్షాత్తు రవాణాశాఖ అధికారి అనిల్ కుమార్, సీఐ మురళీకృష్ణ ఆధ్వర్యంలో ప్రైవేట్ పాఠశాలల బస్సుల ఫిట్‌నెస్ పరిశీలనలో ఈ విషయం బట్టబయలైంది. మంగళవారం సూళ్లూరుపేట జూనియర్ కళాశాల మైదానంలో సూళ్లూరుపేట, తడ ప్రాంతాల్లో ఉన్న ప్రైవేట్ పాఠశాలలకు చెందిన బస్సుల ఫిట్‌నెస్‌ను విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో పరిశీలించారు. కాలం చెల్లిన బస్సులు, తెరచుకోని అత్యవసర ద్వారాలు, తుప్పుపట్టి పనిచేయని సేఫ్టీ పరికరాలను చూసి అధికారులు ముక్కున వేలేసుకున్నారు. విద్యార్థులను తీసుకెళ్లే బస్సుల ఫిట్‌నెస్ విషయంలో నిర్లక్ష్యం తగదని, డ్రైవర్లు కూడా నిబంధనలు పాటించాలని రవాణాశాఖాధికారి అనిల్ కుమార్ ఆదేశించారు.

స్వామిత్వపై అవగాహన

కోట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సిద్ధవరం సచివాలయంలో మంగళవారం స్వామిత్వపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఎంపీడీవో దిలీప్‌కుమార్ నాయక్ మాట్లాడుతూ గ్రామకంఠ భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న స్థలాలకు స్వామిత్వ ద్వారా హక్కులు కల్పించడం జరుగుతుందన్నారు. మండలంలోని 21పంచాయతీల్లో సర్వేను నిర్వహిస్తున్నామని చెప్పారు. సర్పంచ్ ఇంగిలాల సుజాత, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శివాలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం



కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న కిడాంబి మురళి దంపతులు

సూళ్లూరుపేట, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని బ్రాహ్మణ వీధిలో రామాలయం పక్కనే నిర్మించనున్న శివాలయానికి మంగళవారం సూళ్లూరుపేట పట్టణానికి చెందిన కిడాంబి మురళి, జయశ్రీ దంపతులు రూ.లక్ష విరాళం అందజేశారు. రామాలయ కమిటీ ఆధ్వర్యంలో దాతల సహకారంతో శివాలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ నేపథ్యంలో దాతలు ముందుకుకొచ్చి ఆలయ నిర్మాణానికి సహకారం అందిస్తున్నారని రామాలయ కమిటీ సభ్యులు కారంశెట్టి మల్లికార్జున శర్మ తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

గూడూరు అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రకృత వ్యవసాయం ద్వారా రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చునని వ్యవసాయశాఖ ఏడీ గోపీనాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని గొల్లపల్లిలో ప్రకృతి వ్యవసాయ దుకాణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కషాయాలు, ద్రావణాలు, జీవామృతం వంటి ప్రకృతి సిద్ధమైన ఎరువులను వినియోగించడం వల్ల భూసారం పెరిగి అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో ఏవో రమేష్, మధు, తిరుమల, ప్రమీలమ్మ, స్వాతి, కృష్ణమ్మ, శివశంకర్, నాగూరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌జీవో సభ్యత్వ నమోదు

వాకాడు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): వాకాడు ట్రెజరీలో ఏపీ ఎన్‌జీవో సభ్యత్వ నమోదు ఆ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టారు. కోట, వాకాడు, చిట్టమూరు తాలూకా అధ్యక్షుడు తిరుమూరు కృష్ణయ్య, సురేష్ బాబు, రఘు, ఫణికుమార్, శ్రీనివాసులు, గురుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా నా క్లయింట్ M/s. Shriram Finance Ltd., Venkatagiri బ్రాంచి మేనేజర్ వారు ఇచ్చిన [illegible]

SCHEDULE

[illegible]

Tayi Vijayakumar, B.Com., B.L., Advocate, Teachers Colony, Venkatagiri. Cell: 9440507929

